




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 276 | శనివారం | 6-09-2025 | మహబూబ్‌నగర్

Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00



అమెరికా ఆధిపత్యంపై ప్రతిఘటన వేదికగా ఎస్‌సిఒ 06

త్వరలోనే పుతిన్‌తో చర్చలు 02
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన

రానున్న 20 రోజుల్లో రోజుకు 10,000 మెట్రిక్ టన్నుల యూరియా 03


## ధరణి దరిద్రాన్ని

# భూభారతితో తొలగిస్తాం

“గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా వారి సమస్య పరిష్కరించలేదు. రెవెన్యూ శాఖ సిబ్బందిని దొంగలుగా, దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు. ‘ధరణి’ భూతాన్ని తెచ్చి భూములను కొల్లగొట్టాలని చూశారు.

- భూమిని చెరబట్టిన వారిని తెలంగాణ ప్రజలు తరిమేసారు
- నాటి పాలకులు చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకే విఆర్‌వి వ్యవస్థ రద్దు చేశారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం
- జిపిఒలకు నియామకపత్రాల అందజేత
- విఆర్‌ఎలు, విఆర్‌ఒలు ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పనిచేయాలని సూచన





ప్రజాపక్షం/హైదరాబాద్

‘‘భూమిని చెరబట్టిన వారిని తెలంగాణ ప్రజలు కనిపించకుండా పోయేంతవరకు తరిమారు. తెలంగాణ సాధనలో, ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములైన విఆర్‌ఓలు, విఆర్‌ఎలు ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పనిచేయాలి. భూభారతి చట్టాలను అమలు చేయడమే కాకుండా సాదా బైనామాల సమస్య పరిష్కరించాలి. ఇది మీ ఆత్మ గౌరవానికి సంబంధించిన సమస్య. గత పాలకులు విఆర్‌ఓలు, విఆర్‌ఎలను తెలంగాణా సమాజంలో దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు. మీ మీద పడ్డ మచ్చను చెరుపుకునే అవకాశం మీకు వచ్చింది. ఆ ముద్రను చెరిపేసి ఆనాటి పాలకుల తప్పుడు విధానాలను ప్రజలకు వివరించండి. విఆర్‌ఓలు, విఆర్‌ఎలపై చేసిన ఆరోపణలు తప్పు అని నిరూపించుకునేలా పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించండి’’ అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ధరణిని బంగాళాఖాతంలో విసిరేస్తామని ఆనాడు చెప్పాం. ఇచ్చిన మాట ప్రకారం ధరణి మహమ్మారిని వదిలించి భూ భారతి చట్టం తీసుకొచ్చాం. ధరణితో పట్టుకున్న దరిద్రాన్ని భూభారతితో పరిష్కరించే ప్రయత్నం చేశాం’ అని సిఎం చెప్పారు. హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం జరిగిన గ్రామ పాలనా అధికారులకు (జిపిఓలు) నియామక పత్రాలను అందజేసే ‘కొలువుల పండుగ’ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, అతిథులుగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి తరువాయి 2లో

## రాష్ట్రానికి నూతన విద్యావిధానం కావాలి

- సమాజంలో రాణించాలంటే విద్య ఒక్కటే మార్గం
- టీచర్లను కుటుంబ పెద్దగా భావించాలి
- విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం చేయాలి
- వీలున్నప్పుడు నేను వస్తా..
- గత పదేళ్లలో విద్యాశాఖ అస్తవ్యస్తం
- గురుపూజోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు కూడా మధ్యాహ్న భోజనం చేయాలని, వీలునప్పుడు తాను కూడా వస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామని, ఇందుకు అందరూ ప్రతిన బూనాలని ఉపాధ్యాయులకు సూచించారు. సింగపూర్ లాంటి ప్రపంచ దేశాల్లో అమలులో ఉన్న నాణ్యమైన, ఉన్నత విద్యావిధానాన్ని అధ్యయనం చేసేందుకు ప్రతి ఏటా రెండు వందల మంది టీచర్లను ఆయా దేశాలకు పంపిస్తామని సిఎం వెల్లడించారు. ‘ఉపాధ్యాయ దినోత్సవ’ం తరువాయి 2లో



## భారత్, రష్యాకు దూరమయ్యాం

- ఆ రెండు దేశాలను చైనాకు కోల్పోయాం : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- అమెరికా-భారత్ సంబంధాలు గత రెండు దశాబ్దాలలో అత్యంత దారుణంగా ఉన్నాయని వ్యాఖ్య

**వాషింగ్టన్ :** తమ నుంచి భారత్, రష్యా దేశాలను చైనా దేశానికి కోల్పోయినట్లు అనిపిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా–భారత్ సంబంధాలు గత రెండు దశాబ్దాలలో అత్యంత దారుణ దశలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ట్రంప్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ట్రూత్ సోషల్’లో తరువాయి 12లో


## 22 నుంచి ఇందిరమ్మ చీరలు



03

## ‘స్థానిక’ ఎన్నికలు బ్యాలెట్‌తోనే..

- కేబినెట్ నిర్ణయాన్ని సమర్థించిన కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



**బెంగళూరు :** స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి బ్యాలెట్ పేపర్‌కు వెళ్లాలనే నిర్ణయాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమర్థించారు. అనుభవం ఆధారంగా తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో భవిష్యత్తులో జరిగే పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎంలు) బదులుగా బ్యాలెట్ పేపర్‌ను ఉపయోగించి నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఇసి)కి సిఫార్సు చేయాలని గురువారం నిర్ణయించింది. బ్యాలెట్ పేపర్‌ను ఉపయోగించడమే తమ ఉద్దేశమని, అనుభవం ఆధారంగానే తిరిగి బ్యాలెట్ పేపర్ పద్ధతిని ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. అనేక దేశాలు ఇవిఎంల నుండి బ్యాలెట్ పేపర్‌కు తిరిగి వచ్చిన ఉదాహరణలు ఉన్నాయని శుక్రవారం మీడియా సమావేశంలో సిద్ధరామయ్య వెల్లడించారు. గురువారం తరువాయి 12లో

# నిమజ్జనానికి సర్వం సన్నద్ధం

- 48 గంటలు అధికార యంత్రాంగం అప్రమత్తం
- 303 కిలోమీటర్ల మార్గంలో శోభాయాత్ర
- 29 వేల మంది పోలీసులు, 3200 ట్రాఫిక్, 15000 మంది శానిటేషన్ సిబ్బంది నిమగ్నం
- హుస్సేన్‌సాగర్ వద్ద 40 క్రేన్‌లు ఏర్పాటు
- ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర
- హైదరాబాద్ మతసామరస్యానికి ప్రతీక.. సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆనందం.. ఆరాధన.. ఆచారం ఈ మూడింటిని కలిపిన పండుగ శిఖర ఘట్టం గణేష్ నిమజ్జనం. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణేషుడు గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. హుస్సేన్ సాగర్ (ట్యాంక్‌బండ్)లో శనివారం జరిగే గణేష్ నిమ్జనానికి ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. పోలీస్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, హెచ్‌ఎండిఎ, జల మండలి, ట్రాఫిక్ పోలీసు, ఆర్ అండ్ బి, హైడ్రా, వైద్య ఆరోగ్య, పర్యాటక, సమాచార శాఖలను రంగంలోకి దిగాయి. విధుల్లో ఉన్న అధికారులందరులకు 48 గంటల పాటు హై అలర్ట్ ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తులో 29 వేల మంది పోలీసులు, 3200 మంది ట్రాఫిక్ పోలీసులు పాల్గొంటున్నారని పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. ఇక 15000 మంది శానిటేషన్ సిబ్బంది నిమజ్జన విధుల్లో పాల్గొంటున్నారని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనం కోసం 303 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో శోభాయాత్ర జరగనుంది. నిమజ్జనానికి సుమారు 50 వేలకు పైగా గణనాథులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నిమజ్జనం సాఫీగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై 40 క్రేన్‌లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఖైరతాబాద్ వినాయకుడు ఉదయం 6 గంటలకు నిమజ్జనానికి బయలుదేరి మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో బాహుబలి క్రేన్ నెంబర్ 4 వద్ద నిమజ్జనం చేస్తారు.

**72 కృత్రిమ కొలనుల ఏర్పాటు..**

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో 20 ప్రధాన లేక్‌లతో పాటు జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 72 కృత్రిమ కొలనులలో నిమజ్జనం కోసం ఏర్పాట్లు తరువాయి 12లో



## ముంబయిలో హై అలర్ట్

- 34 వాహనాల్లో మానవబాంబులు నగరంలోకి ప్రవేశించాయని మెయిల్స్
- 14 మంది పాక్ ఉగ్రవాదులు చొరబాటు
- 400 కిలోల ఆర్‌డిఎక్స్‌తో భారీ పేలుళ్లు అంటూ బెదిరింపులు

**ముంబయి :** ముంబయికి బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో కలకలం రేగింది. దీంతో పోలీసులు, భద్రతా బలగాలు అప్రమత్తమయ్యారు. 34 వాహనాల్లో మానవ బాంబులు నగరంలోకి ప్రవేశించాయని పేర్కొంటూ శుక్రవారం ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు బెదిరింపు సందేశం వచ్చింది. ‘ముంబయిలోకి 14 మంది పాక్ ఉగ్రవాదులు చొరబడ్డారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 34 వాహనాల్లో మానవబాంబులను ఏర్పాటు చేశాం. వారి వద్ద 400 కిలోల ఆర్‌డిఎక్స్ ఉంది. ఇప్పుడు మేము చేపడుతున్న భారీ పేలుళ్లు మొత్తం ముంబయి నగరాన్ని కుదిపేస్తాయి’ అని మెయిల్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. లష్కరే జిహాదీ అనే ఖాతా నుంచి తరువాయి 12లో

## మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థికంవైపు

# రాష్ట్రం వేగంగా పరుగులు

- యువ తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతోంది
- రాష్ట్రాభివృద్ధికి ఐఎస్‌బి విద్యార్థులు సహకరించాలి
- మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘తెలంగాణ రైజింగ్ 2047, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ’ వైపు తెలంగాణ యువ రాష్ట్రం వేగంగా పరుగులు తీస్తోందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)లో ‘మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్’ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడుతుందని, రాష్ట్ర అభివృద్ధికి ఐఎస్‌బి విద్యార్థులు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ఎవరు ఊహించని రీతిలో పెట్టుబడులు పెడుతోందని తరువాయి 12లో

## మంత్రి పదవి వద్దన్నా..

- ఈ ఐదేళ్లు రేవంత్‌రెడ్డే సిఎం
- కాళేశ్వరంపై దర్యాప్తు పక్కదారి పట్టేందుకే కవిత సస్పెన్షన్ డ్రామా
- టిపిసిసి చీఫ్ బి.మహేష్‌కుమార్ గౌడ్
- రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘‘కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల విషయంలో సిబిఐ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాం. సిబిఐలో అనేక లొసుగులు ఉన్నాయి. అయితే సిబిఐ కంటే మరో మార్గం లేదు. సిబిఐతో కాకుండా రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయిస్తే ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుంది’’ అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ‘ఈ ఐదేళ్లు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే వచ్చే ఎన్నికలకు వెళ్తాం. భవిష్యత్‌లో బిసి సిఎం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం. మంత్రి పదవి ఇస్తామంటే వద్దని చెప్పాను’ అని ఆయన చెప్పారు. సిఎల్‌పి తరువాయి 2లో


## శిల్పాశెట్టి దంపతులపై లుకౌట్ నోటీసులు

దేశం విడిచివెళ్లకుండా నిఘా

05




చలో చండీఘఢ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)

25వ కాంగ్రెస్

21-25 సెప్టెంబర్, 1925

చండీఘడ్ (పంజాబ్)

(సిపిఐ రెండవ కాంగ్రెస్, కలకత్తా 1948 – 6వ పేజీలో)



# ప్రపంచం
WORLD NEWS

## అఫ్గాన్ భూకంప మృతుల సంఖ్య 2200లకు పైమాటే..
### తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి ప్రకటన



**కాబూల్:** అఫ్గానిస్థాన్‌లో గత వారం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 2200లకుపైగానే ఉందని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ప్రకటించారు. ఆయన విడుదల చేసిన ప్రకటనను అనుసరించి, భూకంపం కారణంగా వేలాది భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృత దేహాలు బయటపడుతున్నాయి. గత ఆదివారం రాత్రి అఫ్గాన్ తూర్పు ప్రాంతాల్లో సంభవించిన భూకంపం తీవ్రత రెక్టార్ స్కేల్‌పై 6మాగ్నిట్యూడ్‌గా రికార్డయింది. దీని కారణంగా వందలాది గ్రామాలు దెబ్బతిన్నాయి. కూలిన ఇళ్లు, బహుళ అంతస్తు భవనాల శిథిలాల కింద ఎంతో మంది చిక్కుకుపోయారు.

## చైనా, ఉత్తర కొరియా సంబంధాలు మరింత పటిష్ఠం




**బీజింగ్:** చైనా, ఉత్తర కొరియా ద్వైపాక్షిక సంబంధాలు మరింత పటిష్టపడ్డాయి. ఇరు దేశాలకు చెందిన అధికారిక వార్తా సంస్థలు శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జపాన్‌పై విజయం సాధించి80 సంత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఈ నెల 3వ తేదీన చైనా నిర్వహించిన మహా పరేడ్‌కు కొంత మంది ప్రపంచ దేశాల నాయకులతోపాటు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ కూడా హాజరయ్యారు. అనంతరం ఆయన చైనా అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు.

ఉత్తర కొరియాతో మైత్రీ సంబంధాలు మరింత పటిష్టపడుతున్నాయని, దశాబ్దాలుగా రెండు దేశాల మధ్య పరస్పర అవగాహన, సహకారం కొనసాగుతున్నాయని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఉటంకిస్తూ చైనా అధికారిక ప్రసార మాధ్యమం 'సిసిటివి' పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులు ఏ విధమైన మారినా, ఉత్తర కొరియాతో సంబంధాల్లో ఎలాంటి మార్పు ఉండదని జిన్‌పింగ్ స్పష్టం చేసినట్టు తెలిపింది. ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ' (కెసిఎన్‌ఎ) కూడా దాదాపు ఇలాంటి సమాచారాన్నే అందించింది. జిన్‌పింగ్, కిమ్ ఇద్దరూ తమతమ దేశాల ఉన్నతాధికారులు, కీలక నాయకులతో కూడిన బృందాలతో కలిసి చర్చల్లో పాల్గొన్నట్టు తెలిపింది. ఇలావుంటే, ఉత్తర కొరియాకు చైనా అత్యంత కీలకమైన వాణిజ్య భాగస్వామి. పలు రకాలుగా సహాయం కూడా చైనా నుంచి అందుతున్నది. అయితే, ఇటీవల కొద్దికాలంగా రష్యాకు అనుకూలంగా ఉత్తర కొరియా వ్యవహరిస్తున్నట్టు వార్తలు వచ్చాయి.

ప్రత్యేకించి ఉక్రేన్‌పై యుద్ధానికి తమ దేశ సైనిక దళాలను కిమ్ పంపడం చర్చకు ఊతమిచ్చింది. అందుకు బదులుగా ఉత్తర కొరియాకు రష్యా ఆయుధాలు సరఫరా చేస్తున్నదని అంతర్జాతీయ మీడియా పేర్కొంటున్నది. బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో కిమ్‌పై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించడాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. అయితే, చైనాను తమ వ్యూహాత్మక భాగస్వామిగా కిమ్ అభివర్ణించారు. రెండు దేశాల మధ్య మైత్రీ సంబంధాలు బలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలావుంటే, పుతిన్, జిన్‌పింగ్, కిమ్ కలయిక పట్ల అమెరికా నుంచి అధిక టారిఫ్ సమస్యను, ఆంక్షలను ఎదుర్కొంటున్న దేశాలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

ఇప్పటికే అణ్వాయుధాల తయారీకి ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలపై ఉత్తర కొరియాపై అమెరికా పలు ఆంక్షలు విధించి, అమలు చేస్తున్నది. అదే విధంగా పలు దేశాలపై అదనపు సుంకాల భారాన్ని మోపుతున్నది. ఈ పరిస్థితుల్లో, ఆర్థిక స్థిరత్వం కోసం పలు దేశాలు రష్యా, చైనావైపు చూస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తున్నది.

## త్వరలోనే పుతిన్‌తో చర్చలు
### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల సమావేశమైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, త్వరలోనే మరోసారి ఆయనతో సమావేశమై చర్చలు జరుపుతానని తెలిపారు. అమెరికాలోని ప్రముఖ టెక్ సంస్థల అధిపతులు, సిఇఒలకు విందు ఇచ్చిన ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, ఒక ప్రశ్న సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో తొలుత మాట్లాడతానని, ఆ తర్వాత పుతిన్‌తో చర్చిస్తానని వివరించారు.

వైట్‌హౌస్‌లో అమెరికా ప్రథమ హిళ మెలానియా ట్రంప్ ఆధ్వర్యంలో ఎఐ ఈవెంట్‌ను నిర్వహించారు. అనంతరం జరిగిన విందుకు యాపిల్ సిఇఒ టిమ్‌కుక్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, మెటా సిఇఒ జుకర్‌బర్గ్, మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల తదితరులు హాజరయ్యారు. సాధారణంగా అమెరికా అధ్యక్ష స్థానంలో ఉన్న వారెవరూ అడగని రీతిలో ఎవరెవరు ఎంతెంత మొత్తాలను అమెరికాలో పెట్టుబడులు పెడతారో చెప్పాలని అడిగారు.

అమెరికా దిగ్గజ టెక్ సంస్థలు ఇప్పటి వరకూ వివిధ దేశాల్లో పెట్టుబడులు పెట్టాయని, ఇప్పుడు స్వదేశంవైపు చూడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రశ్నకు స్పందించిన టిమ్ కుక్ అమెరికాలో 600 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడతామని పేర్కొన్నారు.

జుకర్‌బర్గ్ కూడా అంతే మొత్తాన్ని ప్రకటించగా, సుందర్ పిచాయ్ 250 బిలియన్ డాలర్లు, సత్య నాదెళ్ల 80 బిలియన్ డాలర్ల చొప్పున తమతమ కంపెనీల తరఫున పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించారు. అది అద్భుతమైన స్పందనగా పేర్కొన్న ట్రంప్, ఈ భారీ పెట్టుబడుతలతో అమెరికాలో పెద్దఎత్తున ఉద్యోగాల సృష్టి జరుగుతుందని వ్యాఖ్యానించారు.

ఇలావుంటే, నిన్నమొన్నటి వరకూ టెస్లా అధినేత, ప్రపంచ ధనవంతుడు ఎలాన్ మస్క్‌తో చెట్టపట్టాలేసుకు తిరిగిన ట్రంప్ ఆ తర్వాత విభేదాల కారణంగా అతనికి దూరమయ్యారు. దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీ కీలక అధికారులకు ఇచ్చిన విందుకు మస్క్‌ను ఆహ్వానించకపోవడం ఇప్పుడు అంతటా చర్చనీయాంశమైంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌తో కలిసే ఉన్న మస్క్, ఆ తర్వాత అత్యంత కీలకంగా పేర్కొన్న 'డోజ్' శాఖ బాధ్యతలు నిర్వర్తించారు. కానీ, ఆ తర్వాత విభేదాలతో విడిపోయారు. కాగా, మస్క్‌ను కాదనుకున్న ట్రంప్, తాజా విందుకు అతని ప్రత్యర్థి, ఓపెన్ ఎఐ ఇసిఒ శామ్ అల్ట్‌మన్‌ను ఆహ్వానించడం ఆసక్తిని రేపుతున్నది.

## శ్రీలంకలో లోయలోపడిన మినీ బస్సు
### 15 మంది మృతి



**కొలంబో:** శ్రీలంకలో చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 15 మంది మృతి చెందగా, 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. అధికారులు వెల్లడించిన ప్రాథమిక సమాచారం మేరకు, ఎల్లావెల్లవాయ ప్రధాన రహదారిపై24వ కిలోమీటర్ మూల మలుపు వద్ద ఓ మినీ బస్సు అదుపుతప్పి 500 మీటర్ల లోతుగల లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని, గాయపడిన వారిని బదుల్ల ఆసుపత్రికి తరలించారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అంటున్నారు. కాగా, మృతుల్లో ఎనిమిది మంది మహిళలు ఉన్నారు. ఎల్లాలో విహారయాత్రకు వెళ్లిన మున్సిపల్ కౌన్సిల్ ఉద్యోగులు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బస్సు డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. దర్యాప్తు చేపట్టామని, వివరాలు త్వరలోనే వెల్లడవుతాయని అధికారులు ప్రకటించారు.

## ఇయుపై చైనా యాంటీడంపింగ్ సుంకాలు



**బీజింగ్:** యూరోపియన్ యూనియన్ (ఇయు) నుండి పంది మాంసం దిగుమతులపై 62.4 శాతం వరకు తాత్కాలిక యాంటీడంపింగ్ సుంకాలను విధిస్తున్నట్లు చైనా శుక్రవారం ప్రకటించింది, దీనితో ఇయు ఆర్థిక కూటమిలో బీజింగ్, మిగతా 27 దేశాల మధ్య వాణిజ్య వివాదం తీవ్రమైంది. ఉత్పత్తి ధర కంటే తక్కువ లేదా ఎగుమతి చేసే దేశంలో, అక్కడి స్థానిక మార్కెట్‌లో వసూలు చేసే ధర కంటే తక్కువ ధరకు మార్కెట్లో వస్తువులను విక్రయించే పద్ధతిని ప్రస్తావిస్తూ, యూరప్ పంది మాంసం, పంది ఉప ఉత్పత్తులను చైనా మార్కెట్‌లో డంప్ చేస్తోందని చైనా వ్యాఖ్యానించింది. అందుకే, ప్రాథమిక నిర్ణయం తీసుకున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇయు ఉత్పత్తి చేసే పంది మాంసం ధరలు తమ దేశ మాంస పరిశ్రమకు గణనీయమైననష్టా న్ని కలిగిస్తున్నాయని పేర్కొం ది. 15.6శాతం నుండి 62.4 శాతానికి పెంచిన సుంకాలు ఈనెల 10వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. గత ఏడాది జూన్‌లో, చైనా తయారీ ఎలక్ట్రిక్ వాహనాలపై ఇయు తాత్కాలిక సుంకాలను విధించింది. ఆ తర్వాత కొద్దిరోజులకే చైనా ఇయు పంది మాంసం దిగుమతులపై దర్యాప్తు ప్రారంభించింది. అనంతరం యూరోపియన్ బ్రాందీపై, ముఖ్యంగా ఫ్రాన్స్‌లో ఉత్పత్తి చేసే కాగ్నాక్‌పై చైనా యాంటీడంపింగ్ సుంకాలను విధించింది. అయినప్పటికీ ప్రధాన బ్రాందీ ఉత్పత్తిదారులకు మినహాయింపులు లభించాయి.

## పార్లమెంటులో బల నిరూపణ
### థాయిలాండ్ ప్రధానిగా అనుతిన్ త్వరలో ప్రమాణం



**బ్యాంకాక్:** థాయిలాండ్ తదుపరి ప్రధానమంత్రిగా నియమితుడయ్యేందుకు శుక్రవారం పార్లమెంటులో జరిగిన ఓటింగ్‌లో, భూమ్‌జైతై పార్టీకి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు అనుతిన్ చార్న్‌విరాకుల్ తన బలాన్ని నిరూపించుకున్నారు. ఓటింగ్‌లో ఆయన విజయం సాధించారని టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారమైన అనధికారిక రన్నింగ్ లెక్కింపు ప్రకారం తెలిసింది. పార్లమెంటులో మొత్తం 492 మంది క్రియాశీల సభ్యులు ఉండగా, కనీస మెజారిటీ 247. అనుతిన్ ఇంతకంటే ఎక్కువ ఓట్లు సంపాదించుకున్నట్టు అధికారిక ప్రకటన పేర్కొంది. అతనికి వచ్చిన ఓట్లను ధ్రువీకరించిన తర్వాత, ప్రతిపాదనను థాయ్ రాజు మహా వజిరాలాంగ్‌కార్న్‌కు పంపిస్తారు. ఆయన నుంచి అధికారిక నియామక పత్రాలను పొందిన వెంటనే అనుతిన్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపడతారు. ప్రధానిగా ఉన్న పేటోంగ్‌టార్న్ షినవత్రాపర అవినీతికి పాల్పడ్డారని, పొరుగున ఉన్న కంబోడియా సెనేట్ అధ్యక్షుడు హున్ సేన్‌తో రాజకీయంగా రాజీపడిన ఫోన్ కాల్ విషయంలో నైతిక ఉల్లంఘనలకు ఒడిగట్టారని కోర్టు నిర్ధారించింది. అతనిని ప్రధాని పదవి నుంచి తొలగించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు షినవత్రాపర రాజీనామా చేయగా, ఆయన స్థానంలో నూతన ప్రధాని ఎన్నిక అనివార్యమైంది. పేటోంగ్‌టార్న్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న అనుతిన్ పార్లమెంటులో బలాన్ని నిరూపించుకున్నారు.

## భూభారతితో తొలగిస్తాం (మొదటి పేజీ తరువాయి)

అనసూయ సీతక్క, ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గత పదేళ్ల బిఆరెస్ పాలనలో ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా వారి సమస్య పరిష్కరించలేదని, రెవెన్యూ శాఖ సిబ్బందిని దొంగలుగా, దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 'గత ప్రభుత్వంలో 'ధరణి' భూతాన్ని తెచ్చి భూములను కొల్లగొట్టాలని చూశారు. తమ దోపిడీకి విఆర్‌ఓ, విఆర్‌ఎలు అడ్డుగా ఉన్నారని వారిని దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు. వారిని దోపిడీదారులుగా చిత్రీకరించారు. ధరణి తెచ్చిన సమస్యలతో విసిగిపోయిన ఓ రైతు ఇబ్రహీంపట్నంలో అధికారిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు.

సిరిసిల్లలో అధికారులపై తాళి బొట్టు విసిరిన పరిస్థితి. ఇది అధికారుల వల్ల జరగలేదు. ఇది నాటి పాలకులు సృష్టించిన వైరస్. ప్రభుత్వానికి పేద ప్రజలకు విఆర్‌ఓలు, విఆర్‌ఎలు వారధులుగా నిలవాలని, పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వారిని తిరిగి నియమించామన్నారు. 'ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇల్లు తగలబెట్టుకుంటామా. ఎవరో కొందరు తప్పులు చేశారని మొత్తం వ్యవస్థనే రద్దు చేస్తారా? అప్పటి పాలకులు చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే విఆర్‌ఓ, విఆర్‌ఎ వ్యవస్థను రద్దు చేశారు' సిఎం అన్నారు.

**ఎన్నికల్లో చెప్పాం-... గ్రామ సుపరిపాలనను తెచ్చాం**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన వెంటనే గ్రామ సుపరిపాలనపై దృష్టి సారించి గ్రామాధికారుల నియామకానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



గత ప్రభుత్వం 2020 ఆర్‌ఓఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అందువల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణిని బంగాళాఖాతంలో కలిపేసి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. గత ప్రభుత్వంలో సాదాబైనామాలపై సుమారు 9.26 లక్షల దరఖాస్తులకు మోక్షం కలగలేదని, పైగా కోర్టులలో కేసులు నమోదయ్యాయని తెలిపారు.

తాజాగా నిర్వహించిన సదస్సులలో సుమారు 8.65 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ప్రభుత్వం తరపున మరింత గట్టిగా కృషి చేసి వారం రోజుల కింద కోర్టులో సాదాబైనామాలపై స్టేను తొలగించేలా ప్రయత్నించి సఫలమయ్యామన్నారు. గతంలో వచ్చిన దరఖాస్తులు, ప్రస్తుత తాజా దరఖాస్తులన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 6860 క్లస్టర్లను ఏర్పాటు చేసి 10,954 రెవెన్యూ గ్రామాలలో గ్రామపరిపాలనాధికారుల నియామకం చేపడుతున్నామని వివరించారు.

సర్వేయర్ల నియామకం ద్వారా భూ సమస్యలకు చెక్ పెడతామన్నారు. ప్రస్తుతం ఉన్న 318 మంది సర్వేయర్లుకు అదనంగా 800 మందిని నియమించడమే కాకుండా 7000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను వచ్చే ఉగాదిలోగా భర్తీ చేస్తామని మంత్రి ప్రకటించారు. సుమారు 3 దశాబ్దాలుగా వివిధ ప్రాజెక్ట్‌లకు జరిగిన భూ సేకరణలో ఇంకా రైతుల పేర్లు పహనీలో ఉండిపోయాయని, ఈ సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీనాటికి అన్ని గ్రామాల వారీగా జమాబందీ మేరకు అప్పటివరకు జరిగిన క్రయవిక్రయాలను హక్కులను వివరించేలా ప్రకటన జారీ చేస్తామన్నారు. దీని ప్రతులను ప్రతి రెవెన్యూగ్రామంలో అందుబాటులో ఉంచుతా మన్నారు.

## మంత్రి పదవి వద్దన్నా..
(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు పక్కదారి పట్టించేందుకు కెసిఆర్ కుటుంబం ఎంఎల్‌సి కవిత సస్పెన్షన్ డ్రామా చేస్తున్నారని అనిపిస్తోందని అన్నారు. ప్రజలను నమ్మించే అలవాటు కెసిఆర్ కుటుంబానికి ఉందన్నారు. అవినీతి మరకలు ఉన్న వాళ్ళని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోబోమని, కవితని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోబోమని, ఎఐసిసి ఆదేశం లేకుండా ఇంత స్పష్టంగా చెప్తానా ఆయన స్పష్టం చేశారు. హరీష్ రావు, సంతోష్‌రావు ఎలా దోచుకున్నారో కవిత వెల్లడించి ఒక మంచి పని చేశారన్నారు. ధనం, పవర్ కోసమే కవిత కెటిఆర్ పంచాయితీ అని, కవిత ఇప్పుడు మాట్లాడుతున్న విషయాలు ఏనాడో మాట్లాడితే సెల్యూట్ చేసే వాళ్లమన్నారు. బిసి బిడ్డలకు నోటి దాకా వచ్చిన ముద్దను తినకుండా చేసింది కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లేనన్నారు. వారం పది రోజుల్లో పార్టీలోని అన్ని కమిటీలు వేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే వచ్చే నెలలో కార్పొరేషన్ పదవులు భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నామని, ప్రజల కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను కోరామన్నారు. పాదయాత్రకు మంచి స్పందన వస్తోందని, క్రమశిక్షణ విషయంలో నిక్కచ్చిగా వెళ్లగలిగామన్నారు. కాంగ్రెస్ పార్టీలో బ్రేకులే కాదు సడెన్ బ్రేకులు కూడా ఉంటాయని, ఎంఎల్‌ఎ రాజ్ గోపాల్ రెడ్డి విషయంలో కొంత అయోమయ పరిస్థితి ఉందని, ఉన్నది ఉన్నట్టు మాట్లాడడం కోమటిరెడ్డి బ్రదర్స్‌కు అలవాటన్నారు. తనకు కులమంటే అభిమానమే కానీ కుల పిచ్చిలేదని, బిసి లు కొన్ని రోజులు కులాన్ని పక్కన పెట్టాలన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ప్రస్తుత ఎంఎల్‌ఎ నాగేందర్ రాజీనామా చేసి పోటీ చేస్తానని చెబుతున్నారని, ఆయన సభ్యత్వం పోతుందని అనుకోవడంలేదన్నారు.

## విద్యావిధానం కావాలి (మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళావేదికలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో సిఎం హాజరయ్యారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సిఎం సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సిఎం సహపంక్తి భోజనం చేశారు.

అంతకుముందుకు సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి విద్యాపాలసీ లేదని, తెలంగాణకు నూతన పాలసీ కావాలని, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని సిఎం ఆకాంక్షించారు. పేదవాళ్లు బాగు పడాలంటే,సమాజాంలో రాణించాలంటే విద్య ఒక్కటే మార్గమని అన్నారు. టీచర్లు అంటే ఒక కుటుంబ పెద్దగా భావించాలని, 50 శాతం పేద పిల్లల బాధ్యత టీచర్ల వద్దనే ఉన్నదని, విద్యార్థులను క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని అన్నారు. పదేళ్ల కాలంలో గురుపూజోత్సవ కార్యక్రమాలు జరిగాయా?, ఈ కార్యక్రమాలకు సిఎం ఎప్పుడైనా హాజరయ్యారా అని ప్రశ్నించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాల నుంచే వచ్చానని, టీచర్లను చిన్నచూపు చూసే సంస్కృతి తమ ప్రభుత్వానికి లేదన్నారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులు చదువు కుంటున్నారని, 11 వేల ప్రైవేటు పాఠశాలల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువు కుంటున్నారని వివరించారు. ప్రైవేటు స్కూల్స్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యధికంగా విద్యాధికుల ఉపాధ్యాయులు ఉంటారని, వారికి సమాజం పట్ల అవగాహన ఉంటుందని, సామాజిక బాధ్యత కలిగి ఉంటారని సిఎం పునరుద్ఘాటించారు.



టీచర్లకు జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, అటెండర్, ఆయాలు ఉండాల్సిందేనని, మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. 'అమ్మ ఆదర్శ పాఠశాల'ల పేరుతో స్వయం సహాయక సంఘాలకు పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించామని, పాఠశాలల నిర్వహణకు ప్రతి ఏటా రూ 130 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నామని సిఎం వివరించారు. చదవు ఒక్కటే పేదల, తెలంగాణ రాష్ట్ర తల రాతను మారుస్తుందందని అన్నారు. గత కంటే ఒయు ర్యాంక్ పెరిగిందన్నారు. విశ్వవిద్యాలయాలకు విసిలను నియమించేందుకు గత ప్రభుత్వానికి తీరిక లేకుండేనని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం మెరిట్, సామాజిక న్యాయం ఆధారంగా విసిలను నియమించామని సిఎం అన్నారు.

ఢిల్లీలో విద్యావిధానంలో తీసుకొచ్చిన మార్పుల వల్లనే కేజ్రీవాల్ సిఎంగా మూడు సార్లు గెలుపొందారని సిఎం గుర్తు చేశారు. తాను కూడా రెండవ సారి గెలువాలని అనుకుంటున్నానని, అందుకు ఉపాధ్యాయులే కాదని,తాను కూడా పని చేస్తానన్నారు. దేశ ప్రతిష్టను పెంచేలా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

**పదేళ్ల కాలంలో విద్య అస్తవ్యస్తం**

పదేళ్లలో విద్యాశాఖ అస్తవ్యస్తమైందని, కెజి నుంచి పిజి ఉచిత విద్య అందిస్తామని చెప్పి పదేళ్లు గడిచినప్పటికీ, ప్రస్తుతం ఆ విధానం అమలులో ఉన్నదా?, లేదా ఆలోచించుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతీ పల్లెకు జై తెలంగాణ నినాదాన్ని చేరవేసిందే ఉపాధ్యాయులని, బడికి వచ్చే పిల్లలనే కాదని, వారి తల్లిదండ్రులను కూడా ప్రభావితం చేసి తెలంగాణ ఉద్యమం వైపు నడిపించిందే ఉపాధ్యాయులని సిఎం గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రీయశీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు, తెలంగాణ రాష్ట్రంలో వారికి సంబంధించిన ఎన్ని సమస్యలను పరిష్కరించుకున్నారో ఒక విశ్లేషించుకోవాలన్నారు.

**పదేళ్లలో టీచర్ల బదిలీలు, నియామకాలే జరగలేదు..**

పదేళ్లకాలంలో రాష్ట్రంలో టీచర్ల బదిలీలు జరగలేదని, 2017 నుంచి టీచర్ల నియామకాలు కూడా జరగలేదని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 11 వేల టీచర్ల నియామకాలు పూర్తి చేశామన్నారు. డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్న ఆలోచన ఆనాటి పాలకులకు రాలేదని, ధనిక రాష్ట్రంలో ఎందుకు కాస్మోటిక్ ,డైట్ చార్జీలను పెంచలేదని, ఆ దిశగా ఎందుకు ఆ పాలకులు ఆలోచన చేయలేదని ప్రశ్నించారు. విద్యను సంపూర్ణంగ నిర్లక్ష్యంగా చేసి ప్రజాప్రతినిధులే ప్రైవేటు సంస్థలను పెట్టుకుని విద్యను లాభసాటి వ్యాపారంగా మార్చుకుని, ఆధిపత్యం చెలాయించాలని ఆనాటి పాలకులు ప్రయత్నించారని సిఎం ఆరోపించారు.

**యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేశారు...**

ప్రొఫెసర్లను నియమించకుండా యూనివర్శిటీలను నిర్వీర్యం చేశారని, ఇంటర్ విద్య అవసరమే లేదనే తరహా నిర్లక్ష్యంగా వ్యవహరించారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రొఫెసర్లు రిటైర్‌మెంట్ పెంచే ఆలోచన చేయలేదని, కొత్త నియామకాలు జరగలేదని, మరోవైపు ఉన్నవారు రిటైర్డ్ అవుతుంటే యూనివర్సిటీలు ఎందుకు ఉపయోగపడకుండా, ప్రపంచానికే సేవలను అందించిన ఒయు లాంటి యూనివర్సిటీ కూడా మూతపడే పరిస్థితి వచ్చిందని, దేశానికే గొప్ప ఇజనీర్లను అందించిన కాకతీయ విశ్వవిద్యాలయం కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాలు ఎప్పుడు వచ్చినా వారి సమస్యలు విని, పరిష్కరించేందుకు ప్రయత్నం చేశామని, ఎక్కడైనా కొంత ఆలస్యం కావొచ్చని, కానీ సమస్యను పరిష్కరించకుండా ఉండలేదని, పని ఆగిపోలేదని చెప్పారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన 3 లక్షల మంది విద్యార్థుల సంఖ్య**

గతంలో ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గేదని, ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 3లక్షలకు పెరిగిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉన్నదని వారిని అభినంధించారు. 2 నుంచి 3 శాతం జరిగే తప్పిదాలే విద్యాశాఖకు మచ్చను తీసు కొస్తాయన్నారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులకు శ్రద్ధ పెరిగిందన్నారు.నాణ్యమైన విద్యను, విద్యార్థుల్లో పట్టుదలను నేర్పించినందుకే సౌత్ కోరియా, జర్మనీ, చైనా లాంటి దేశాలు అభివృద్ధి చెందేందుకు కారణమని అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడేలా మన విద్యార్థులను తీర్చిదిద్దుద్దాలన్నారు.

**డ్రగ్స్ బారిన పడకుండా చూడాలి**

విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి తప్పుదారిలో పడకుండా చూడాల్సిన బాధ్యత తమపైన ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. కొందరు ఇంజనీర్ చదివిన విద్యార్థులు కూడా తప్పుదోవ పట్టి, డ్రగ్స్ భారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుదోవ పట్టినవారిని గాడిలో పెట్టాలని సూచించారు. తెలంగాణలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు 'ఈగల్ ఫోర్స్'ను తీసుకొచ్చామని గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తు అని, ఆ భవిష్యత్తును 'మీ' చేతుల్లో పెడుతున్నానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తెలంగాణలో 'మెడికల్ ఎక్విప్‌మెంట్ 'యూనిట్ ఏర్పాటుకు జర్మనీ ఆసక్తి

### సిఎంను కలిసిన జర్మనీ కంపెనీ ప్రతినిధి బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని జర్మనీకి చెందిన బెబిగ్ మెడికల్ కంపెనీ చైర్మన్, సిఇఒ జార్జ్ చాన్ ప్రతినిధి బృందం హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించేందుకు జర్మనీ కంపెనీ ఆసక్తి చూపింది. దీనికి సంబంధించి అనువైన స్థలాన్ని, ఇతర వాటికి సంబంధించిన అంశాలపైన అధ్యయనం చేసి రిపోర్టును అందించాలని అధికారులకు సిఎం సూచించారు.






## 22 నుంచి ఇందిరమ్మచీరలు

### మహిళకు రెండు చొప్పున పంపిణీ
### రేవంతన్న బతుకమ్మ కానుక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ చేయనుంది. రాష్ట్రంలోని ప్రతి మహిళకు రెండు ఇందిరమ్మ చీరలు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ ఆడబిడ్డలకు మీ రేవంతన్న బతుకమ్మ కానుక పేరుతో ముద్రించిన ప్లాస్టిక్ బ్యాగులో చీరలను పెట్టారు. ఒక్కొక్కటి రూ.800 విలువ చేసే రెండు నాణ్యమైన చీరలను ప్రభుత్వం అందించనుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల చీరల పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందింది. ఈ పథకం ద్వారా 6000 మందికి పైగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## న్యాక్ ట్రైనర్ స్నేహలతకు 'జాతీయ టీచర్స్ అవార్డు'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టీచర్స్ డే పురస్కరించుకుని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఎసి) ట్రైనర్ స్నేహలతకు రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకోవడం పట్ల రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రైనర్‌షిప్ విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్నేహలత న్యూఢిల్లీలో శుక్రవారం 'జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు' అందుకున్నారు. దీంతో ఆమెకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా స్నేహలతకు అవార్డు దక్కిందని మంత్రి కొనియాడారు. దేశ వ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి నక్క స్నేహలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. కాగా స్నేహలతకు న్యాక్ డైరెక్టర్ జనరల్ (డిజి),ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిఎస్ వికాస్‌రాజ్ కూడా అభినంధించారు.



## అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటి

### మంత్రి ఉత్తమ్- రాయబారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అన్నిరకాలుగా అనుకూల వాతావరణం ఉంటుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టేన్సన్ హైదరాబాద్‌లో మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డితో శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య, పారిశ్రామిక రంగంలో రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాలు మరింత బలపడాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందుతున్న హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర విశిష్టతను, ఐ.టి రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరంలో ఇక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆధునిక వసతులు,ఫార్మా రంగంలో పురోగతిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుండి పారిశ్రామిక వేత్తలు తరలివస్తున్నారని, డెన్మార్క్ లాంటి దేశం కుడా ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టేన్సన్‌ను ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు.

## సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడంలో ప్రభుత్వం విఫలం

### కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు, కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు శుక్రవారం బిఆర్‌ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ.20వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ.20వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు. యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు. ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపిపి కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్ తదితరులు బిఆర్‌ఎస్‌లో చేరారు.

## రానున్న 20 రోజుల్లో రోజుకు 10,000 మెట్రిక్ టన్నుల యూరియా

### మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న 20 రోజుల్లో 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో రైతువేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులను కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ తూర్పు తీరంలోని వివిధ నౌకాశ్రయాలకు రానున్న నాలుగు దిగుమతి నౌకల నుండి తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించేందుకు అంగీకరించినట్టు మంత్రి తుమ్మల వివరించారు. దిగుమతి సరఫరా కాకుండా, ఆర్‌ఎఫ్‌సిఎల్ మూత పడటంతో దేశీయ తయారీ యూనిట్ల నుండి కూడా అదనంగా 30,000 మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణ రాష్ట్రానికి కేటాయించేందుకు కేంద్రం అంగీకరించిందని, తద్వారా తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉంటుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రామగుండం ఆర్‌ఎఫ్‌సిఎల్ ఎరువుల కర్మాగారం నిలిచిపోయిన కారణంగా రాష్ట్ర రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణలోనికి తీసుకుని వెంటనే ఉత్పత్తి ఆరంభించాలని కేంద్ర మంత్రులను కోరామని, దీనిపై కేంద్రం స్పందిస్తూ మూడు,నాలుగు రోజుల్లో యూనిట్‌ను తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపడతామని హామీనిచ్చిందని తుమ్మల వివరించారు.

రాష్ట్రానికి జిఎస్‌ఎఫ్‌సి, ఐపిఎల్, సిఐఎల్ కాకినాడ కంపెనీల ద్వారా 11,181 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రంలోని రైల్వే రేక్ పాయింట్లయిన కరీంనగర్, మిర్యాలగూడ, వరంగల్, పెద్దపల్లి ప్రాంతాలకు చేరిందని, శనివారం మరో 9,039 మెట్రిక్ టన్నులు ఎంఎఫ్‌ఎల్, క్రిబికో,సిఐఎల్ కృష్ణపట్నం కంపెనీల నుండి వరంగల్, సనత్‌నగర్, కరీంనగర్ రైల్వే రేక్ పాయింట్లకు చేరనున్నాయని మంత్రి వివరించారు.

సెప్టెంబర్ నెలలో కేవలం నాలుగు రోజుల్లోనే రాష్ట్రానికి 28,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 8,20,112 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని, గత సంవత్సరం ఇదే సమయానికి 7,75,157 మెట్రిక్ టన్నుల అమ్మకాలు మాత్రమే జరిగాయని తుమ్మల స్పష్టం చేశారు. వచ్చే 20 రోజుల్లో రోజుకు కనీసం 10,000 మెట్రిక్ టన్నుల చొప్పున 2 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి సరఫరా చేయాలన్నారు.

రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

మండలానికి ఒకటి లేదా రెండు పిఎసిఎస్‌లు ఉన్న ప్రాంతాలలో రైతు వేదికలను వాడుకొని గ్రామాల వారీగా, పాస్ పుస్తకాల ఆధారంగా ఒక రోజు ముందుగానే టోకెన్లను జారీ చేసి, రైతులకు ఎరువులు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పంపిణీ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, విజిలెన్స్ విభాగాలతో కూడిన పర్యవేక్షణతో ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు జీవితాన్ని ఇస్తారు

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జీవితాన్ని ఇస్తారని, తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశనికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి, దేశ అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని అలంకరించే దివంగత రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పించారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులదేనని అందరికీ మార్గదర్శకులు గురువులు అన్నారు. ఏదేశ భవిష్యత్తు అయినా తరగతి గదిలోనే ఉంటుందన్నారు. ఒక ఇంజనీర్ ప్రాజెక్టులు నిర్మిస్తాడు, సైంటిస్ట్ రాకెట్లు తయారు చేస్తాడు, డాక్టర్ వైద్యం చేస్తాడు. కానీ వీరందరినీ తయారుచేసేది ఉపాధ్యాయులని, గురువుకు సమాజ నిర్మాతలు, మార్గదర్శకులు ఉపాధ్యాయులు, విద్యార్థి జీవితాన్ని మలుపుతిప్పేది ఉపాధ్యాయులే అని తెలిపారు. కలెక్టర్ ఎస్పి ఉన్నతాధికారులందరమూ కూడా ఒకనాడు విద్యార్థులమే, మాకు చిన్నప్పుడు విద్య నేర్పిన గురువుల వలనే జ్ఞానం విలువలు, మెరుగైన సమాజం ఉండాలంటే నాణ్యమైన విద్య ఉండాలి, విద్య వచ్చినవారికి సమాజంలో మంచి గౌరవం ఉంటుందని, వారికి ధనం, సమాజంలో విద్యావేత్తలకే ఎక్కువ గౌరవం ఉంటుందని, అలాంటి విద్యావేత్తలను తయారు చేసేది గురువులు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వికారాబాద్ జిల్లాలో యువతకు శిక్షణ ఇవ్వడానికి టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సహకారంతో రాష్ట్రంలో ఐటిఐలను చేర్చడం జరిగింది అని తెలిపారు. ముఖ్యమంత్రి విద్యారంగం అభివృద్ధికి,పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తుంది మౌలిక సదుపాయలు కల్పించడానికి కృషి చేస్తుంది అని అన్నారు. విద్యార్థులు జీవితంలో అత్యున్నత శిఖరాలకు ఎదగడం విద్యార్థుల బాధ్యత, విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరాలనికోరారు. వికారాబాద్ జిల్లాను ఉపాధ్యాయులు కష్టపడి వచ్చే విద్యా సంవత్సరంలో మంచి పలితాలను తీసుకురావాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అధ్యాపకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేన్నారు. ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, రామోహన్‌రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 50మందికి సన్మానం, అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట ప్రభుత్వం విద్యాకు పెద్ద పీట వేసిందన్నారు. సమజంలో మార్పులకు ఉపాధ్యాయులే ముఖ్యమని ఈ సందర్భంగా అందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన ఉపాధ్యాయులను ప్రశంసాపత్రం అందజేసి శాలువా,జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్స్ చౌదరి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## జిపిఓ నియామకంతో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం

### ఉద్యోగ జెఎసి సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా జిపిఓలకు నియామకం ఎంతో దోహదపడుతుందని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్,తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తరపున తెలంగాణ ఉద్యోగుల జెఎసి తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి. లచ్చిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, రాములు, పాక రమేష్ (టిజిటిఎ) బాణాల రామ్ రెడ్డి, బిక్షం,( టిజిఆర్‌ఎస్‌ఎ), రాధ, పూల్ సింగ్, మల్లేష్ (టిజిటిఎ), సిసిఎల్‌ఎ నాయకులు రాంబాబు, చైతన్య, సుజాత చౌహాన్‌తో కూడిన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'భూ భారతి చట్టం 2025' అమలులోకి తీసుకురావడంతో పాటు జిపిఓలను నియమించడంతో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని వారు తెలిపారు. రాష్ట్రంలో ఆనవాళ్ళు కోల్పోయిన రెవెన్యూ శాఖను పునర్నిర్మాణం చేస్తున్నారని, ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలంగాణ ఉద్యోగుల జెఎసి తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

## నష్టాన్ని ఏ రకంగా భర్తీ చేస్తారో వెంటనే ప్రకటించాలి

### వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిఎస్‌టిలో తీసుకొచ్చిన కొత్త మార్పుల కారణంగా అనేక రాష్ట్రాలకు జరుగుతున్న నష్టాన్ని ఏ రకంగా పూడ్చుతారో కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. జిఎస్‌టి కొత్త విధానంలో రాష్ట్రాలకు జరుగుతున్న నష్టాన్ని నూరు శాతం పూరించాలని, లక్షలాది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న బిడి లాంటి ఇతర పరిశ్రమలపై పూర్తిగా జిఎస్‌టిని ఎత్తివేయాలని,పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అదనపు సెస్సు పేరుతో వసూలు చేస్తున్న పన్నులో 50 శాతం రాష్ట్రాలకు చెల్లించేలా నిర్ణయించాలన్నారు. నిషేధం విధించాల్సిన గుట్కా, పాన్ పరాగ్ లాంటి ఉత్పత్తులపైన జిఎస్‌టిని పెంచడం ద్వారా ఆ ఉత్పత్తుల అమ్మకాన్ని బహిరంగం చేయడానికి అర్థంపొందడమేనని, ఇది కేంద్ర ప్రభుత్వం చేసిన మరో తప్పిదమని బోస్ దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో బిడి పరిశ్రమలో సుమారు 7 లక్షల మంది కార్మికులు పనిచేస్తూ జీవనం గడుపుతున్నారని, అలాంటి పరిశ్రమపై జిఎస్‌టి పెంచటం కేంద్ర ప్రభుత్వ దిక్కుమాలిన చర్య అని అన్నారు. జిఎస్‌టి విధానంలో అవగాహన లేని ప్రధానమంత్రి మోదీ ప్రతిపక్షాల సూచనలు లెక్కచేయకుండా 2017లో ''ఒకే దేశం ఒకే పన్ను'' నినాదంతో జిఎస్‌టిలో కనీసంగా 18 శాతం, గరిష్టంగా 28 శాతం వరకు వివిధ వస్తువులపై పన్నులను పెంచి ప్రజలపై భరించలేని భారం మోపిందని తెలిపారు. జిఎస్‌టి అమలుతో ప్రజలు పెనంపై నుంచి పొయ్యిలో పడిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నాటి నుండి ప్రతిపక్షాలు కాంగ్రెస్‌తో సహా జిఎస్‌టి విధానాన్ని కూలంకుశంగా పరిశీలించాలని,ప్రజలపై భారం లేకుండా చూడాలని ఆందోళన చేస్తూ అనేక సూచనలు, సలహాలు ఇచ్చారని బోస్ గుర్తుచేశారు. 2017లో మోదీ ప్రభుత్వం ఘోరమైన తప్పిదమని ప్రస్తుతం తేటతెల్లమైందని, ప్రస్తుతం కనీసం జిఎస్‌టి 5 శాతం, గరిష్టంగా 18 శాతం వరకు మార్పులు చేస్తూ రెండు స్లాబ్లు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఈ లెక్కల ప్రకారం మోదీ ప్రభుత్వం గత 9 సంవత్సరాలలో ప్రజలపై అధిక మోతాదులో జిఎస్‌టిని విధించడం క్షమించరాని మోసపూరిత చర్యగా బోస్ అభివర్ణించారు. దేశ ప్రజలపై మోదీకి ఏమాత్రం అభిమానం,వారి కష్టాలపై సానుభూతి ఉంటే 9 సంవత్సరాలలో అధికంగా వసూలు చేసిన జిఎస్‌టి డబ్బులను ప్రతి కుటుంబానికి రూ 20 లక్షల చొప్పున చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 'ఒకే దేశం ఒకే పన్ను'' నినాదంలో వాస్తవం కాదనేందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ వస్తువులను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురాకపోవడమే దీనికి తర్కాణమని బోస్ గుర్తు చేశారు.మోదీ చెప్పే మాటలన్నీ భూటకమన్నారు.

## పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు

### ఎఐటియుసి బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్స్ హమాలీ, దడువాయి, చాట, స్వీపర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారని, ఈ చట్టాలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, ప్రజలకు గుదిబండగా మారిందని ఆరోపించారు. చిన్న, సన్నకారు, మధ్య తరగతి, ధనికరైతాంగం భూమినే నమ్ముకుని ఆరుగాలం కష్టించి పని చేస్తే, పంటచేతికి వచ్చే వరకు నమ్మకం లేదని, కరువులు, కాటకాలు, అతివృష్టి, అనావృష్టి, ఎరువులు, విత్తనాలు,క్రిమి సంహారక మందులు సకాలంలో అందక రైతులు నష్టపోతున్నారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల కష్టానికి సరైన ఫలితం రావడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, బడా వ్యాపారస్తులకు మరింత మేలు చేసేందుకు, వారి ఆస్తులను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. హమాలీ కార్మికులు బరువులు మోసేటప్పుడు, లారీల నుండి దించేటప్పుడు, ఎత్తేటప్పుడు ప్రమాదాలు జరిగి కాళ్ళు, చేతులు విరిగినా, ప్రాణాలు పోయిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి చేసిన డిమాండ్ మేరకు హమాలీ, దడువాయి, చాట, స్వీపర్ వర్కర్ను ప్రమాద నష్ట పరిహారం రూ.75 వేల నుండి రూ.3 లక్షలకు పెంచుతామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నేటికి జిఒలు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. రెండు జతల యూనిఫారం, కుట్టుకూలి, మార్కెట్లలో స్త్రీ పురుషులకు విశ్రాంతి గదులు, ప్రమాదాలు జరిగితే ప్రమాదనష్ట పరిహారం చెల్లించాలని, అన్ని మార్కెట్ కమిటీలలో ఒక పురుషునికి, ఒక స్త్రీని నియమించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ల సంఖ్యను పెంచి, క్రయ విక్రయాలను కొన సాగిస్తూ మార్కెట్లలో పని చేసే హమాలీ, దడువాయి, చాట, స్వీపర్ కార్మికులకు పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ కార్మికులకు లైసెన్స్ రెన్యువల్ వయసును 58 నుంచి 65కు పెంచాలని, మార్కెట్ యార్డుల పాలక వర్గాల్లో కార్మికుల నుంచి ఇద్దరికి డెరెక్టర్లుగా అవకాశం కల్పించాలని, యార్డుల్లో క్యాంటీన్లు, మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించి, రాష్ట్రంలో హమాలీ వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, హమాలీ కార్మికులకు ప్రమాద భీమా, ఆరోగ్య భీమా వర్తింపచేయాలని బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 'ఖేలో ఇండియా' ఈసారి తెలంగాణకు కేటాయించాలి

### కేంద్ర మంత్రిని కోరిన మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఖేలో ఇండియా' ఎనిమిదవ ఎడిషన్‌ను తెలంగాణకు కేటాయించాలని.. క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయించాలని.. తెలంగాణ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి.. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియాను కోరారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి ఢిల్లీలో శుక్రవారం మన్‌సుఖ్ మాండవియాతో ఆయన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు.

అనంతరం వాకిటి శ్రీహరి విలేకరులతో మాట్లాడుతూ.. ఖేలో ఇండియా ఎనిమిదవ ఎడిషన్‌ను తెలంగాణకు కేటాయించాలని మన్‌సుఖ్ మాండవియాకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఇదివరకే ఈ అంశం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన్‌సుఖ్ మాండవియాను కలిసి విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. తాజాగా క్రీడల శాఖ మంత్రిగా తాను కేంద్రమంత్రిని కలిసి వచ్చే సంవత్సరం ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించడానికి తెలంగాణ అన్ని విధాలుగా అనువైన ప్రదేశం అని వారికి మరోసారి వివరించానన్నారు. అలాగే.. తెలంగాణలోని హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్, వనపర్తి సహా ఇలా వివిధ జిల్లాల్లో ఉన్న క్రీడా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరామని తెలిపారు. స్టేడియాలు నిర్మించాలని పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అందుకు అనుగుణంగా.. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని రూపొందించినట్టు అందుకోసం నిధులు కావాలని కోరామని తెలిపారు. మా విజ్ఞప్తులకు మన్‌సుఖ్ మాండవియా సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని క్రీడా రంగానికి సంబంధించిన వివిధ పెండింగ్ పనుల గురించి కేంద్రమంత్రితో చర్చించాం. వనపర్తిలోని హాకీ అకాడమీలో మౌలిక సదుపాయాల కల్పన, స్పోర్ట్ స్కూల్స్‌లో టర్ఫ్ ఏర్పాటు, నల్గొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్, జడ్చర్ల.. వంటి ప్రాంతాల్లోని స్పోరట్స్ స్కూల్స్‌లో ఎక్విప్‌మెంట్ కోసం ఫండ్స్ కావాలని కోరాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటి విషయంలో.. ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. అలాగే తెలంగాణలో స్పోరట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. దీనికి కూడా సహకరించాలని కోరాం. మా విజ్ఞప్తుల పట్ల కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియా సానుకూలంగా స్పందించారు' అని శివసేన రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి,క్రీడల సలహాదారు ఎపి జితేందర్ రెడ్డి,కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల, ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి డా.గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/గొల్లపల్లి: విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు . గణపతి నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో పలు వినాయక మండపాలలో ఏర్పాటుచేసిన గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక మండపాల నిర్వాహకులు మంత్రి అడ్లూరి ని శాలువాలతో సత్కరించారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులను అందించాలని విఘ్నేశ్వరుడిని మంత్రి ఆకాంక్షించారు. వారి వెంట ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్, రాజిరెడ్డి, ముస్కు నిశాంత్ రెడ్డి, కట్ల లక్ష్మణ్ రావు, రావుల్ల గంగన్న, నేరెళ్ల మహేష్ ఆయా మండపాల కమిటీ సభ్యులు మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌కు వచ్చిన సిబిఐ డైరెక్టర్

### కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి కేసు గురించేనని గుసగుసలు

ప్రజాపక్షం/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంభకోణంపై విచారణ జరపాలంటూ తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన తరుణంలో సిబిఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ శుక్రవారం హైదరాబాద్ సిబిఐ కార్యాలయానికి రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రవీణ్ సూద్ హైదరాబాద్ కార్యాలయానికి రావడానికి ప్రధాన కారణం కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి కేసు విచారణ ప్రారంభానికి ముందస్తు సమన్వయం, స్థానిక అధికారులతో సమీక్షా సమావేశం జరపారని అనుమానాలు కలుగుతున్నాయి. కాళేశ్వరం అవినీతి కేసు పరిశీలన – తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను సిబిఐ దర్యాప్తుకు అప్పగించినట్లు ప్రకటించారు. దానిపై ఆరంభ చర్యలు, ఫైల్ స్టడీ, స్థానిక అధికారుల నుంచి ప్రాథమిక సమాచారం సేకరణ కోసం డైరెక్టర్ స్వయంగా వచ్చివుంటారని తెలుస్తుంది. ప్రవీణ్ సూద్ కాళేశ్వరం ప్రాజెక్ట్ అంశంతో పాటు హైదరాబాద్ సిబిఐ జోన్ దక్షిణ ప్రాంత యూనిట్ల పనితీరు, ముఖ్యంగా హైదరాబాద్ యూనిట్ తీసుకుంటున్న కేసుల పురోగతి (అవినీతి, బ్యాంక్ మోసాలు, ఆర్థిక నేరాలు)పై సమీక్ష చేసినట్లు తెలిసింది. లోకల్ ఆఫీసర్లతో వ్యూహరచన – పెద్ద కేసులు, ముఖ్యంగా కాళేశ్వరం లాంటి హై ప్రొఫైల్ ప్రాజెక్ట్‌లో ముందుకు వెళ్లడానికి అవసరమైన లాజిస్టికల్, లీగల్, మానవ వనరుల ప్రణాళికపై అధికారులతో చర్చించినట్లు తెలిసింది.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది



వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య

ప్రజాపక్షం/హనుమకొండ: బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ముందుగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టీచర్స్ డే సందర్భంగా మానసిక దివ్యాంగ చిన్నారులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. చిన్నారులను అప్యాయంగా పలకరించిన ఎంపి వారి ఆరోగ్యం, ఏం చదువుతున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలసి స్నేహపూర్వకంగా మెలిగిన ఎంపీ డాక్టర్ కావ్య సహజ సాన్నిహిత్యం పిల్లల్లో మరింత ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని అన్నారు. ఒక ఉపాధ్యాయుడికి లభించే గౌరవం మరెవరికీ దక్కదు అని పేర్కొన్నారు. నేటి విద్యార్థులను రేపటి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయుల త్యాగం కృషి వల్లే సమాజంలో ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. మానసిక వికలాంగుల భద్రత కోసం ఐరిస్ కెమెరా టెక్నాలజీని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. మానసిక వికలాంగుల గుర్తింపు, భద్రత కోసం ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టమ్ అమలుపై మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషి చేస్తానని తెలియజేశారు. పండగ వేడెనా దివ్యంగ చిన్నారులతో కలసి జరుపుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉంటుందని ఎంపీ అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సేవలో అంకిత భావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని ఎంపీ చిరు సత్కారం చేసి ప్రోత్సహించారు. అదేవిధంగా మల్లికాంబ మనోవికాస కేంద్ర అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మ, ఫౌండర్ రామ లీల, ఈసీ మెంబర్లు సదానందం, కళ్యాణ్, ప్రముఖ ఇన్ ఫ్లుయెన్సర్ లోకేష్, టీచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేరం చేస్తే శిక్ష పడుతుందనే భయాన్ని కలిగించాలి: సిపి



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : ఏదైనా నేరం చేస్తే కోర్టులో శిక్ష పడుతుందనే భయాన్ని నేరస్తులకు కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. ఈ ఏడాది జనవరి నెల నుండి ఆగస్టు మాసం వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ న్యాయ స్థానాల్లో జరిగిన ట్రయల్స్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడటంలో కృషి చేసిన పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అభినందన సభను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడటంలో కృషి చేసిన జాయింట్ డిప్యూటీ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కోర్టు, ప్రాసెస్ విధులు నిర్వహించే పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనర్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప రిధిలో వివిధ నేరాలకు పాల్పడిన నేరస్తులకు కోర్టుల్లో శిక్షలు పడిన శాతం పెరిగిందని, ఇది ఏ ఒక్కరి వలన జరిగిందని కాదని, నిందితులకు శిక్షలు పడటం ద్వారా బాధితులకు న్యాయం జరగడంతో పాటు కోర్టు, పోలీసులపై ప్రజలకు నమ్మకం గౌరవం పెరుగుతుందని, ఇందుకోసం ఇన్స్‌స్పెక్టర్ స్థాయి పోలీస్ అధికారిని కోర్టు మానిటరింగ్ అధికారిగా నియమించడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. అదనపు డిసిపి రవి, వరంగల్ ప్రాసిక్యూషన్ ఆఫ్ జాయింట్ డిప్యూటీ డైరెక్టర్ రా ములు, సంగారెడ్డి జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్, సిసిఆర్‌బి ఏసిపి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, భరోసా కేంద్రం న్యాయధికారి, ఇన్స్‌స్పెక్టర్లు ,ఎస్‌ఐ వర్సెం హరావుతో పాటు సిసిఆర్‌బి సిబ్బంది, కో ర్టు హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డు పాల్గొన్నారు.

## పాముకాటుకు బాలిక మృతి

ప్రజాపక్షం/చొప్పదండి: పాముకాటు వేయడంతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన చొప్పదండి మండలం వెదురుగట్టు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గర్వంద రవీందర్ చిన్న కుమార్తె గర్వంద దీప్తిక(12) పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుకుంటోంది. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తన తండ్రి కిరాణ దుకాణంలో ఉన్న దీప్తికను విష సర్పం కుడికాలిపై కాటు వేసింది. పక్కనే ఉన్న పెద్ద కూతురు దర్శిక చూసి కేకలు వేయటంతో ఎదురింట్లో ఉన్న రవీందర్ తమ్ముడు సంతోష్‌కు తెలిసింది. వెంటనే సంతోష్ తన ఆటోలో నగునూరులోని ప్రతిమ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో మరణించింది. తన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# నేడు ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్ : వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకు హైదరాబాద్ నగరంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం జరగనుంది. ఈ సందర్భంగా ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించి, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరారు. బాలాపూర్ నుంచి వచ్చే ప్రధాన శోభాయాత్ర చార్మినార్, అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్‌బండ్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వస్తుంది. సికింద్రాబాద్ నుంచి వచ్చే విగ్రహాలు ప్యారడైజ్, ప్యాట్నీ, రాణిగంజ్, కర్బలామైదాన్ నుంచి ట్యాంక్‌బండ్ వద్దకు వస్తాయి. మెహిదీపట్నం, టోలిచౌకి నుంచి వచ్చేవి ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ చేరుకుంటాయి. ఆసిఫ్‌నగర్, టప్పాచబుత్ర నుంచి వచ్చే విగ్రహాలకు ఎంజే మార్కెట్‌లోకి మాత్రమే అనుమతి ఉంటుంది. ప్రధాన నిమజ్జన రూట్లలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తారు.

**ఆ జంక్షన్లలో వాహనాలకు అనుమతించరు :** చాంద్రాయణగుట్ట, సౌత్ ఈస్ట్ జోన్ కేశవగిరి, చంద్రగూడ, మూసారాంబాగ్ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలకు మళ్లింపులు ఉంటాయి. మదీనా, అలియాబాద్, నయాపూల్, ఎంజే మార్కెట్, దరుశ్శిఫా ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. పుత్లిబౌలి, హిమాయత్‌నగర్, శివాజీ బ్రిడ్జ్, వైఎంసిఏ ప్రాంతాల్లో ఆంక్షలు అమలులో ఉంటాయి. అబిడ్స్, లిబర్టీ, ట్యాంక్‌బండ్ ఖైరతాబాద్, బుద్ధభవన్ జంక్షన్లలో వాహనాలను అనుమతించరు.

**నార్త్ జోన్ :** పరడైజ్, ప్యాట్నీ, రాణిగంజ్ ప్రాంతాలలో ట్రాఫిక్‌ను మళ్లిస్తారు. లారీలకు నో ఎంట్రీ : నిమజ్జనానికి వచ్చే వాహనాల కోసం కట్టమైసమ్మ దేవాలయం, ఎన్టీఆర్ స్టేడియం, పబ్లిక్ గార్డెన్స్, ఆదర్శనగర్, బుద్ధభవన్ వెనుక, బిఆర్‌కె భవన్, ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్ వద్ద పార్కింగ్ ప్రదేశాలను అధికారులు ఏర్పాటు చేశారు. నిమజ్జనం పూర్తైన తర్వాత లారీలు హైదరాబాద్ నగరంలోకి రాకుండా ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మాత్రమే అనుమతిస్తారు. ఈ నెల 6న ఉదయం 8 నుంచి ఈ నెల 7 రాత్రి 11 వరకు సిటీలోకి లారీల ప్రవేశం ఉండదు. రద్దీ టైంలో మెహిదీపట్నం, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్, నారాయణగూడ వరకు మాత్రమే ఆర్టీసీ బస్సులకు అనుమతి ఉంది. అంతర్ రాష్ట్ర, జిల్లా బస్సులను చాదర్‌ఘాట్ వైపు మాత్రమే దారి మళ్లిస్తారు.

**నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం :** ఖైరతాబాద్, ఎంజే మార్కెట్, లిబర్టీ, అబిడ్స్, లిబర్టీ, తెలుగు తల్లి చౌరస్తా, రాణిగంజ్, నెక్లెస్ రోడ్ ట్యాంక్‌బండ్ పీపుల్స్ ప్లాజా జంక్షన్లను దాటకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలి. ఎయిర్ పోర్ట్‌కు వెళ్లేవారు పివిఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే లేదా ఔటర్ రింగ్ రోడ్ మాత్రమే ఉపయోగించాలని పోలీసులు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లేవారు బేగంపేట పారడైజ్ మార్గాన్ని ఎంచుకోవాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిమజ్జనం కోసం 8 పోర్టబుల్ వాటర్ ట్యాంకులు, 10 బేబీ పాండ్లు, 8 ఎక్స్‌వేషన్ పాండ్లను ఏర్పాటు చేసింది.

**సంప్రదించవలసిన హెల్ప్‌లైన్ నంబర్లు :** ఏదైనా సహాయం లేదా సమాచారం కోసం ప్రజలు 040–27852482, 9010203626, 8712660600 నంబర్లను సంప్రదించవచ్చు.



# ప్రతి జిల్లాలో 'డే' కేర్ సెంటర్లు

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఇప్పటికే తొమ్మిది వేల పోస్టులు భర్తీ



ప్రజాపక్షం/సంగారెడ్డి : రాష్ట్రంలోని నిరుపేద ప్రజలదరికి మెరుగైన ఉచిత వైద్యం అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్దితో పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ నారాయణ ఖేడ్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు రూ. 12.86 కోట్ల విలువైన వాట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొదటగా నారాయణఖేడ్ జుకల్ చౌరస్తాలో రూ.1.1.5 కోట్లతో చేపట్టనున్న కన్వెన్షన్ సెంటర్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణఖేడ్ మండలం జుకల్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.3.9 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేయనున్న అర్బన్ ఫారెస్ట్ డెవలప్మెంట్ పార్కు శంకుస్థాపన చేశారు. దమ్మారు నుండి మనూరు మండలం ఎన్జీ ముక్తాన్‌పూర్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బి బీటీ రోడ్డు రూ.6 కోట్లతో చేపట్టనున్న పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణఖేడ్ పట్టణంలోని అంతర్గత రోడ్ల అనుసంధానానికి ఫార్మేషన్ రింగు రోడ్డు ఏర్పాటు కోసం కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సిర్గాపూర్‌లో రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జహీరాబాద్ ఎంపి సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ శాసనసభ్యులు, సంజీవరెడ్డి, లతో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుపేద ప్రజల నాణ్యమైన ఉచిత వైద్యంతో పాటు మెరుగైన ఉచిత వైద్య సేవలు ప్రభుత్వ పరంగా అందించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న తొమ్మిది వేల పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. త్వరలో వైద్య ఆరోగ్యశాఖలో మరోవేల పోస్టుల భర్తీకి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను కార్పోరేట్ ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన మౌళిక వసతులు కల్పించడం ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయడం ద్వారా ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఒక డేకేర్ క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి గ్రామంలో మొబైల్ వాహనాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. హైవే రోడ్లలో ప్రమాదాలు జరిగితే వెంటనే చికిత్స అందించడానికి ప్రమాదం జరిగిన 15 నిముషాల్లో ఆసుపత్రికి చేరుకునేలా హైవేల వెంట ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. హైవేల వెంట ప్రతి 30 కిలోమీటర్ల పరిధిలో ఒక ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ లు పాదు చేయున్నట్లు పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాని అధికారులకు సూచించారు. ఏ రాత్రి పేషంట్ వచ్చిన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నల్లవాగు ప్రాజెక్టును టూరిస్టు కేంద్రంగా మార్చాలని సంజీవరెడ్డి ఎమ్మెల్యే ప్రభుత్వానికి కోరారు. సిర్గాపూర్ లోని నల్లవాగు ప్రాజెక్టు నిధులు కేటాయించి టూరిస్ట్ కేంద్రంలో అభివృద్ధి చేయాలని నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈసందర్భంగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి ఇంకా నిధులు అవసరమని ఎమ్మెల్యే కోరారు. ఆసుపత్రిలో వైద్యులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని ఎమ్మెల్యే మంత్రికి విజ్ఞప్తి చేశారు. మారుమూల ప్రాంతమైన నారాయణ ఖేడ్‌ను విద్య రంగాలలో అభివృద్ధి చేయాలని సురేష్ షెట్కార్ ఎంపి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని మారుమూల నియోజకవర్గమైన నారాయణ ఖేడ్ నియోజకవర్గాన్ని విద్యా వైద్య రంగాల్లో అభివృద్ధి పరచాలని అసరమున్న చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అవిప్రాయించారు. ఎంపి సురేష్ షెట్కార్ విజ్ఞప్తి చేశారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారిక, రెవెన్యూ అధికారులు పంచాయతీరాజ్ ,అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా పశువుల రవాణా..

43 పశువులతో మూడు వాహనాలు పట్టివేత

ప్రజాపక్షం/చింతలమానేపల్లి : అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. శుక్రవారం చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామ సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మహారాష్ట్ర నుండి జగిత్యాలకు అనుమతులు లేకుండా పశువులను రవాణా చేస్తూ వచ్చిన మూడు బొలేరో వాహనాలను పోలీసులు గుర్తించి అపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 43 పశువులను తరలిస్తున్నట్లు బయటపడగా, అందులో 9 పశువులు అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఆదే బాపూరావు, షాయిక్ అనీం, ముబ్బార్ బీగ్, నక్క శంకర్, షకీల్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృత పశువులను పశువైద్యుల పంచనామా అనంతరం గ్రామ పంచాయతీకి అప్పగించి ఖననం చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ, పశువుల అక్రమ రవాణా కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహుని సన్నిధిలో హైకోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్



ప్రజాపక్షం/భీమ్‌గల్: ప్రముఖ పుణ్యక్షేత్రం నింబాచల లక్ష్మీ నర్సింహస్వామి ఆలయాన్ని హైకోర్టు జడ్జి గాడి ప్రవీణ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ధర్మకర్త నంబి పార్థసారథి ఆధ్వర్యంలో వేదపండితులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. మొదటగా గర్భాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు స్వామివారి శేష వస్త్రాన్ని అందజేసి జడ్జీ ఆశ్లాడారు. ఎంతో ప్రాముఖ్య కలిగిన క్షేత్రాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తన స్వగ్రామమైన భీమ్‌గల్‌కు హైకోర్టు జడ్జీగా పదవి చేపట్టి మొదటిసారిగా రావటంతో గ్రామస్తులంతా వచ్చి తనకు స్వాగతం పలకడం ఎంతో సంతోషంగా అనిపించిందని తెలిపారు. ఆలయం ధర్మకర్త నంబి పార్థసారథి ఆలయ విశిష్టత జడ్జీకి తెలిపారు. జడ్జి వెంట ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనిధి సిబ్బంది మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల రాజశ్రీ, లక్ష్మన్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నర్సయ్య, ఆలయ పురోహితులు నంబి వాసుదేవ్, శ్రీనివాస్, పవన్, శ్యామ్, భూమయ్య, శ్రీనివాస్, సుదర్శన్, రాజశేఖర్ ఉన్నారు.

# కలిసికట్టుగా గిరిజన విద్యాభివృద్ధికి పాటుపడదాం



ప్రజాపక్షం/భద్రాచలం : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, మట్టిలోని మాణిక్యాలైన గిరిజన విద్యార్థినీ విద్యార్థులను వెలికితీసి తీర్చిదిద్దుతూ వారి భవిష్యత్ బాటలు వేస్తున్న మీరు ధన్యులని, అంతా కలిసికట్టుగా గిరిజన విద్యాభివృద్ధికి మరింత కృషి చేద్దామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గిరిజన భవన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో పిఓ ముఖ్యాతిథిగా హాజరైన మాట్లాడారు. ముందుగాజ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల విద్యకు సంబంధించిన అంశాలను కవిత రూపంలో తెలియజేశారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, మా కుటుంబంలో అంతా ఉపాధ్యాయులు, అధ్యాపకులే అని, సుహాద్దచారిణి కూడా ఉపాధ్యాయురాలే అన్నారు. తాను ట్రైనింగ్ చేసే సమయంలో విద్యార్థుల్నిపై పరిశీలన చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో పలుచోట్ల విద్యారంగానికి సంబంధించిన ప్రయోగాలు చేశామన్నారు. ఐటిడిఏ పీఓగా పని చేస్తే అనేక అంశాలు తెలుసుకునే అవకాశం ఉందని అన్నారు. గిరిజనసంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, జిసిసీలలో, కళాశాలల్లో సుమారు35 వేల మంది చదువుకుంటున్నారని, అందరి సహకారంతో గిరిజన విద్యాభివృద్ధి నికి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పిల్లలు సులభరీతిలో చదువులు సాగించేందుకు ఉద్దీపకం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. తద్వారా సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. బిఇడి,డిఇడి కాలేజీలో నూరుశాతం ఫలితాలు రాబట్టిన లెక్చరర్లకు మెమోంటోలు అందించి శాలువాలతో సత్కరించారు. డిడి మణెమ్మ, ఏసిఎంఓ రాములు, ఏటిడి ఓలు అశోక్, చంద్రమోహన్, జిసిడిఓ అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక 'పోరు'పై సర్వత్రా ఉత్కంఠ





రిజర్వేషన్లపై ఊహాగానాలు

ప్రజాపక్షం/ ఖమ్మం సిటీ : గ్రామాల్లో సర్పంచులు లేక గ్రామీణ వ్యవస్థ కుంటుపడుతుందని సెప్టెంబర్ 30వ తేదీలోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని హైకోర్టు హుకుం జారీ చేసిన విషయం విధితమే. హైకోర్టు ఆదేశాలు దగ్గరపడుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు పావులు కదుపుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల జాబితాపై కసరత్తు మొదలుపెట్టింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించ లేదు. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను ఎదుర్కొని ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని చెబుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారని కాంగ్రెస్ శ్రేణులు దీమాతో ఉండగా కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ఆరు గ్యారెంటీల అమలు చేయడం అటుంచి యూరియా కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని బిఆర్ఎస్ వర్గాలు దీమాతో ఉన్నాయి. కమ్యూనిస్టుల కంచుకోట అయిన ఖమ్మం జిల్లాలో సత్తా చాటేందుకు కమ్యూనిస్టులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే సిపిఐ గ్రామ, మండల, జిల్లా మహాసభలను ఉత్తేజభరితంగా ముగించుకుని కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చింది. సిపిఎం జిల్లా వ్యాప్తంగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చింది. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి జరుగుతుందని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బిజెపి పార్టీని ఆదరిస్తారని బిజెపి శ్రేణులు దీమా వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరి దీమా ఎలా ఉన్నా స్థానిక పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**పాత రిజర్వేషన్లు ఉంటాయా?**

తెలంగాణ రాష్ట్రంలో రెండు కోట్ల పైచిలుకు ఉన్న బిసిలకు రాజ్యాంగ బద్దంగా 29 శాతం ఉన్న రిజర్వేషన్లను 42 శాతం వరకు పెంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ది పొందాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర ప్రభుత్వ తీరు తలనొప్పిగా మారింది. రాజ్యాంగబద్ధంగా బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధంగా లోక్‌సభలో రిజర్వేషన్ బిల్లును ఆమోదం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై సుముఖంగా లేదని జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే అర్థమవుతుంది. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలో దిగాలని ఆలోచిస్తే ఆశావాహులు రిజర్వేషన్లపై పలు రకాల ఊహాగానాలు చేస్తున్నారు. రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాదని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహిస్తే పాత రిజర్వేషన్ పద్ధతి అమలయ్యే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వంపై రోజు రోజుకు పెరుగుతున్న వ్యతిరేకత దృష్ట్యా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారనున్నాయి. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో 571 గ్రామ పంచాయితీలు , 5,214 వార్డులు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 8,02,691మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 3,88,244 మంది పురుషులు, 4,14,425 మంది మహిళలు, 22 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఎక్కువ ఓటర్లు కలిగిన మండలంగా కూసుమంచి మొదటి స్థానంలో ఉంది. మొత్తం 50,149 మంది ఓటర్లను కలిగి ఉంది. తక్కువ ఓటర్లు కలిగిన మండలంగా వైరా ఉంది. దీనిలో 27,306 మంది ఓటర్లు కలిగి ఉంది. జిల్లాలో మొత్తం ఓటర్లలో మహిళలు 4,14,425 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 26,181 మంది అధికంగా ఉన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను రాయ్‌బరేలిలో నిలపండి

### రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాహుల్‌గాంధీ లేఖ

**రాయ్‌బరేలి :** దిబ్రూగఢ్– న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలును రాయ్‌బరేలి జంక్షన్ వద్ద నిలపాలని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఈ రైలు ఇప్పటికే రాయ్ బరేలి గుండా వెళ్తుందని, తన నియోజకవర్గ ప్రయాణికులు చాలా కాలంగా ఈ రైలును రైల్వే స్టేషన్‌లో నిలపాలని కోరుతున్నారన్నారు. ముఖ్యంగా దేశ రాజధాని వైపు ప్రయాణాన్ని సులభతరం చేయాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. రాయ్‌బరేలి జంక్షన్‌లో 20503/20504, 20505/20506 రైలు నంబర్లు గల రైలు హాల్ట్ అయ్యేలా చూడాలన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నట్లు ఆయన రైల్వే మంత్రికి రాసిన లేఖలో వెల్లడించారు. రాహుల్ ఈనెల 3వ తేదీన కేంద్ర మంత్రికి లేఖ రాశారు. దిగ్రూగఢ్–న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలును రాయ్‌బరేలిలో నిలపాలన్న డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, దానిని నెరవేర్చడం వల్ల తన నియోజకవర్గ ప్రజల అత్యవసర అవసరం తీరుతుందన్నారు.

### పాఠశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో...

## స్మార్ట్ టీచర్ల ఆవశ్యకత కీలకం

### జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ముర్ము

### నా జీవితంలో 'అత్యంత అర్థవంతమైన కాలం' టీచర్‌గా పనిచేసిన సమయమేనని జ్ఞప్తి చేసుకున్న ముర్ము




**న్యూఢిల్లీ :** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ నిర్మాణంలో ఉపాధ్యాయ వృత్తి ప్రాముఖ్యతను, ఉపాధ్యాయుల గురుతర బాధ్యతను ఉద్బోధించారు. స్మార్ట్ బ్లాక్ బోర్డులు, స్మార్ట్ క్లాస్ రూములు, ఇతర అధునాతన వసతులు పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థల్లో వాటికంటూ సొంత ప్రాముఖ్యతను కలిగిఉన్నప్పటికీ స్మార్ట్ టీచర్ల పాత్రే అత్యంత కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. తాను టీచర్‌గా పని చేసిన సమయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు. అది తన జీవితంలో 'అత్యంత అర్థవంతమైన కాలం' అని ముర్ము అభివర్ణించారు. శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన జాతీయ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. బోధన, అభ్యాసానికి ఆదర్శప్రాయమైన కృషి చేసిన 60మందికి పైగా ఉపాధ్యాయులుకు ఆమె అవార్డులు అందజేశారు. స్మార్ట్ బ్లాక్ బోర్డులు, స్మార్ట్ తరగతిగదులు, ఇతర అధునాతన వసతులకు వాటి సొంత ప్రాముఖ్యత ఉంది. కానీ అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే ఎవరైతే వారి విదార్థుల అవసరాలను అర్థం చేసుకుని వారి అభివృద్ధికి కృషిచేస్తారో అలాంటి స్మార్ట్ టీచర్ల అవసరమే ప్రస్తుత విద్యావ్యవస్థలో అధికంగా ఉందన్నారు. స్మార్ట్ టీచర్లు అధ్యయనాలను ఆసక్తికరంగా, సమర్థవంతంగా ఆప్యాయత, సున్నితత్వంతో ప్రభావవంతం చేస్తారన్నారు. అలాంటి స్మార్ట్ టీచర్లే సమాజం, దేశం అవసరాలను నెరవేర్చే సామర్థ్యాలను కలిగే సత్తాను కలిగిఉంటారన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని నిర్మించడం ఉపాధ్యాయుడి ప్రాథమిక కర్తవ్యం అని రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'సున్నితత్వం, బాధ్యతాయుతం, అంకితభావం కలిగిన విద్యార్థులు పోటీతత్వం, పుస్తకజ్ఞానం, స్వార్థం మాత్రమే ఆసక్తి ఉన్న విద్యార్థుల కంటే ప్రవర్తనను అనుసరించే వారు మెరుగ్గా ఉంటారు. మంచి ఉపాధ్యాయుడికి భావోద్వేగాలు, తెలివితేటలు ఉంటాయి. భావోద్వేగాలు, తెలివితేటల సమన్వయం విద్యార్థులపై ప్రభావం చూపుతుంది' అని రాష్ట్రపతి చెప్పారు. 'పేద నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లలు విద్య శక్తితో పురోగతిని తాకగలరు. ఆప్యాయత, అంకితభావంతో కూడిన పిల్లలు పిల్లల ప్రయాణానికి బలం చేకూర్చడంలోఅతి ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. ఉపాధ్యాయులకు లభించే అతిపెద్ద బహుమతి ఏమిటంటే వారి విద్యార్థులు వారిని వారి జీవితకాలం గుర్తుంచుకుంటారు, కుటుంబానికి, సమాజానికి, దేశానికి ప్రశంసనీయమైన సహకారాన్ని అందిస్తారు' అని ముర్ము చెప్పారు. దేశాన్ని గ్లోబల్ నాలెడ్జి సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం అని వివరించారు. దీనికోసం మన ఉపాధ్యాయులను ప్రపంచంలోనే అత్యుత్తమ బోధనా నిపుణులుగా గుర్తించాలన్నారు. మన సంస్థలు, ఉపాధ్యాయులు విద్యకు సంబంధించిన మూడు రంగాలలో అవేమిటంటే పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యవిద్యలో చురుకుగా సహకరించాలని కోరారు. అవార్డు గ్రహీతలు భారతదేశంలో యువ మనస్సులను రూపొందించడంలో కీలకపాత్ర పోషించారని రాష్ట్రపతి వారిని అభినందించారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ జాతీయ అవార్డు గ్రహీతలైన ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే ప్రచారాలను బోధించడానికి, 'మేక్ ఇన్ ఇండియా', 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమాలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు వారికి హోంవర్క్ ఇవ్వాలని ప్రధాని ఈ సందర్భంగా వారిని కోరారు.

## పునరుత్పాదక ఇంధన వనరులు కీలకం

### అపార పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఉన్నా... భారత్, హెచ్‌కెహెచ్ దేశాల సరఫరాలో 'క్లీన్ ఎనర్జీ' 6.1 శాతమే !

### ఐసిఐఎంఒడి కొత్త నివేదిక వెల్లడి

### భారత్, చైనా దేశాలే క్లీన్ ఎనర్జీకి 'మార్గదర్శకులు' అని సమన్వయ ప్రధాన రచయిత అవిషేక్ మల్లా కితాబు




**న్యూఢిల్లీ :** అపారమైన పునరుత్పాదన శక్తి సామర్థ్యం ఉన్నప్పటికీ భారత దేశం సహా హిందూ కుష్ హిమాలయాల (హెచ్‌కెహెచ్) దేశాలలో మొత్తం ప్రాథమిక ఇంధన సరఫరాలో క్లీన్ ఎనర్జీ కేవలం 6.1శాతం మాత్రమే ఉందని, మిగులు జలవిద్యుత్ ఉన్నప్పటికీ 'చాలా తక్కువగా మాత్రమే వినియోగించబడుతుంది' అని శుక్రవారం ఒక కొత్త నివేదిక తెలిపింది. బ్యాంకాక్‌లో ప్రారంభించిన ఆసియా పసిఫిక్ క్లీన్ ఎనర్జీ వీక్‌లో సమీకృత పర్వత అభివృద్ధి అంతర్జాతీయ కేంద్రం (ఐసిఐఎంఒడి) అంచనా ప్రకారం ఆఫ్ఘనిస్థాన్, భూటాన్, బంగ్లాదేశ్, చైనా, ఇండియా, మ్యాన్మార్, నేపాల్, పాకిస్థాన్‌లో గుర్తించబడిన 882 గిగావాట్ల జలవిద్యుత్ సామర్థ్యాలలో 635 గిగావాట్లు హిందూ కుష్ హిమాలయాల నదులలో ఉన్నాయని తెలిపింది. ఇందులో కేవలం 49శాతం మాత్రమే ఉపయోగించబడ్డాయి.ఈ ప్రాంతంలో రిజర్వాయర్‌లో నాన్ హైడ్రో క్లీన్ ఎనర్జీ సామర్థ్యం (సౌర, పవన్) 3 టెరావాట్ల వద్ద ఉన్నది' అని ఆ నివేదిక తెలిపింది. వాతావరణ హామీల ప్రకారం హిందూ కుష్ హిమాలయాల దేశాల ఉమ్మడి ఇంధన పునరుత్పాదక లక్ష్యాల మొత్తం 1.7 టెరావాట్స్ కాగా ఈ ప్రాంతంలోనే పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 3.5 టెరావాట్స్‌గా ఉందని నివేదిక వెల్లడించింది. భూటాన్, నేపాల్ తమ విద్యుత్ మొతాన్ని పునరుత్పాదన నుంచి ఉత్పత్తి చేస్తాయి. అయితే ఇతర హిందూ కుష్ హిమాలయాల దేశాలలో శిలాజ ఇంధనాల ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో 98శాతం, భారతదేశంలో 77శాతం, పాకిస్థాన్‌లో 76శాతం, చైనాలో 67శాతం, మయన్మార్‌లో 51శాతంగా ఉంది. నాలుగుదేశాలలో ప్రాథమిక శక్తి వినియోగంలో బయో ఇంధనాలు సహ వ్యర్థాలు 'భయంకరంగా అధిక' వాటాను కలిగి ఉన్నాయి. నేపాల్‌లో మూడింట రెండు వంతులు, మయన్మార్‌లో సగం, భూటాన్, పాకిస్థాన్‌లలో పావువంతు. దీని అర్థం ఈ దేశాల ఆరోగ్యం, గాలినాణ్యత ప్రభావాలతో వంట, హీటింగ్ కోసం అవశేషాలు పేడపై ఆధారపడతాయి. నీటి వైవిధ్యం, తీవ్రమైన వాతావరణం, మౌలిక సదుపాయాల నష్టం ద్వారా వాతావరణ మార్పు హైడ్రోపవర్‌కు అంతరాయం కలిగిస్తుందని అధ్యయనం హెచ్చరించింది. సరస్సు విస్ఫోటనం, వరదలు , ఇతర సంఘటనలు అనుబంధ ప్రాజెక్టులకు పెద్ద ప్రమాదాలను కలిగిస్తున్నాయి. దాదాపు మూడింట రెండు వంతుల మంది హిమానీనదుల బారిన పడుతున్నారని, విపత్తు ప్రమాద వ్యూహాలను పునరుత్పాదక ఇంధన వనరులతో అనుసంధానించాల్సిన ఆవశ్యకతను ఈ నివేదిక నొక్కిచెప్పింది. బహుళార్థక సాధక ప్రాజెక్టులు మాత్రమే మెగా వరదలు లేదా నీటి వృథా ప్రమాదాలను పరిష్కరించలేవని ఆ నివేదిక స్పష్టం చేసింది. సమర్థవంతమైన నీటి పారుదల, పట్టణ నీటి నిల్వ సౌర, పవన శక్తిని స్వీకరించడం వంటి చర్యల ద్వారా ఆనకట్టలకు సమానమైన వాటిని అన్వేషించాలని నివేదిక సిఫారసు చేసింది. అధిక వ్యయాలు, పరిమితమైన ప్రభుత్వ నిధులు, ప్రైవేట్ పెట్టుబడులు లేకపోవడం, సాంకేతిక అంతరాలు, భూపరిమితులు, నవీకరించబడిన చట్టం లేకపోవడం వంటి బహుళ అడ్డంకులను ఈ అధ్యయనం గుర్తించింది. 'మాలో అసాధారణమైన పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఉంది. అలాగే భారతదేశం, చైనాలో కూడా అసాధారణమైన పునరుత్పాదక శక్తి ఉంది. ప్రపంచంలోని ఈ రెండు దేశాలూ క్లీన్ ఎనర్జీకి మార్గదర్శకులు' అని సమన్వయ ప్రధాన రచయిత అవిషేక్ మల్లా చెప్పారు. 'పునరుత్పాదక శక్తిలో ఉన్నటు వంటి ఈ అద్భుతమైన పోటీ ప్రపంచాన్ని నిర్మించడం అనేది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువస్తూ గ్రీన్ ఆర్థికవృద్ధిని టర్బోచార్జి చేయడానికి మా ప్రతిష్ఠాత్మక ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను సాధించడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని సూచిస్తుంది' అని అవిషేక్ మల్లా తెలియజేశారు. హిందూకుష్ హిమాలయాల ప్రాంతానికి పునరుత్పాదక ఇంధన వనరులపై ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, మౌలిక సదుపాయాలలో పెట్టుబడి ఎలా అవసరమో, దక్షిణాదిలో భారీ పెరుగుదల, సాంకేతిక మార్పిడి ఎలా అవసరమో దేశాలు ఆలోచించడం చాలా కీలకమని మల్లా చెప్పారు.

## న్యాయవ్యవస్థ ప్రజలకు, రాజ్యాంగానికి మధ్య వారధి

### 'సుప్రీం' ప్రధానన్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ఉద్ఘాటన



న్యూఢిల్లీ : న్యాయవ్యవస్థ ప్రజల ఆకాంక్షలకు, రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆదర్శాలకు మధ్య వారధిగా పనిచేస్తుందని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఉద్ఘాటించారు. శుక్రవారం ఖాట్మండ్‌లో జరిగిన నేపాల్‌ఇండియా జ్యుడీషియల్ డైలాగ్ 2025లో ఆయన ప్రసంగించారు. కేవలం వివాదాలను పరిష్కరించడం మాత్రమే న్యాయవ్యవస్థ విధి కాదని, న్యాయం, సమానత్వం, మానవ గౌరవం ఇనుమడించే సూత్రాలను ఆచరణలో పెట్టడం కూడా న్యాయవ్యవస్థ విధి అని ఆయన నొక్కిచెప్పారు. 'రెండు దేశాలలోనూ న్యాయవ్యవస్థ ప్రజల స్ఫూర్తికి, రాజ్యాంగంలో పొందుపర్చబడిన ఆదర్శాలకు మధ్య వారధిగా పనిచేస్తుంది. వివాదాలను పరిష్కరించడమే కాకుండా న్యాయం, సమానత్వం, మానవ గౌరవాన్ని పెంపొందించడం ఆచరణలో పెట్టుకోవాలి' అని కోరుతున్నానన్నారు. న్యాయస్థానాలు సమయోచిత ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చట్టాలను వివరించడం ద్వారా పాలన పరిణామాలకు మార్గనిర్దేశనం చేయగలవని, ప్రజలను ప్రేరేపించగలవని సిజెఐ గవాయ్ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని బలోపేతం చేసేందుకు సుప్రీంకోర్టు కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## శిల్పాశెట్టి దంపతులపై లుకౌట్ నోటీసులు

### దేశం విడిచివెళ్లకుండా నిఘా



**న్యూఢిల్లీ :** బాలీవుడ్ నటి శిల్పాశెట్టితోపాటు ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రాపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. 60 కోట్ల రూపాయల ఆర్థిక మోసానికి సంబంధించిన చీటింగ్ కేసులో ముంబయి పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం వారిపై లుకౌట్ నోటీసులు జారీ చేసింది. శిల్పాశెట్టి దంపతులు తరచూ అంతర్జాతీయ పర్యటనలు చేపడుతున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. 60 కోట్ల రుణం, పెట్టుబడులకు సంబంధించి ఆర్థిక ఒప్పందం చేసుకున్న ఒక వ్యాపారవేత్తను శిల్పా దంపతులు మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. దీనిపై ఆగస్టు 14న జుహూ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని వివరించారు. నిందితులు దేశం విడిచివెళ్లకుండా వారిపై నిఘా ఉంచడం కోసం లుకౌట్ నోటీసులు జారీ చేస్తారు. ఫలితంగా ఇమ్మిగ్రేషన్, సరిహద్దు నియంత్రణ పాయింట్ల వద్ద అధికారులు నిందితులను అదుపులోకి తీసుకునే వీలుంటుంది. కాగా, ముంబయి చెందిన దీపక్ కొఠారీ అనే వ్యాపారవేత్త నటి శిల్పాశెట్టి, రాజ్ కుంద్రాపై తీవ్ర ఆరోపణలు చేశారు. 2015లో రాజేశ్ ఆర్య అనే వ్యక్తి ద్వారా శెట్టి కుంద్రాతో తనకు పరిచయం ఏర్పడిందని దీపక్ ఫిర్యాదులో చెప్పారు. అప్పడు వీరు ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్ అయిన బెస్ట్ డీల్ టీవీకి డైరెక్టర్లుగా ఉన్నారని, అప్పటికి ఆ కంపెనీలో 87 శాతం కంటే ఎక్కువ వాటా ఉందని పేర్కొన్నారు. అయితే 20152023 మధ్య కాలంలో వ్యాపార విస్తరణ కోసం దీపక్ వీరికి రూ. 60.48 కోట్లు ఇవ్వగా, ఆ నిధులను శెట్టి తన వ్యక్తిగతంగా ఖర్చు చేశారని వాపోయారు. 2015 ఏప్రిల్‌లో మొదటి విడతగా రూ. 31.95 కోట్లు ఇచ్చానని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2015 జులై, 2016 మార్చి మధ్య రూ. 28.54 కోట్లు అదనంగా బదిలీ చేశానని చెప్పారు. అలా మొత్తంగా రూ. 60.48 కోట్లుకు పైగా బదిలీ చేశానని చెప్పుకొచ్చారు. ఓ సమావేశం నిర్వహించి డబ్బును సకాలంలో తిరిగి ఇస్తామని శెట్టి హామీ ఇవ్వడంతో ఒప్పందం కుదిరినట్లు దీపక్ వివరించారు. కానీ నెల తర్వాత సెప్టెంబర్‌లో శెట్టి కంపెనీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారని తెలిపారు. ఆ తర్వాత ఆ కంపెనీపై రూ. 1.28 కోట్ల దివాలా కేసు బయటపడిందని, ఈ విషయాన్ని బయటకి చెప్పలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఉక్రేన్‌లోని విదేశీ దళాలే లక్ష్యం

### ఆతర్వాత శాంతి ఒప్పందంపై సంతకం చేస్తామన్న పుతిన్

**కైవ్:** ఉక్రేన్‌తో శాంతి ఒప్పందంపై సంతకం చేయడానికి ముందు, అక్కడ మొహరించిన విదేశీ దళాలనే లక్ష్యంగా చేసుకుంటామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. మాస్కో దళాలు ఈ లక్ష్యంవైనే ముందడుగు వేస్తాయన్నారు. యూరోపియన్ నాయకులు సంభావ్య శాంతి పరిరక్షక దళానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించిన కొన్ని గంటల్లోనే పుతిన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇప్పుడు పోరాటం కొనసాగుతున్నదని, కాబట్టి ఉక్రేన్‌లో విదేశీ దళాలు ఏవైనా కనిపిస్తే, అవే తమ చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారతాయని రష్యా తూర్పు నగరమైన వ్లాడివోస్టాక్‌లో జరిగిన ఆర్థిక ఫోరమ్ ప్యానెల్‌లో పాల్గొన్న పుతిన్ పేర్కొన్నారు. శాంతి ఒప్పందం తర్వాత కూడా ఉక్రేన్‌లో శాంతి పరిరక్షక దళాలను రష్యా ఉంచుతుందనే వార్తలను పుతిన్ తోసిపుచ్చారు. ఉక్రేన్‌తో శాంతి ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు.

## నకిలీ ఐఎఎస్ అధికారి గుట్టురట్టు..

లక్నో: నకిలీ ఐఎఎస్ అధికారి గుట్టురట్టయ్యింది. పలు లగ్జరీ కార్లతో అతడు బిల్డప్ ఇచ్చాడు. కార్లపై నీలి బీకాన్లు అమర్చాడు. నకిలీ పాసులతో సచివాలయంలోకి ప్రవేశించేవాడు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు సీనియర్ అధికారులతో సమావేశాలు కూడా నిర్వహించాడు. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. గౌతమ్ బుద్ధ నగర్‌కు చెందిన 36 ఏళ్ల సౌరభ్ త్రిపాఠి కంప్యూటర్ సైన్స్‌లో బిటెక్ పూర్తి చేశాడు. ఒక ఎన్‌జిఒ సంస్థను ఏర్పాటు చేశాడు. దీని కోసం చాలా మంది సీనియర్ అధికారులు, నాయకులను కలిశాడు. ఈ సందర్భంగా అధికారుల తీరు, వారి ప్రవర్తనను నిశితంగా గమనించాడు. సీనియర్ అధికారిగా బిల్డప్ ఇచ్చేందుకు మూడు ఇన్నోవాలతోపాటు రేంజ్ రోవర్ డిఫెండర్, మెర్సిడెస్ బెంజ్, టయోటా ఫార్చ్యూనర్ వంటి సూపర్ లగ్జరీ కార్లను కాన్వాయ్‌లో వినియోగించాడు. కార్లపై నీలి బీకాన్లు అమర్చాడు. 'ఉత్తరప్రదేశ్ విధాన సభ, విధాన పరిషత్, సెక్రటేరియట్, భారత ప్రభుత్వం' అని ఉన్న స్టిక్కర్లు వినియోగించేవాడు.

### ఆర్టికల్ 15(5)ను అమలు చేసేలా

## పార్లమెంట్‌లో చట్టం చేయాలి

### కాంగ్రెస్ ఎస్‌సి విభాగం డిమాండ్




**న్యూఢిల్లీ :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు రిజర్వేషన్లకు సంబంధించిన ఆర్టికల్ 15(5)ను అమలు చేయడానికి వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం చట్టం తీసుకురావాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. తన వాదనను బలపరిచేందుకు ప్రతిపక్ష పార్టీ పార్లమెంటరీ కమిటీ నివేదికను ఉదహరిస్తూ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి కమ్యూనిటీ విద్యార్థులు తక్కువగా ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొంది. ఆదివాసీ కాంగ్రెస్ చీఫ్ విక్రాంత్ భూరియా, పార్టీ ఒబిసి విభాగాధిపతి అనిల్ జైహింద్‌లతో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్‌సి విభాగం చీఫ్ రాజేంద్ర పాల్ గౌతమ్ మాట్లాడుతూ దేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉందని, అయితే అక్కడ రిజర్వేషన్లు అమలు చేయకపోవడం, డబ్బు లేకపోవడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాల పిల్లలు అందులో విద్య అభ్యసించలేకపోతున్నారన్నారు. ఈ కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే చట్టం చేసిందన్నారు. కానీ ప్రజలు దీనిని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లారని, ఆ తరువాత 2008లో రిజర్వేషన్లపై నిర్ణయం సరైనదని సమర్థిస్తూ ఒక ప్రకటన వచ్చిందన్నారు. తర్వాత 2011లో కూడా ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్లపై నిర్ణయాన్ని కోర్టు సమర్థించిందన్నారు. 2014లో సుప్రీంకోర్టు కూడా ఈ చట్టం చెల్లుబాటు అవుతుందని ప్రకటించిందని, ఇది చట్టబద్ధంగా అనుకూలంగా ఉందని చెప్పిందని గౌతమ్ గుర్తుచేశారు. గత సంవత్సరం పార్లమెంటు కమిటీ వివిధ సంస్థలతో చర్చలు జరిపిందని, ఆ తర్వాత ప్రైవేట్ విద్యా సంస్థలలో షెడ్యూల్డ్ కులాల నుండి 0.89% విద్యార్థులు, షెడ్యూల్డ్ తెగల నుండి 0.53% విద్యార్థులు, ఒబిసిల నుండి 11.16% విద్యార్థులు మాత్రమే ఉన్నారని తేలిందన్నారు. సామాజిక సమానత్వం తీసుకురావాలంటే ఓటు హక్కు, రిజర్వేషన్లు ఉండాలని బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పారని భూరియా అన్నారు. కానీ బిజెపి పాలకులు ఓటు హక్కు, రిజర్వేషన్ రెండింటినీ దొంగిలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను క్రమంగా మూసివేసే కుట్ర జరుగుతుందని, ఆపై మొత్తం విద్యా వ్యవస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే యత్నాలు సాగుతున్నాయని మండిపడ్డారు. 11 గడిచినా మోదీ ప్రభుత్వం యుపిఎ ప్రభుత్వం చేసిన ఈ చట్టంపై ఎలాంటి చర్య తీసుకోలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల అమలుకు సంబంధించి చట్టం చేసిందని, సుప్రీంకోర్టు ఈ చట్టాన్ని అమలు చేయాలని పేర్కొందని, కానీ మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తోందని జైహింద్ ఆరోపించారు. ఆగస్టు 20, 2025న పార్లమెంటుకు విద్యపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన నివేదికను ఉటంకిస్తూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5)ని అమలు చేసే చట్టాన్ని ప్రభుత్వం ఆమోదించాలని ఏకగ్రీవంగా సిఫార్సు చేసిందని వారు ఎత్తి చూపారు. మోదీ ప్రభుత్వం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సును పరిగణనలోకి తీసుకుని పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5)ని అమలు చేసే చట్టాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేస్తోందన్నారు.

### గ్రామీణ ఉపాధిహామీ పథకానికి

## సుదీర్ఘకాలంగా తగ్గుతున్న నిధులు

### పథకం డిమాండ్ దార్శినికతను మోదీ ప్రభుత్వం ఎద్దేవా చేస్తోంది : కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వం సుదీర్ఘకాలంగా గ్రామీణ ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గిస్తూ వస్తోందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఈ పథకం డిమాండ్ ఆధారిత దార్శినికతను ఎద్దేవా చేస్తోందని విమర్శించింది. నిజ ఆదాయ వృద్ధిని ప్రారంభించడానికి గణనీయమైన బడ్జెట్ పెంచాలని, రోజుకు కనీస వేతనం రూ. 400 ఇవ్వాలనే తన డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. గ్రామీణ ఉపాధిహామీ పథకం చట్టంగా మారి 20 ఏళ్లు పూర్తి చేసుకున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద సాంఘిక సంక్షేమ పథకం సాధించిన అనేక విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలన్నారు. మోదీ ప్రభుత్వంలో ఈ పథకం అనిశ్చితిలో ఉందని, దీనిపై అందరం కలిసి పోరాడాలని శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ నిబంధనలు ప్రభుత్వ పథకాలకు కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో 60 శాతానికి పైగా ఖర్చు చేయడాన్ని నిషేధించాయని ఆయన అన్నారు. అయితే మంత్రిత్వ శాఖ ఐదు నెలల్లోనే తన బడ్జెట్‌లో 60 శాతాన్ని గాలికొదిలేసిందని, దీంతో భారతదేశంలోని కోట్లాది గ్రామీణ కుటుంబాల భవిష్యత్తు ఏమిటనే దానిపై ప్రశ్నార్థక గుర్తును మిగిల్చింది అని రమేష్ అన్నారు. ఈ 'తాజా సంక్షోభం' ఒక భ్రాంతి కాదని, మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అణచివేయడానికి చేసిన పెద్ద ప్రయత్నానికి ప్రతిబింబమని ఆయన అన్నారు. గత పదకొండు సంవత్సరాలుగా ఈ పథకం దీర్ఘకాలికంగా నిధుల కొరత ఎదుర్కొంటోందన్నారు. అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పటికీ గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్ స్థిరంగా ఉందని, ఈ పథక డిమాండ్ ఆధారిత దృక్పథాన్ని అపహాస్యం చేస్తుందని మండిపడ్డారు. కోట్లాది మంది కార్మికులకు అవసరమైనప్పుడు పనిని పొందలేకపోతున్నారని రమేష్ అన్నారు. కార్మికులకు చెల్లింపుల్లో చట్టబద్ధమైన 15 రోజుల వ్యవధి ఎక్కువగా తరుచూ ఆలస్యమవుతున్నాయని, అయినా ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదన్నారు. ప్రతి సంతవ్సరం గత ఏడాది బకాయిలు చెల్లించేందుకే కేటాయించి మొత్తం బడ్జెటంలో 20–30 శాతం బడ్జెట్ వెళ్తుందన్నారు. గత పదకొండు సంవత్సరాలుగా ఉపాధిహామీ పథకం వేతనాలు చాలా తక్కువగా పెంచబడ్డాయి, ఫలితంగా ఆదాయం నిలిచిపోయే విస్తృత సంక్షోభం ఏర్పడిందని ఆయన అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం పేరుతో ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) యాప్, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్) వంటి మినహాయింపు సాంకేతికతను ప్రవేశపెట్టిందని, దీని వల్ల రెండు కోట్ల మందికి పైగా కార్మికులు పని, చెల్లింపునకు చట్టబద్ధమైన హక్కును పొందకుండా నిరోధించిన సంకేతాలు కనబడుతున్నాయని అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. బడ్జెట్‌ను గణనీయంగా పెంచాలని, సకాలంలో వేతనాల చెల్లింపుపై విధానాన్ని కఠినంగా అమలు చేయాలని పిలుపునిచ్చినట్లు రమేష్ చెప్పారు.

### ఆ వ్యాఖ్యలు

## తప్పుదారి పట్టించేలా ఉన్నాయ్

### ట్రంప్ సలహాదారుడు నవారోపై భారత్ ఫైర్

**న్యూఢిల్లీ :** ఇటీవల కాలంలో ఇండియాను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారుడు పీటర్ నవారో చేసిన వ్యాఖ్యలను భారత్ ఖండించింది. అవి సరైనవి కావని, తప్పుదారి పట్టించే వ్యాఖ్యలని మండిపడింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పీటర్ నవారో చేసిన తప్పుదారి పట్టించే ప్రకటనలను మేము చూశాం. వాటిని ఖండిస్తున్నాం. భారత్–యుఎస్ మధ్య సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. మేము ఇరుదేశాల సంబంధాలను ముందుకు తీసుకెళ్లాలనుకుంటున్నాం. ఇండియా అమెరికా సంబంధాలు చాలా ముఖ్యమైనవి. రెండు దేశాలు సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటాయి. ఇది వారి ఉమ్మడి ఆసక్తులు, ప్రజాస్వామ్య విలువలు, బలమైన సంబంధాలతో ముడిపడి ఉంది. ఈ భాగస్వామ్యం అనేక మార్పులు, సవాళ్లను తట్టుకుంది. భారత్, అమెరికా కట్టుబడి ఉన్న ముఖ్యమైన అజెండాపై మేం దృష్టి సారించాం. పరస్పర గౌరవం, ఉమ్మడి ఆసక్తుల ఆధారంగా ఈ సంబంధం ముందుకు సాగుతుందని భారత్ ఆశిస్తోంది' అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. క్వాడ సమ్మిట్, భారత్–యుఎస్ సంబంధాల గురించి కూడా రణధీర్ జైస్వాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య సమస్యలపై భారత్ అమెరికాతో చర్చలు జరుపుతోందన్నారు. క్వాడ్ ను సభ్య దేశాల అనేక ఉమ్మడి ప్రయోజనాలపై చర్చించడానికి విలువైన వేదికగా తాము భావిస్తున్నామని అన్నారు. క్వాడ సభ్య దేశాల మధ్య దౌత్యపరమైన సంప్రదింపుల ద్వారా ఆ శిఖరాగ్ర సమావేశం షెడ్యూల్ ఖరారు అవుతుందని వెల్లడించారు.



భారత్‌పై అక్కసు వెళ్లగక్కిన నవారో

ఇటీవల కాలంలో భారత్‌పై ట్రంప్ వాణిజ్య సలహాదారుడు నవారో అక్కసు వెళ్లగక్కారు. పలు మార్లు ఇండియాపై విమర్శలు గుప్పించారు. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలను సమర్థించారు. రష్యా నుంచి భారత్ చౌకగా ముడి చమురు కొనుగోలు చేస్తోందన్నారు. దానిని శుద్ధి చేసి అధిక ధరలకు విక్రయించి లాభపడుతోందని ఆరోపించారు. ముడి చమురును విక్రయించడం ద్వారా రష్యాకు భారత్ 'లాండ్రోమాట్' లాగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తద్వారా ఉక్రెయిన్ తో యుద్ధంలో రష్యా నిధులు సమకూర్చుకోవడానికి సహాయపడుతోందని పేర్కొన్నారు. అలాగే భారత్‌పై డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను సమర్థించే నేపథ్యంలోనే నవారో మాట జారారు. భారత్‌లో కులతత్వాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యానించారు. రష్యా నుంచి చౌకగా చమురును కొనడం వల్ల భారత ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నప్పటికీ, ఓవర్గీయులు మాత్రమే లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. భారత ప్రజల పేరుతో ఓ వర్గానికి లబ్ధిని చేకూరుస్తున్నారని, దీన్ని ఆపాల్సిన అవసరం ఉందని ఆరోపించారు. భారతీయ వస్తువులను అమెరికాకు దిగుమతి చేస్తారని, కానీ తమ వస్తువులను ఇండియా విక్రయించనివ్వరని అక్కసు వెళ్లగక్కారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్ పుతిన్, జిన్‌పింగ్‌తో ఎందుకు సన్నిహితంగా ఉంటుందో అర్థం కావట్లేదన్నారు.

# ఆలస్యంగానైనా మేల్కొన్న కేంద్రం

ఎట్టకేలకు సరుకులు, సేవల పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ – జిఎస్‌టి)లో జిఎస్‌టి కౌన్సిల్ కీలక మార్పులను తీసుకువచ్చింది. ఈ నెల 22వ తేదీ నుంచి అమలులోకి రానున్న కొత్త జిఎస్ టి–2.0లో స్లాబులను సున్నా శాతానికి, 5 శాతానికి, 18 శాతాలకు పరిమితం చేశారు. అనేక నిత్యావసరాల పన్నులను తగ్గించి, ఈ స్లాబులలో సర్దుబాటు చేశారు. గతంలో ఉన్న 0, 5, 12, 18, 28 శాత ం జిఎస్‌టి స్లాబులలో 12, 28 శాతాలు రద్దు కాబడ్డాయి.అదనంగా గతంలో మాదిరిగానే విలాస వస్తు, సేవలపై 40 శాతం సిన్ ట్యాక్స్‌ను కొనసాగిస్తున్నారు.

అమెరికా అసమంజస టారిఫ్ ఒత్తిళ్ళు, దేశీయ విని మయ మందగమనం, అడుగంటిన పొదుపు, పెరుగుతున్న కుటుంబ రుణభారం వంటి ప్రమాద ఘంటికలు మోగు తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అనివార్యంగా ఎన్మిమిదేళ్ళుగా జిఎస్‌టి పన్నులతో నడ్డివిరిగిన సామా న్యులకు ఉపశమనం కల్పించాల్సి వచ్చింది. అనేక చర్చోపచర్చలు, మేధోమథనాల ఫలితంగా 2017 జూలై 1 నుంచి జిఎస్‌టి అమలులోకి వచ్చింది. 'ఒకే దేశం– ఒకే పన్ను' నినాదంతో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా పార్లమెంటు ఉభయ సభలు సెంట్రల్ హాల్‌లో అర్ధరాత్రి సమావేశపరిచి మరీ, ప్రత్యేక గంటను కొట్టి కేంద్రీకృత జిఎస్‌టి పన్నులకు పచ్చ జెండా ఊపింది. ఈ కార్యక్రమాన్ని నాడు ప్రతిపక్షాలు బహిష్కరించాయి. నాటి నుంచి పన్నుల మోతతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు, జిఎస్‌టి ఫైలింగ్‌లో అపసవ్యాలతో చిన్న, మధ్య తరహా వ్యాపారులు సతమ తమవుతూనే ఉన్నారు. దీనికి తోడు పిడిగుపడినట్లుగా దాపురించిన మహమ్మారి కరోనా ప్రజల ఆర్థిక కష్టాలను అనేక రెట్లు పెంచింది. అనేక మంది చిరు, మధ్య తరహా వ్యాపారాలు మూతపడడమే కాకుండా, లక్షల మంది ఉద్యోగ, ఉపాధి కోల్పోయారు. ఇన్ని జరిగినా కేంద్రం లోని మోదీ ప్రభుత్వం కనికరం చూపలేదు. కళ్ళు మూసుకొని ప్రజల నుంచి ముక్కు పిండి మరీ జిఎస్‌టిని వసూలు చేసింది. ఏటేటా పన్ను వసూళ్ళలో నూతన రికార్డులను సృష్టిస్తూ, ప్రపంచంలోనే తృతీయ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని గొప్పలకు పోయింది.

చివరకు అమెరికా అధ్యక్షుడు తెంపరి ట్రంప్ భారత దేశంపై 25 శాతం టారిఫ్‌లను విధించడంతో పాటు, రష్యా చమురు కొనుగోలు చేస్తు న్నందుకు అదనంగా 25 శాతం అపరాధ టారిఫ్ విధింపుతో 50 శాతానికి పెరిగింది. ఇది టెక్స్‌టైల్స్, డైమండ్స్, మ్యానుఫాక్చరింగ్ రంగాలపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా, అనేక మంది ఇప్పటికే ఉద్యోగాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్నాయి. విపరీతంగా పెరిగిన అసమానతలతో కష్టాల కడలిలో సాగుతున్న దేశ ప్రజలపై తాజా పరిణామాలు శరాఘాతంగా పరిణమిస్తున్నాయి. అందుకే కుంభకర్ణ నిద్ర నుంచి మేల్కొన్న కేంద్ర సర్కార్ జిఎస్‌టి పన్నులను తగ్గించేందుకు పూనుకుంది. గత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ దీపావళి కానుకగా రెండవ తరం జిఎస్‌టి సంస్కరణ లను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. బుధవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృ త్వంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉండే జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశంలో పన్నుల మార్పులు చేర్పుల నిర్ణయం తీసుకున్నారు. ఆలస్యమైనప్పటికీ స్వాగతించా ల్సిన నిర్ణయమే. జిఎస్‌టి కౌన్సిల్‌లో కేంద్రం, రాష్ట్రాలు సమానమని, నిర్ణయాలు సమష్టిగా జరుగుతాయని చెప్పుకుంటున్నప్పటికీ కేంద్రమే నిర్ణయాలు తీసుకుంటు న్నట్లు ప్రధాని ఆగస్టు 15 ప్రకటన తెలియజేస్తున్నది.

ప్రజాపక్షం 06-09-2025, శనివారం

జిఎస్‌టి హేతుబద్ధీకరణ తరువాత జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై పన్నును 18 శాతం నుంచి సున్నాకు, అన్ని రకాల మందులు, ఔషధాలపై 12 శాతం, వైద్య పరికరాలపై 18 శాతం నుంచి 5 శాతానికి, పౌడర్, షాంపూ, టూత్ బ్రష్‌లు, హెయిర్ ఆయిల్‌లపై 18 శాతం నుంచి 5 శాతం, డైపర్లు, నాప్‌కిన్‌లు, దువ్వెనలపై 12 శాతం నుంచి 5 శాతం, రూ.7500 వరకు హోటల్ అద్దెపై 12 నుంచి 5 శాతం, కేకులు, బిస్కెట్‌లు, కార్న్ ఫ్లేక్స్, కాఫీ, ఐస్‌క్రీమ్‌లపై 18 నుంచి 5 శాతం, వెన్న, నెయ్యి, చీజ్, పాల పదార్థాలు, చేప నూనెలపై 12 నుంచి 5 శాతం, కార్లపై 28 నుంచి 18 శాతం, బైకులు, సైకి ళ్ళపై 12 నుంచి 5 శాతానికి తగ్గించారు.

తగ్గింపుతో పాటు కొన్నిటిపై పన్నులు పెంచారు. వాటిలో పాన్ మసాలా, క్యాసినో, రేస్ క్లబ్, ఖరీదైన మోటర్ సైకిళ్ళు, సిగరెట్లుపై జిఎస్‌టిని 28 నుంచి 40 శాతం పెంచడం మంచి పరిణామమే. కానీ, లేబర్ ఛార్జీ లపై జిఎస్‌టిని 12 నుంచి 18 శాతానికి పెంచడం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు ఇబ్బందికరం. అలాగే వస్త్రాలు, పాదరక్షల విలువ రూ.2,500 దాటితే జిఎస్‌టిని 5 శాతం నుంచి 18 శాతం పెంచడంపై బేస బబు. వీటిని తక్షణమే సవరించాల్సిన సంబంధిత పారి శ్రామికవర్గాలు కోరుతున్నాయి.

అన్నిటికి మించి, జిఎస్‌టి తగ్గింపుతో రాష్ట్ర ప్రభు త్వాలకు ఆందోళన మొదలైంది. ఆదాయం భారీగానే కోల్పోతామని, దాని ప్రభావం సంక్షేమ, అభివృద్ధి పథ కాలపై పడుతుందనే ఆందోళన రాష్ట్రాలకు, ముఖ్యంగా బిజెపియేతర పార్టీలు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలకు అధికంగా ఉంది. తెలంగాణకు రూ.7వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు పన్ను ఆదాయం తగ్గుతుందని ఉజ్జాయింపు లెక్క. పైగా రాష్ట్రాలకు మొండి చేయి చూపుతూ కేంద్ర ప్రభుత్వమొక్కటే సెస్సులు, డ్యూటీల పేరుతో వసూలవుతున్న లక్షల కోట్లు జుర్రుకుంటున్నది. ఇది రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం.

వెంటనే జిఎస్‌టి తగ్గింపు భారం రాష్ట్రాలపై పడ కుండా, గతంలో మాదిరిగా రాష్ట్రాలకు ఐదేళ్ల పాటు జిఎ స్‌టి పరిహారమివ్వడంతో పాటు, పదహారవ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రాలకు 50 శాతం ఇచ్చే విధంగా సిఫార్సు చేయాలి. అలాగే తగ్గిన జిఎస్‌టి ఫలితం వినియోగదారులకు చేరితేనే ఫలితం దక్కుతుంది. వ్యాపారులు ఇదే అదునుగా ధరలు పెంచితే ప్రయాస వృథా అవడం తథ్యం.

# అమెరికా ఆధిపత్యంపై ప్రతిఘటన వేదికగా ఎస్‌సిఒ

టి.ఎన్.అశోక్

2018 తర్వాత మొదటిసారిగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2025 ఆగస్టు మాసం చివర్లో చైనాలో అడుగుపెట్టారు. షాంఘై సహకార సంస్థ (ఎస్ సిఒ) వార్షిక సదస్సు కోసం వెళ్ళిన మోదీకి చైనా అధ్య క్షుడు షీ జిన్‌పింగ్ సాదరంగా స్వాగతం పలికారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా అక్కడే ఉన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా, అపారమైన ఇంధన వనరులు, సైనిక సామర్థ్యం గల ఈ ముగ్గురు నాయ కులు కలిసిన దృశ్యం అద్భుతమైన సంఘీభావాన్ని ప్రదర్శించింది.

ఈ ప్రతీకాత్మకత తప్పక చూడాల్సిందే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఆర్థిక జాతీయవాదాన్ని ఎంచు కుని, భారతీయ ఎగుమతులపై 50శాతం సుంకాలు విధించడం, రష్యాను పలు ఆంక్షల వలయంతో చుట్టే యడం వంటి నిర్ణయాలు తీసుకున్న సమయంలో, ఎస్ సిఒ కేవలం ఒక ప్రాంతీయ కూటమిగా కాకుండా ఒక భౌగోళిక రాజకీయ ప్రతిఘటన శక్తిగా మారి, ప్రపంచ క్రమాన్ని పునర్నిర్వచించే అవకాశం కనిపిస్తోంది.

అయితే, ఉద్భవిస్తున్న రష్యా–చైనా– భారత్ కూటమి ప్రపంచ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపబోతుంది? ఇది వాషింగ్టన్ స్వయంప్రతిపత్తి, ఐరోపా దుర్బల భద్రత, మధ్య ప్రాచ్యం సున్నిత స్థితి, దక్షిణ భూగోళం ఆర్థిక ఆకాంక్షలపై ఎలా ప్రభావం చూపుతుంది? అంతకు మించి అమెరికా ఒత్తిడిని తిరస్కరించడం ద్వారా భారతదేశం ఏమి సాధిస్తుంది? అమెరికా ఏమి కోల్పోవచ్చు?

2001లో ఏర్పడిన ఎస్‌సిఒ తొలినా ళ్ళలో మధ్య ఆసియాలో ఉగ్రవాదం, అతి వాదంపై పోరాడేందుకు ఉద్దేశించబడింది. కానీ రెండు దశాబ్దాలలో ఇది భారత్, పాకి స్తాన్‌లతో పాటు ఇరాన్ వంటి మధ్యప్రాచ్య దేశాలను కూడా కలుపుకుని విస్తరించింది. ప్రస్తుతం ఎస్‌సిఒ ప్రపంచ జనాభాలో దాదాపు 40 శాతం, ప్రపంచ జిడిపిలో పావు వంతుకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

ట్రంప్ విధించిన అధిక సుంకాలు అనుకోకుండా ఎస్‌సిఒకు కొత్త ప్రాముఖ్యతను కల్పించాయి. యూరే సియా సహకారం కోసం ఏర్పాటు చేసిన ఒక చర్చా వేది కగా కాకుండా, ఇది అమెరికా ఆధిపత్యానికి ఆర్థిక ప్రతి ఘటనను అందించే ఒక వేదికగా రూపాంతరం చెందింది. 2025 సదస్సులో బహుళధ్రువ ప్రపంచం, సార్వభౌమాధికారం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి వంటి ఉమ్మడి అంశాలపై మోదీ, షీ, పుతిన్ ఏకకంఠంతో మాట్లాడారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా పాశ్చాత్య దేశాల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా తన మనుగడ కోసం చైనా, భారత్‌పై అధికంగా ఆధారపడింది. భారత్‌కు చమురు ఎగుమతులు రికార్డు స్థాయికి పెరిగాయి. అదే సమయంలో రష్యాకు గ్యాస్, రక్షణ సహకారానికి ప్రధాన మార్కెట్‌గా చైనా ఉంది. ఇప్పుడు మాస్కో ఎస్‌సి ఒను కేవలం ఒక వేదికగా కాకుండా చట్టబద్ధతకు జీవన రేఖగా చూస్తోంది.

ట్రంప్ విధించిన అధిక సుంకాలు ఎగుమతుల ఆధా రిత చైనా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. అదే సమ యంలో వాషింగ్టన్ అధునాతన సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు 5 జి సాంకేతికతపై నియంత్రణను కఠినతరం చేసింది. రష్యా, భారత్‌లతో సంబంధాలను పెంపొందిం చుకోవడం ద్వారా షీ ప్రత్యామ్నాయ మార్కెట్లను, భద్రతా భాగస్వామ్యాలను, అమెరికా ఆర్థిక యుద్ధానికి వ్యతిరే కంగా తమ శక్తిని నిరూపించుకోవాలని చూస్తున్నారు.

ఇప్పుడు భారత్ ఆసక్తికరమైన ఆటగాడిగా ఉంది. సంప్రదాయంగా (సోవియెట్ యూనియన్ పతనం అనం తరం)వాషింగ్టన్, మాస్కో మధ్య సమతుల్యతను పాటి స్తున్న న్యూఢిల్లీ ఇప్పుడు దేశంలో అత్యధిక శ్రమశక్తి అవ సరమయ్యే వజ్రాలు, ఆభరణాలు, వస్త్ర ఎగుమతులపై అమెరికా విధించిన 50 శాతం సుంకాల సమస్యను ఎదు ర్కొంటోంది. ఈ పరిస్థితులకు లొంగిపోకుండా, మోదీ ఎస్‌సిఒ వేదికను భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిప త్తిని నిరూపించుకోవడానికి ఉపయోగించుకుంటు న్నారు. తమకు అవసరమైనప్పుడు రష్యా, చైనాలతో కలిసి ముందుకు సాగుతూనే, పాశ్చాత్య దేశాలకు ద్వారా లను తెరిచి ఉంచుతున్నారు.

ఈ అవసరాల కూటమి బయటి ఒత్తిడి వల్ల ఏర్ప డింది తప్ప సైద్ధాంతిక అనుబంధం వల్ల కాదు. అయితే, 21వ శతాబ్దపు భౌగోళిక రాజకీయాల గమనాన్ని నిర్ణ యించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

అమెరికన్ ఉద్యోగాలను రక్షించడం, ప్రత్యర్థులను దెబ్బతీయడమే ట్రంప్ సుంకాల వ్యూహం లక్ష్యం. కానీ ఆచరణలో ఇది అమెరికా ప్రపంచ ఆధిపత్యం విచ్ఛిన్నం వేగవంతం చేసేందుకు దారితీసే ప్రమాదం ఉంది. చైనా, భారత్, రష్యాలను మరింత దగ్గరగా చేర్చడం ద్వారా వాషింగ్టన్ అపారమైన ఇంధన వనరులు, తయారీ సామర్థ్యం, సైనిక పాటవం కలిగిన ఒక యూరేసియా కూటమి ఆవిర్భావం అనే పీడకలను ఎదుర్కోవచ్చు. ఎస్ సిఒ దేశాల మధ్య అంతర్గత వాణిజ్యం వృద్ధి చెందుతు న్నందున, అమెరికా ఎగుమతిదారులు మార్కెట్లను కోల్పో వచ్చు. భారత్, చైనా మధ్య ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అమె రికా ఆంక్షలను అధిగమించడానికి సరఫరా గొలుసులలో సహకరించుకోవచ్చు. రష్యా ఇప్పటికే రూబుల్ ఆధారిత చమురు లావాదేవీలను ప్రోత్సహిస్తుండగా, చైనా యువా న్‌ను ముందుకు తెస్తోంది. భారత్ రూపాయితో వాణిజ్య లావాదేవీలను ప్రయోగాత్మకం చేస్తోంది. కలిసికట్టుగా, ఈ దేశాలు డాలర్ వినియోగాన్ని తగ్గించి, అమెరికా ఆర్థిక ప్రభావాన్ని బలహీనపరచవచ్చు. చైనాకు వ్యతిరే కంగా ఒక సహజ మిత్రుడు అని భావించిన భారత్‌ను ఆర్థిక ప్రత్యర్థిగా చూడడం ద్వారా, ట్రంప్ రెండు దశా బ్దాల పాటు వాషింగ్టన్ తయారు చేసుకున్న భాగస్వా మిని దూరం చేసుకునే ప్రమాదం ఉంది.

**ఇంధన సంక్షోభాలు, వృద్ధి మంగమనంతో ఇబ్బందులు పడుతున్న ఐరోపా** ఈ కొత్త కూటమిని అసౌకర్యవంతంగా చూస్తుంది. మరింత బలమైన రష్యా– చైనా–భారత్ కూటమి తూర్పు ఐరోపాలో మాస్కోకు ధైర్యాన్ని ఇవ్వవచ్చు. ఇది ఇయును వాషింగ్టన్‌పై సైనికప రంగా ఆధారపడటాన్ని పెంచుకునేలా చేస్తుంది. చైనా, భారత్ వాణిజ్య ప్రవాహాలను మళ్లించడం ద్వారా ఆసియా మార్కెట్ల నుండి ఐరోపా బయటకు నెట్టబడే ప్రమాదం ఉంది. అనేక ఐరోపా దేశాలు భారత్‌ను ఒక స్వింగ్ పవర్(ఒక పక్షంవైపు మొగ్గని శక్తి)గా చూస్తూ, దానితో సంబంధాలు పెట్టుకోవడానికి ఇష్టపడతాయి. న్యూఢిల్లీ మరీ తూర్పు వైపు మొగ్గు చూపితే, బ్రస్సెల్స్ (ఇయు) తన అత్యంత ఆశాజనకమైన ఆసియా భాగస్వా మిని కోల్పోవచ్చు.

**మధ్య ప్రాచ్యానికి, ప్రత్యేకించి ఇరాన్‌కు** ఎస్‌సిఒ ఒక భౌగోళిక రాజకీయ వరంగా మారింది. ఇరాన్ 2023లో అధికారికంగా ఎస్‌సిఒలో చేరడం ద్వారా అమె రికా ఆంక్షలు ఉన్నప్పటికీ టెహ్రాన్‌కు కొత్త చట్టబద్ధత వచ్చింది. ఇరాన్ చమురు, చాబహార్ పోర్ట్ వినియోగం మీద ఆధారపడిన భారత్‌కు ఇప్పుడు వాషింగ్టన్ జోక్యం లేకుండా సంబంధాలను సమతుల్యం చేసుకునే అవ కాశం ఉంది. అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా కూడా ఎస్‌సిఒ చర్చలపై ఆసక్తి చూపింది. ఇది అమెరికా ప్రభావం తగ్గుతున్నందున జాగ్రత్త పడుతున్నట్లు తెలు స్తుంది. ఎస్‌సిఒలో లేదా దానికి సమీపంలో ఒక సమ న్వయ రష్యా–ఇరాన్–సౌదీ–చైనా కూటమి ప్రపంచ చమురు నిల్వలను సమర్థవంతంగా నియంత్రించి, అమె రికా ప్రభావాన్ని సవాలు చేయవచ్చు.

**ఎస్‌సిఒ సదస్సు ప్రభావం దక్షిణ ఆసియాపైనా ఉంది.** సభ్య దేశంగా ఉన్న పాకిస్తాన్ చైనా, రష్యాలకు మరింత దగ్గరవుతుంది. కానీ భారత్ నాయకత్వ పాత్ర ను పోషిస్తుండటం చూసి ఇబ్బంది పడుతుంది. సభ్య దేశం కానప్పటికీ, ఆఫ్ఘనిస్తాన్ సుస్థిరత ఎస్‌సిఒ ఎజెం డాలో ప్రధాన అంశం. అమెరికా ప్రభావం తగ్గుతున్నం దున భారత్, చైనా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నాయి. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాలు అమెరికా ఆర్థిక నిర్బంధాన్ని మధ్యస్థాయి దేశాలు ప్రతిఘటించగలవని భారత్ నిరూపించడాన్ని చూస్తు న్నాయి.

**ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియా** వ్యాప్తం గా భారత్ ధిక్కారం లోతుగా ప్రతిధ్వనిస్తుంది.. పెద్ద ఆర్థిక శక్తి దేశాల వాణిజ్య ఆంక్షలతో తరచుగా ఇబ్బం దులు పడే దేశాలకు, న్యూఢిల్లీ సుంకాల ప్రభావాలను భరిస్తూ తమ స్వయంప్రతిపత్తిని నిరూపించుకోవడం ఒక ఉదాహరణగా నిలిచింది. దక్షిణాఫ్రికా, నైజీరియా వంటి దేశాలు ప్రత్యామ్నాయ పెట్టుబడుల కోసం ఎస్‌సిఒ దేశా లతో సంబంధాలను పెంచుకోవచ్చు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా ఇప్పటికే బహుళధ్రువ ప్రపంచం కోసం పిలుపుని చ్చారు. ఎస్‌సిఒ ఆవిర్భావం దక్షిణ–దక్షిణ సహకారాన్ని వేగవంతం చేయవచ్చు. అమెరికా, చైనా మధ్య ఎంచుకో వడానికి వెనుకాడుతున్న ఆగ్నేయాసియా దేశాలు బహుళ ధృవ కూటమిలో భారత్‌ను ఒక తటస్థ భాగస్వామిగా చూడవచ్చు.

**ఇంధన భద్రత** విషయానికొస్తే, చౌకైన రష్యన్ చమురు, ఇరాన్ చమురు మార్గాలు, చైనా మౌలిక సదు పాయాల పెట్టుబడులు భారతదేశ వనరుల స్థావరాన్ని బలోపేతం చేస్తాయి. అమెరికా సుంకాలకు లొంగిపోవ డానికి నిరాకరించడం ద్వారా, వాషింగ్టన్ ఇండోపసిఫిక్ చదరంగంలో భారత్ ఒక పావు కాదని సంకేతాలు ఇస్తుంది. ఎస్‌సిఒలో భారత్ ఒక స్వింగ్ పవర్‌గా అవతరి స్తోంది. మోదీ ధిక్కార వైఖరిని భారతదేశం పెరుగుతున్న స్థాయికి నిదర్శనంగా చూపిస్తున్నారు. ఈ ఇతివృత్తం ఆయన జాతీయవాద మద్దతుదారులకు బాగా నచ్చు తుంది.

> ఉద్భవిస్తున్న రష్యా–చైనా–భారత్ కూటమి ప్రపంచ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపబోతుంది? ఇది వాషింగ్టన్ స్వయంప్రతిపత్తి, ఐరోపా దుర్బల భద్రత, మధ్య ప్రాచ్యం సున్నిత స్థితి, దక్షిణ భూగోళం ఆర్థిక ఆకాంక్షలపై ఎలా ప్రభావం చూపుతుంది? అంతకు మించి అమెరికా ఒత్తిడిని తిరస్కరించడం ద్వారా భారతదేశం ఏమి సాధిస్తుంది?

వాషింగ్టన్ చేసిన తప్పుడు అంచనా న్యూఢిల్లీని దాని ప్రత్యర్థులకు మరింత దగ్గరగా చేర్చి, దాని 'ఇండో–పసి ఫిక్ వ్యూహం'ను బలహీనపరుస్తుంది. బలవంత సుంకాలు బదులుగా భారతదేశ మార్కె ట్లను వైవిధ్యపరచి, అమెరికా వాణిజ్యంపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు. విచక్షణార హితంగా సుంకాలు, ఆంక్షలను ఆయు ధంగా ఉపయోగించడం ద్వారా, అమెరికా ఒక నాయకుడిగా కాకుండా ఒక బెదిరించే శక్తిగా కనిపించే ప్రమాదం ఉంది. ఎస్‌సిఒ దేశాలు సమర్థవంతంగా సమన్వయం చేసుకుంటే, మధ్య ఆసియా, దక్షిణ ఆసియా, మధ్య ప్రాచ్యంలో కూడా అమె రికా ప్రభావం తగ్గుతుంది.

అవకాశాలు ఉన్నప్పటికీ, ఈ త్రిపక్ష కూటమిలో సమస్యలు లేకపోలేదు. భార త్–చైనా సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతు న్నాయి. వివాదాస్పద హిమాలయ సరి హద్దు అస్థిరంగా ఉండడమే కాక విశ్వాసం చాలా తక్కువ. చైనాకు జూనియర్ భాగ స్వామిగా మారతానేమోనని రష్యా భయప డుతుంది. బీజింగ్ బెల్ట్ అండ్ రోడ్ ఆధిప త్యాన్ని భారత్ ఇష్టపడదు. చైనా జిడిపి భారత్, రష్యా దేశాల మొత్తం జిడిపి కన్నా ఎక్కువ. ఇది సమతుల్యతపై ప్రశ్నలను లేవనెత్తుతుంది. కాబట్టి, ట్రంప్ సుంకాలు వాటిని దగ్గర చేసినప్పటికీ, వాటి సహకారం కేవలం లావాదేవీల వరకు మాత్రమే ఉండవచ్చు, పెనుమార్పులు తీసుకురాకపోవచ్చు.

2025 ఎస్‌సిఒ సదస్సు కేవలం ఒక దౌత్య ఫోటో అవకాశం కన్నా ఎక్కువ. ఇది ప్రపంచం మారుతోందని, అమెరికా సుంకాలు, ఆంక్షలు వాషింగ్టన్ భయపడుతున్న బహుళధ్రువ ప్రపంచాన్ని వేగవంతం చేస్తున్నాయని తెలి యజేస్తుంది. మోదీ, షీ, పుతిన్‌లకు ప్రపంచ వాణిజ్యం, ఇంధనం, భద్రత నియమాలను తమ సొంత నిబంధన లపై తిరిగి రూపొందించడానికి ఇది ఒక అవకాశం. ట్రంప్‌కు ఇది అమెరికాను ఏకాకిగా చేసి దాని ప్రత్యర్థుల కు సాధికారతను కల్పించే ఒక ప్రమాదకరమైన జూదం.


అవసరాల కూటమి (ఆక్సిస్ ఆఫ్ నెసిసిటీ) ఒక చెద రని కూటమి కాకపోవచ్చు, కానీ ఇది ఒక హెచ్చరిక. తిరు గులేని అమెరికా స్వయంప్రతిపత్తి శకం ముసకబారు తోంది. .యూరేసియా ఒక భౌగోళిక రాజకీయ శక్తి కేంద్రంగా ఎదుగుతోంది.

ప్రపంచం దీనిని ఏకధృవ ఆధిపత్యం నుండి విము క్తిగా చూస్తుందా లేదా కొత్త పోటీల ఆరంభంగా చూస్తుందా అనేది వేచి చూడాల్సి ఉంది. కానీ ఒక నిజం మాత్రం స్పష్టం. వాషింగ్టన్ పట్టును సడలించడానికి ఉత్సాహంగా ఉన్న ప్రపంచానికి భారతదేశం తిరస్కార వైఖరి అందరూ ఒక వేదికపైకి వచ్చేందుకు అవకాశంగా మారింది.

(ఐపిఎ సర్వీస్)



# జ్ఞాన దేవాలయం పుస్తకం



పుస్తకం విజ్ఞాన భాండాగారం. పుస్తకం హస్తభూష నమే కాదు మస్తిష్క వికాస సాధనం. సరస్వతి కొలువైన దేవాలయం గ్రంథాలయమే. విజ్ఞాన సముపార్జనకు మూల సూత్రం పుస్తక పఠనం. జ్ఞాన వితరణ మాధ్యమం పుస్తకమే. పుస్తకాన్ని నమ్మిన వాడు మహా జ్ఞాని అవుతాడు. పుస్తకాన్ని వ్యతిరేకించిన వాడు నిక్కంగా అపర అజ్ఞాని అవుతాడు. ఒక పుస్తకం వేల మెదళ్లను వెలి గించే జ్ఞానదీపం. గ్రంథాలయంలో పుస్తక దర్శనంతో మనో విస్మృతి విస్తరిస్తుంది, ప్రపంచం కళ్ల ముందు కదలా డుతుంది. పుస్తక పఠన ప్రాధాన్యాన్ని గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 06 సెప్టెంబర్ రోజున ప్రపంచవ్యా ప్తంగా జాతీయ పుస్తక పఠన దినోత్సవం (నేషనల్ రీడ్ ఏ బుక్ డే)ను నిర్వహించుట ఆనవాయితీగా మారింది. పుస్త కాలు చదవడం ఓ నిత్య అభిరుచిగా మారాలి. మనం చదువుకున్న రోజుల్లో పాఠ్య పుస్త కాలు చదువుతాం, ఉద్యోగ ఉపా ధుల్లో మునిగినపుడు కూడా తీరిక సమయాల్లో పలు ఆసక్తికర పుస్త కాలను పఠించడం అల బడే అలవాటును కొన సాగించాలి. ఈ రోజున ప్రత్యేకంగా పిల్లలు లేదా సీనియర్ సిటిజన్స్ సమక్షంలో వారికి నచ్చిన కథలు లేదా ఆసక్తికర అంశాలకు సంబంధించిన పుస్తకాలను గట్టిగా చదివి వినిపించడం కూడా చేయవ చ్చు. దీనివల్ల మనకే కాకుండా విన్నవారికి కూడా జ్ఞానం కొంతవరకైనా అబ్బు తుంది. పుస్తకాలు వెలకట్టలేని వినోదాలు, విజ్ఞానాన్ని అందించే ఉపకరణాలు, కాలయంత్రాలు కూడా. కామిక్ పుస్తకాలు, ఈపుస్తకాలు, ఆడియో పుస్తకాలు కూడా నేటి డిజిటల్ ప్రపంచంలో అందుబాటులోకి రావడం శుభపరి ణామం. పిల్లలతో రోజు 10 నిమిషాలు కథల పుస్తకాలు చదవడంతో వారి లో ఆశావహ దృక్పథం క్రమంగా పెరు గుతుందని గమనిం చారు. డిజిటల్ అంత ర్జాల వలలో విశ్వమే కుగ్రామం అయ్యింది. చందమామ కథలు, బాలమిత్ర చతురతలు అంతరిం చాయి. బామ్మ ఒడికి దూరమై గూగులమ్మ పంచన చేరు తున్నారు యువత. పిల్లలతో పాటు పెద్దలు సహితం పుస్త కపఠనాన్ని త్యాగం చేసి చరవాణి/ల్యాప్‌టాప్/ట్యాబ్ లతో స్నేహం చేస్తున్న విచిత్ర ఏఐ యుగం నడుస్తున్నది. విశ్వ మానవాళిని పుస్చక పఠనం వైపు ఆకర్షించడానికి, గ్రంథాలయాల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టడానికి జాతీ య పుస్తక పఠన దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం సముచితంగా ఉన్నది. ఈ దినోత్సవంలో భాగంగా మన కు నచ్చిన ఒక కొత్త పుస్తకాన్ని చదవడం, పుస్తక పాఠక ప్రేమికులను సన్మానించుకోవడం, పుస్తక పఠన ప్రయోజ నాలు, రచయితలను గుర్తించడం, ఉన్నత స్థితులకు ఎది గిన మేధావులను సన్మానించుకోవడం, విద్యాలయాల్లో పోటీలను నిర్వహించ డం, పుస్తకాల విక్రయశాలల సంద ర్శన, పుస్తక ప్రదర్శనల నిర్వహణ, పుస్తకాలు కొని వ్యక్తి గత లైబ్రరీలను నెలకొల్ప డం, నీతి కథల పుస్తకాలను చదివించడం, పఠనాసక్తి కలిగిన యువతకు ప్రోత్సాహ కాలు ఇవ్వడం లాంటి పలు కార్యక్రమాలను ఈ దినోత్సవ వేదికగా నిర్వహించవచ్చు.

(నేడు జాతీయ పుస్తక పఠన దినోత్సవం)




# సిపిఐ రెండవ కాంగ్రెస్

## కలకత్తా, 1948

## పార్టీకి అపారమైన హాని జరిగిన కాలం

1947 డిసెంబర్‌లో జరిగిన సిపిఐ కేంద్ర కమిటీ సమావేశం, పి.సి.జోషీకి 'సంస్కరణ వాది' ముద్రవేసి ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించింది. అది పచ్చి అతివాదం పార్టీ నాయకత్వాన్ని ఆవహించిన కాలం. బి.టి.రణదివెను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. 'బి.టి.ఆర్ లైన్' పేరుతో ఆత్మహత్యాసదృశ దుస్సాహసిక పిడివాద పంథాను పార్టీ ఎంచుకుంది. 1948 ఫిబ్రవరి 28 నుంచి మార్చి 6 వరకు సిపిఐ రెండవ కాంగ్రెస్ (జాతీయ మహాసభ) కలకత్తాలో జరిగింది. 632 మంది ప్రతిని ధులు హాజరైనారు. బి.టి.రణదివె ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

**పొలిట్ బ్యూరో సభ్యులు :** భవాని సేన్, సోమనాధ్ లాహిరి, జి.అధి కారి, అజయ్ ఘోష్, ఎన్.కె.కృష్ణన్, సి.రాజేశ్వరరావు, ఎం.చంద్రశేఖర రావు, ఎస్.ఎస్.యూసుఫ్.

**31మంది సభ్యులతో కేంద్ర కమిటీ :**

1. బిటి రణదివె (జనరల్ సెక్రటరీ), 2. భవానీ సేన్, 3. సోమనాథ్ లాహిరి, 4. జి.అధికారి, 5. అజయ్ ఘోష్ 6. ఎన్.కె.కృష్ణన్, 7. చంద్ర రాజేశ్వరరావు, 8. మద్దుకూరి చంద్ర శేఖరరావు, 9. ఎస్ఎస్.యూసుఫ్, 10. రణేన్ సేన్, 11. ఎస్.ఎ.డాంగే, 12. ఎస్.వి.ఘాటె, 13. డి.ఎస్.వైద్య, 14. పుచ్చలపల్లి సుందరయ్య,15. ఇఎంఎస్ నంబూద్రిపాద్, 16. అరుణ్ బోస్, 17. ఎస్.జి.సర్దేశాయ్, 18. విశ్వనాథ్ ముఖర్జీ,19. పి.కృష్ణ పిళ్లై, 20. కె.సి.జార్జి, 21. మాకినేని బసవపున్నయ్య, 22. డి.వి.రావు, 23. ఎల్.కె.ఓక్ , 24. ఎస్.వి.పరులేకర్, 25. బీరేష్ మిశ్రా, 26. ఎం.కళ్యాణసుందరం, 27.బి.శ్రీనివాసరావు, 28. ముజఫర్ అహ్మద్, 29. మొహ్మద్ ఇస్మాయిల్ ,30. సునీల్ ముఖర్జీ, 31.రావి నారాయణరెడ్డి.

భారతదేశ స్వాతంత్ర్యం ''బూటకం'', నెహ్రూ ప్రభుత్వం 'సామ్రాజ్య వాదుల ఏజంటు' అని మహాసభ పేర్కొన్నది. నెహ్రూ ప్రభుత్వాన్ని 'సా యుధ తిరుగుబాటు' ద్వారా వెంటనే కూల్చివేయాలని, 'సోషలిజం' దిశగా ప్రయాణించాలని అది పిలుపు ఇచ్చింది. విప్లవం సంభవిస్తుందన్న ఆశాభావంతో 1948 మార్చి 9న రైల్వేల నిరవధిక సమ్మెకు ఇచ్చిన పిలుపు పూర్తిగా విఫలమమైంది. అది కార్యరూపం దాల్చలేదు.

రాచరిక హైదరాబాద్ నిజాం సంస్థానానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ నాయకత్వంలో 1947 సెప్టెంబర్‌లో ప్రారంభమైన రైతాంగ సాయుధ పోరాటం, 1948 సెప్టెంబర్ 13న భారత ప్రభుత్వ సైన్యాలు ప్రవేశించిన తదుపరి కూడా కొనసాగించిన తప్పు అప్పుడు జరి గింది. నిజాం లొంగిపోయి, హైదరాబాద్ సంస్థానం భారత యూనియ న్‌లో విలీనం అయిన తదుపరి కూడా సాయుధ పోరాటం కొనసాగిం చటం, నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు విస్తరించాలన్న పిడివాద నిర్ణయం వల్ల పార్టీ తెలంగాణాలోనే కాదు ఆంధ్ర ప్రాంతంలో కూడా తీవ్రంగా నష్టపోయింది. సిపిఐ, ప్రజాసంఘాలు ఒంటరి అయి గందరగో ళంలో పడ్డాయి. వేలసంఖ్యలో కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులు మిల టరీ తూటాలకు బలైంది, చిత్రహింసల పాలైందీ అప్పుడే. సాయుధ పోరాటం విరమించాలా, లేదా అన్న భిన్నాభిప్రాయం ఇక్కడ పార్టీలో తేల లేదు. అగ్రనాయకత్వం నుంచి అజయ్‌ఘోష్, డాంగే, రాజేశ్వరరావు, బసవ పున్నయ్య మాస్కో వెళ్లి, స్టాలిన్‌తో చర్చించాకగాని, విరమణ ప్రక టించలేదు. అజయ్‌ఘోష్, డాంగే పోరాట విరమణను అనుకూలించగా రాజేశ్వరరావు, బసవపున్నయ్య కొనసాగింపుకోసం వాదించారు. రాజ కీయ పంథాపై పార్టీ భేదాభిప్రాయాలు ఎంత లోతుగా, తీవ్రంగా ఉన్నా యో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. అప్పుడు సాయుధ పోరాటం విరమిం చటం తప్పు అని భావించేవారు పార్టీ చీలిక అనంతరం ఏర్పడిన ఇతర పార్టీలు, గ్రూపుల్లో ఇప్పటికీ ఉన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఫ్యూడలిజం వ్యతిరేక పోరాటాల్లో ఘనమైన పాత్ర వహించిన కమ్యూనిస్టుపార్టీ ఈ దుస్సాహసిక పంథాతో మళ్లీ నిషేధా నికి గురైంది. 1948 ఆరంభంలో 89వేలకుపైగా ఉన్న పార్టీ సభ్యత్వ 1950 చివరకు కేవలం 9 వేలకు పడిపోయింది. బిటిఆర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. 1950 మే నెలలో, కలకత్తాలో అజ్ఞాతంలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం రణదివెను సస్పెండ్ చేసింది. చంద్ర రాజేశ్వరరా వును (సిఆర్) ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

అయితే దురదృష్టం ఏమంటే, బిటిఆర్ 'రష్యా లైన్' స్థానంలో సిఆర్ 'చైనా లైన్' వచ్చింది. 'ఆంధ్రా లైన్'గా దానికి పేరు. 'సాయుధ తిరుగు బాటు' బదులు 'సాయుధ గెరిల్లా పోరాటం' లైన్ వచ్చింది. పార్టీ ఏకాకి అయిన పరిస్థితుల్లో సాయుధ పోరాటం కొనసాగింది. ఈ పంథా తప్పు అని డాంగే, ఘాటే, అజయ్ ఘోష్ ఆంధ్రా లైన్‌ను తీవ్రంగా వ్యతిరేకిం చారు. 1950 సెప్టెంబర్‌లో విడుదలైన ప్రసిద్ధ '3 పి లెటర్' అదే. పార్టీలో అంతర్గత పోరాటం తీవ్రతరమైంది. పార్టీ ప్రతిష్టంభనలో పడింది. సోవి యట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ సహాయం కోరాలని పార్టీ నిర్ణయిం చింది. పైన ప్రస్తావించిన నలుగురు కామ్రేడ్స్ మాస్కో వెళ్లారు. ఎలా వెళ్లారో ఇప్పటికీ వెల్లడి కాలేదు.


### 1951లో స్పెషల్ కాన్ఫరెన్స్

1951 అక్టోబర్ 9 నుంచి 15 వరకు కలకత్తాలో అజ్ఞాతంలో పార్టీ ప్రత్యేక మహాసభ జరిగింది. కొత్త, రెగ్యులర్, పార్టీ ప్రోగ్రాం ఆమోదించబ డింది. అజయ్ ఘోష్, డాంగే, ఘాటేల '3–పి'ల లేఖ ప్రాతిపదికగా అది నూతన పరిస్థితికి అనుగుణంగా అభివృద్ధి చేయబడింది. పార్టీ సాయుధ పోరాటం విరమించింది. 1952 సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనాలని నిర్ణయించింది.

పార్టీ కార్యక్రమం ''మిలియన్లమంది శ్రమజీవులకు – కార్మికులు, కర్షకులు, శ్రమచేసే మేధావులు, మధ్యతరగతులకు, అలాగే దేశ స్వాతం త్ర్యంలో దాని అభివృద్ధిలో ఆసక్తి కలిగిన బూర్జువా వర్గానికి – ఏకైక డెమొ క్రటిక్ ఫ్రంట్‌లో ఐక్యం కావలసిందిగా'' పిలుపు ఇచ్చింది. **భారతదేశ విప్లవదశ సోషలిస్టుకాదు, ప్రజాతంత్ర విప్లవం** అని చెప్పింది.

అది ఒక విధాన ప్రకటన కూడా ఆమోదించింది. ప్రధాన కార్యద ర్శిగా కామ్రేడ్ అజయ్ కుమార్ ఘోష్‌ను ఎన్నుకుంది.

### ప్రధాన కార్యదర్శి బి.టి. రణదివె



బాలచంద్ర త్రియంబక్ రణదివె(బి టిఆర్) 1905 డిసెంబర్ 19న దాదర్, బొంబాయిలో జన్మించారు. చాలా తెలి వైన విద్యార్థి. 1928లో బొంబాయి విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ. అర్థశా స్త్రంలో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైనారు. తన పెద్ద తల్లి కుమారుడైన డాక్టర్ జి.అధి కారి ద్వారా మార్క్సిజం వైపు ఆకర్షితు లైనారు. సిద్ధాంత అధ్యయనానికి, కార్మిక సంఘాల నిర్మాణానికీ కృషి చేశారు. 1928లో సిపిఐ సభ్యత్వం స్వీకరించారు. ఎఐటియుసి, గిర్నీ కాంగార్ యూనియన్‌లలో పనిచేశారు. 1939లో జిఐపి రైల్వేమెన్స్ యూనియన్ కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం (బొంబా యి)లో చాలాకాలం పనిచేశారు. 1940– 42లో దియోలీ డిటెన్షన్ శిబి రంలో నిర్బంధంలో ఉన్నారు. 1943లో సిపిఐ మొదటి కాంగ్రెస్‌లో పొలి ట్‌బ్యూరోకు ఎన్నుకోబడ్డారు. 1948లో కలకత్తాలో రెండవ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. దుస్సాహసిక 'సాయుధ తిరుగుబాటు' పిడివాద పంథాకు కర్త అయినారు. పార్టీ తీవ్రంగా నష్టపోయింది. పార్టీ 1950లో ఆయన్ను నాయకత్వ బాధ్యతలనుంచి తొలగించింది. చంద్ర రాజేశ్వరరావును తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. 1964లో పార్టీలో చీలికతో రణదివె చీలిక గ్రూపుతో బయటకు వెళ్లారు. అనంతరం అది సిపిఐ(ఎం)గా ఏర్పడింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఉంటూ 1970 మే నెలలో సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షునిగా బాధ్యతలు చేబ ట్టారు. పార్టీ పత్రికలకు సంపాదకునిగా పనిచేశారు. ఆర్థిక అంశాలపై వందలకొద్ది వ్యాసాలు రచించారు. 1990 ఏప్రిల్ 6న మరణించారు.

## నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం/యాచారం : ప్రశాంతమైన వాతావరణంలో పండుగలను జరుపు కోవాలని ఇబ్రహింపట్నం ఎసిపి కెపివి రాజు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాల్ ఇందిరమ్మ కాలనిలో భగత్ సింగ్ యూత్ అసోషియేషన్ అధ్వర్యంలో వినాయకుడి వద్ద ఎర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని అయన ప్రారంభించారు. ఈసంధర్బంగా ఎసిపి మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనం సంధర్బంగా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బట్టు శ్రీనివాస్, భగత్‌సింగ్ యువజన సంఘం సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## రూ.40వేలు పలికిన ప్రెస్‌క్లబ్ గణేష్ లడ్డు



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గణేశ్ నిమజ్జనం కావడంతో లడ్డూ వేలం పాట జరిగింది. లడ్డును కైవసం చేసుకోవడానికి పోటీ పడటంతో వేలంపాట హోరాహోరీగా సాగింది. చివరికి ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు వర్దెల్లి బాపూరావు రూ.40 వేలకు లడ్డూను సొంతం చేసుకొన్నాడు. ఈ సందర్భంగా ఆయనను ప్రెస్‌క్లబ్ కోశాధికారి రాజేశ్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌లు శాలువాతో సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉద్యోగులు, సిబ్బంది, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## నాణ్యతగా అభివృద్ధి పనులు

### గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం అధికారులతో కలసి గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధార్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నానక్‌రామ్ గూడలో చేపడుతున్న సిసి రోడ్డు పనులను నాణ్యత విషయంలో రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని, అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాలలో అబివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో శివసింగ్, హనుమంత్‌నాయక్, బబ్లూసింగ్, గోపాల్ పాల్గొన్నారు.

## జిఎస్‌టి తగ్గింపుతో ఎంతో మేలు



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీఎస్టీ తగ్గించి పేద ప్రజలకు ఎంతో మేలు చేశారని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నర్సింహగుప్త అన్నారు. శుక్రవారం చైతన్యపురి డివిజన్ బిజేపి అధ్యక్షులు నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుతో డివిజన్‌లోని బిజేపి నేతలతో కలిసి సంబురాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ చిత్ర పటానికి పాలాభిషేక చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.వినోద్‌యాదవ్, వెంకన్న, నరేందర్‌రెడ్డి, కుల్దీఫ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ పాలసీలపై జిఎస్‌టి తొలగించడం హర్షణీయం



ప్రజాపక్షం/సరూర్‌నగర్ : హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌లపై జీఎస్‌టి తొలగింపు హర్షణీయమని,జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఇంటిగ్రేటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు సుధాకర్ అన్నారు. దిల్‌షుఖ్‌నగర్‌లో శుక్రవారం ఎల్‌ఐసి కెరీర్ ఏజెంట్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్‌టి తొలగింపు నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 2017 సంవత్సరం నుంచి జీఎస్‌టి తొలగింపు కోసం పలు సార్లు కేంద్రమంత్రులను కలిసి చేసిన విన్నపాలు ఫలించాయన్నారు. జీఎస్‌టి తొలగించడంతో పాలసీదారులు లాభ పడటంతో పాటుగా ఎక్కువ మంది పాలసీలు తీసుకుంటారని, ఇది సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

## సాగర్ కాంప్లెక్స్ సమస్యలు పరిష్కారం చేయాలని ఎంపికి వినతి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని సాగర్ కాంప్లెక్స్, చైతన్య నగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని మాల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను శుక్రవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కొన్ని కాలనీలకు వీధిలైట్లు, విద్యుత్ స్తాంబాలు, అంతర్గత రోడ్ల నిర్మాణం, కాలనీలకు సీసీ కెమెరాలు ఎంపి నిధుల నుంచి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి, భూపాల్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశ్వర్, రాజేందర్‌రెడ్డి, అంజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలు



ప్రజాపక్షం/కొత్తూరు: ముస్లింలు నిజమైన స్పూర్తితో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాల ను నిర్వహించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం కొత్తూరు మండలం జెపి దర్గాలో ముస్లింలు మిలాద్ ఉన్ నబీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాబాకు ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఉత్సవాలను షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రషీద్, మిట్టునాయక్, అజయ్‌నాయక్, యాదగిరి, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, సోమ్లానాయక్, మాధవి గోపాల్ గౌడ్, మాదారం నరసింహ గౌడ్ అనిత, శ్రీనివాస్ గౌడ్, నేతలు శివాచారి, ఇంద్రసేనారెడ్డి, దినేష్‌సాగర్, రవికుమార్ పాల్గొన్నారు.

### సొంత వ్యాపారంతోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యం

సొంత వ్యాపారం ఏర్పాటు చేసుకుంటేనే ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీనారాయణ స్వామి టీటైం, ఎస్ఎస్ గ్రాండ్ భావర్చి ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎంపిపి మధుసూదన్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపార రంగంలో యువత రాణించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, దినేష్‌సాగర్, దర్శన్, రవి యాదవ్, యాజమానులు సంతోష్‌నాయక్, భూపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# రంగంలోకి మహిళా అశ్వీక దళం

### పోలీసు కమిషనర్ సివి ఆనంద్




ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ పోలీసు శాఖలో మహిళా అశ్వీక దళం ఆవిర్భవించింది. ఈ మేరకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ గోషామహల్‌లోని అశ్వీక దళంను సందర్శించారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు అశ్వీక దళం విన్యాసాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగర పోలీసులు ఈరోజు ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పదిమంది సాయుధ రిజర్వ్ (ఎఆర్) మహిళా కానిస్టేబుళ్లు రెండు నెలల పాటు గోషామహల్ మౌంటెడ్ యూనిట్‌లో శిక్షణ పొంది, ఇప్పుడు గుర్రపు పోలీసు దళంలో భాగమయ్యారు. దేశంలోనే ఇదొక కీలకమైన నిర్ణయం అని కమిషనర్ తెలిపారు. ఈ మహిళా కానిస్టేబుళ్లను బందోబస్తు, విఐపిల భద్రత, పెట్రోలింగ్ వంటి విధులకు వినియోగించనున్నారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుకు రావాలన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, మహిళా మౌంటెడ్ పోలీసులు గస్తీలో మొదటిసారిగా పాల్గొనబోతున్నారని సివి ఆనంద్ పేర్కొన్నారు.

### విస్తరించనున్న డాగ్ స్క్వాడ్..

హైదరాబాద్ నగర పోలీసులు తమ డాగ్ స్క్వాడ్‌ను కూడా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 34 శునకాలతో అధిక పనిభారం ఉన్నందున, ఆ సంఖ్యను 54కు పెంచాలని నిర్ణయించుకున్నారు. అదనపు శునకాలను ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐఐటిఎ)లో విస్తృత శిక్షణ పొందిన తర్వాత బృందంలో చేర్చుకుంటాము. బాంబులు, మాదక ద్రవ్యాలు, మరియు నేరస్తుల గుర్తింపు వంటి వాటిలో వీటిని వినియోగిస్తామని సివి ఆనంద్ తెలిపారు. శునకాల నాణ్యతను మెరుగుపరచడానికి ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా ఉన్న డాగ్ బ్రీడర్ల నుండి నాణ్యమైన శునకాలను ఎంపిక చేస్తోంది. మొదటి దశలో 12 శునకాలను సేకరించారు, భవిష్యత్తులో మరికొన్నిటిని తీసుకుంటాము అని తెలిపారు. కార్యక్రమంలో సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి, సౌత్ వెస్ట్ జోన్ డిసిపి జి.చంద్ర మోహన్, సైబర్‌క్రైమ్ డిసిపి ధార కవిత, సిఎస్‌డబ్ల్యూ డిసిపి పి.గిరిరాజు పాల్గొన్నారు.

## వరద బాధితులకు కేంద్రం నిధులివ్వాలి



### ‘ఆప్’ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎలాంటి వివక్ష చూపకుండా వరద ప్రభావిత రాష్ట్రాలకు వెంటనే నిధులిచ్చి, ఆదుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. తాలిబాన్ పాలిత అఫ్ఘనిస్థాన్‌కు సాయం చేస్తున్న కేంద్రప్రభుత్వం, వరదలతో తీవ్రంగా నష్టపోయిన తెలంగాణ, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంలో విఫలమవడం దురదృష్టకరమన్నారు. శుక్రవారం హైదరాబాద్ లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వరద ప్రభావిత రాష్ట్రాల ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సంబంధిత గోడపత్రికను పార్టీ రాష్ట్ర నేతలు బుర్ర రాముగౌడ్, జిల్లోజు హేమ, జావీద్ షరీఫ్, దర్శనం రమేశ్, రాకేశ్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల కారణంగా లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయి, ఇళ్లు దెబ్బతిన్నాయని, ప్రజలు జీవనోపాధి కోల్పోయారని తెలిపారు. వరద బాధితుల సహాయార్థం ఆప్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విరాళాలు సేకరణ చేపట్టామని తెలిపారు. సమావేశంలో పలువురు ఆప్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ‘స్థానికం’లో వైశ్యుల వాటాకు 9న దీక్ష

### కాచం సత్యనారాయణ గుప్త

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేస్తూ ఈ నెల 9న ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ‘సాధన దీక్ష’ను చేపట్టనున్నట్టు వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త తెలిపారు. రాజకీయ పార్టీలకతీతంగా జరిగే ఈ సాధన దీక్షకు వైశ్య సోదరులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సాధన దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను వైశ్య వికాస వేదిక ప్రతినిధులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాచం మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం వైశ్యులకు రాజకీయ వాటా తేల్చాల్సిందేనని డిమాండ్ చేశారు. పేద వైశ్యుల సంక్షేమం, అభివృద్ధి కోసం వైశ్య వికాస వేదిక నిర్విరామంగా కృషిచేస్తున్నదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక కోశాధికారి కండె రాం నరేశ్, ట్రస్టు సభ్యులు కొత్త రవి, కొత్తూరు వీరేందర్, విద్యావంతుల వేదిక సభ్యులు బుద్ధ ప్రవీణ్, రాజు గుప్త, మనోహర్, గజవాడ సత్యనారాయణ, మురళి, వేణు పాల్గొన్నారు.



## ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సావాలు



ప్రజాపక్షం/ సరూర్‌నగర్ : ఆర్‌కెపురం డివిజన్ వాసవీ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాగణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన పూజా కార్యక్రమానికి టిఎన్‌జిఓస్ ఉపాధ్యక్షులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగస్తుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిలుక నరసింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో వాసవీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గౌరీశెట్టి చంద్రశేఖర్‌గుప్త, ప్రధాన కార్యదర్శి అంజయ్య, అష్టలక్ష్మీ దేవాలయ అక్షయ ట్రస్ట్ కార్యధర్శి మాడ్యం సుధాకర్‌గుప్త, మాజీ ఛైర్మన్ దామోదర్‌గుప్తా, చిలుక ఉపేందర్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, గురువులను గౌరవించినప్పుడే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురు పూజోత్సవాన్ని పురస్కరించుకొని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించడంతోపాటు మెమోంటోలను అందజేశారు. విద్య నేర్పించిన గురువుల అశీస్సులు తీసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని, గురువులను పూజించినప్పుడే ఆ శిష్యుడు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని, సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 200 మంది ఉపాధ్యాయులను, రిటైర్డ్‌మెంట్ పొందిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ కరుణాకర్, జగదీశ్వర్ గుప్తా, శేఖర్, రామారావు, సాయిరెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మణ్‌కుమార్, బస్వం, పురుషోత్తం రెడ్డి, సురేష్‌రెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్ ఉన్నారు.

## ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకట్‌రాంరెడ్డి



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పి.వెంకట్‌రెడ్డిని ఎన్నుకున్నారు. శుక్రవారం ప్రొఫెసర్ కోదండరామ్ అదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడి గా ఫరూఖ్‌నగర్ మండల మాజీ జడ్పిటిసి పి.వెంకట్‌రాంరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎంతో శ్రమించారని, వారి శ్రేయస్సు కోసం తాను నిరంతరం కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ఆర్ల యాదయ్య యాదవ్, సిద్ధం విఠలయ్య, ఆవ శివకుమార్ పాల్గొన్నారు.

## రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాల్సిందే

### సంస్థాన్ నారాయణపురం భూనిర్వాసితుల డిమాండ్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సంస్థాన్ నారాయణపురం మండలం మీదుగా వెళ్తున్న రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్కింగ్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రూపొందించారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రీజినల్ రింగురోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేశారు. హయత్ నగర్‌లోని లెక్చరర్ కాలనీలో శుక్రవారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సమావేశమయ్యారు. అ సందర్భంగా భూనిర్వాసితుడు, నారాయణపురం మండల పరిషత్ మాజీ వైస్ ప్రెసిడెంట్ నడికుడి అంజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం రీజనల్ రింగ్ రోడ్డుకు భూసేకరణ చేయడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా భూసేకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి 40కిలోమీటర్ల దూరంలో రీజనల్ రింగ్ రోడ్డు మార్గం ఉంటుందని చెప్పి, 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాల మీదుగా రోడ్డుకు మార్కింగ్ చేయడం సరికాదన్నారు. చౌటుప్పల్ మున్సిపాటీ పరిధిలోని ఉన్న కంపెనీల భూములను కాపాడడానికి చిన్న, సన్నకారు రైతుల జీవితాలను బలిపీఠమెక్కిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల్లో నిబంధనలకు విరుద్ధంగా ట్రిపుల్‌ఆర్ ప్రతిపాదించారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా మార్కింగ్ చేసి భూములు గుంజుకుంటామంటే సహించేది లేదని, ప్రాణాలు పోయినా భూములు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ట్రిపుల్‌ఆర్ భూసేకరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడా బాబుల భూములను రక్షిస్తూ.. పేదల భూములలో రోడ్లు వేస్తున్నారని ఆగ్రహం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతిపాదిత రీజనల్ రింగ్ రోడ్డు మార్గాన్ని మార్చాలని డిమాండ్ చేశారు.

## వంద ఎకరాలు ఉన్నోళ్లకు ప్రభుత్వ భూమితో ఏం పని?

### మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్



ప్రజాపక్షం/షాద్‌నగర్: వంద ఎకరాలు భూమి ఉన్నోళ్లకు ప్రభుత్వ భూమితో ఏం పని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్ ప్రశ్నించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మేము ప్రశ్నిస్తే మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు ఎందుకు బాధ వేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. వంద ఎకరాల భూమి ఉన్న మీకు ప్రభుత్వ భూమితో ఎం పనో చెప్పాలని పేర్కొన్నారు. మీ తండ్రికి వంత ఎకరాల భూమి ఉంటే భూ సంస్కరణల చట్టం ఏమైందో చెప్పాలని, పటేల్ పట్వారిగా పని చేసినోళ్లకు తెలియదా అని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను ప్రశ్నించారు. మీ ఆస్తులకు సంబంధించిన విషయాలపై ఏనాడు మేము అడుగలేదని, సిబిఐ, ఏసిబి విచారణలు మీరే కోరుతున్నారని వివరించారు. భూ సంస్కరణల చట్టం ప్రకారం వంద ఎకరాలు ఉంటే పేదలకు ఎందుకు పంచలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పెద్ద కుమారుడు, చిన్న కుమారుల వ్యాపారం గురించి వివరించడం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు సవాళ్లు విసరడం విచిత్రంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పెట్టిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆస్తులు, వారి కుమారుల ఆస్తుల గురించి ఎక్కడ ప్రస్తావించలేదని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఈప్రాంత ప్రజలు చేసుకున్న అదృష్టం అని భావిస్తున్నట్లు తెలిపారు. మీ ఆస్తులు, మా అస్తుల గురించి ఎక్కడైనా విచారణ చేసేందుకు, చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. సమావేశంలో గిరిజన రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, బస్వం, చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, క్యాసెట్ శ్రీను పాల్గొన్నారు.

## ప్రొ.కోదండరామ్ జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/యాచారం : తెలంగాణ రాష్ట్ర ఉద్యమనాయకులు ప్రొఫెసర్ కోదండరామ్‌కు మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన పలువురు అయన ఇంటికి వెళ్ళి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అశాజ్యోతి, ప్రజల మనిషి, ప్రజల గొంతుక కోదండరామ్ సార్ అయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ధార సత్యం, రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి సామ నిరంజన్, దూస రమేష్, చిట్టి మల్లేష్, కడారి సోమయ్య. నీలం రాములు పాల్గొన్నారు.



## 5 వేల మందికి అన్నప్రసాదం



ప్రజాపక్షం/చర్లపల్లిః గణేష్ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుషాయిగూడ పారిశ్రామిక వేత్త ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వితరణ చేశారు. అన్నదాత ప్రముఖ పారిశ్రామి క వేత్త బొందాడ రాఘవేంద్ర రావు ప్రత్యేక పూజలు నిర్వహించి 5 వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాకుమాను కిషోర్, వెంకటరామ్, కింగ్స్ బాబు, రాజు, మధు,హైటెక్ బాబు, కెడిఎస్ నరేందర్, మూర్తి, సుధాకర్, శివప్రసాద్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ డంపింగ్ : పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/బొంరాస్‌పేట్ :కొడంగల్ నియోజకవర్గంలోని బొంరాస్‌పేట్ మండల పరిధిలోని ముద్దాయి పేట్ జాన్కంపల్లి మార్గంలోని ఇటుక బట్టి, కోళ్లఫారం ముందు మార్గమధ్యంలో అక్రమంగా ఇసుక డంపింగ్ చేశారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రజలు తెలుపుతున్నారు. ఈ అక్రమ ఇసుక డంపింగ్‌పైన ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి టియుడబ్ల్యుజె కృషి

### అధ్యక్షుడు జి. బాల్‌రాజ్

ప్రజాపక్షం/ ఘట్‌కేసర్ : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఎల్లప్పుడు పోరాటం చేస్తుందని టియుడబ్ల్యుజె మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు జి.బాల్ రాజ్, ప్రధాన కార్యదర్శి జి. వెంకట్ రెడ్డిలు అన్నారు. ఘట్‌కేసర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన టియుడబ్ల్యుజె సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యులు 16 మంది పూర్తి చేసిన సభ్యత్వ నమోదు ఫారంలను స్వీకరించారు. యూనియన్‌లో సభ్యత్వ నమోదు చేసుకున్న సభ్యులకు ఐడి కార్డు, జిల్లా డైరీ, భావ స్వేచ్ఛ మాసపత్రిక అందజేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డు, అవకాశం ఉన్న చోట్ల డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి కోరనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి వేముల గోవింద్ రాజ్,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కె.నర్సింహ్మా,మాజీ అధ్యక్షులు ఎల్ భూపాల్, మాజీ ప్రధాన కార్యదర్శి కె రమేష్, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాస్, కోశాధికారి ఎల్.రాజు, సంయుక్త కార్యదర్శి ఎస్ నర్సింగ్ రావు, మాజీ సలహాదారు కె.యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రెస్‌క్లబ్ సభ్యుల ఆర్థిక సహాయం అందజేత

ప్రెస్ క్లబ్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న దాసరి లక్ష్మి భర్త వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద కుటుంబానికి అండగా మేమున్నామంటూ ముందుకువచ్చి అంత్యక్రియల నిమిత్తం ప్రెస్‌క్లబ్ సభ్యుల ద్వారా 15వేలు టియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షుడు జి.బాల్ రాజ్, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా లక్ష్మి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి వేముల గోవింద్ రాజ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కె. నర్సింహ్మా, మాజీ అధ్యక్షులు ఎల్ భూపాల్, మాజీ ప్రధాన కార్యదర్శి కె. రమేష్, ఉపాధ్యక్షులు ఎన్ శ్రీనివాస్, కోశాధికారి ఎల్ రాజు, సంయుక్త కార్యదర్శి ఎస్ నర్సింగ్ రావు, మాజీ సలహాదారు కె.యాదగిరి పాల్గొన్నారు.



## ఘనంగా రాఘవరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/చర్లపల్లిః కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు బొజ్జ రాఘవరెడ్డి 68వ జన్మదిన వేడుకలు శుక్రవారం కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో అభిమానులు, నాయకుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బొజ్జ రాఘవరెడ్డి, మాజీ కార్పొరేటర్ పావనీ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంజరి ప్రవీణ్, బేతాల బాల్‌రాజ్, పెంటయ్యగౌడ్, పత్తి కుమార్, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనోత్సవంలో తీన్మార్ మల్లన్న



ప్రజాపక్షం/చర్లపల్లిః చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ భజన మందిర్ 79వ గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని నిమజ్జన కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న విచ్చేసి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను కమిటీ సభ్యులు పనగట్ల చక్రపాణిగౌడ్, పాండాల శివకుమార్‌గౌడ్‌లు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## లడ్డు దక్కించుకోవడం ఎంతో తృప్తినిచ్చింది

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : సుభాష్ చంద్రబోస్ యూత్ ఆధ్వర్యంలో నెలకొన్న గణనాథుని ప్రవిత్రమైన లడ్డును పోచారం చెరుకు దశరథ గౌడ్ కుటుంబం 1 లక్ష 85వేల రూపాయలతో సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా చెరుకు దశరథ గౌడ్ మాట్లాడుతూ పోచారంలో సుభాష్ చంద్రబోస్ యూత్ నెలకొన్న గణనాథుని లడ్డును సొంతం చేసుకోవడంతో ఆరోగ్యం సంతోషంతోపాటు గణనాథుని ఆశీస్సులు ఎంతో తృప్తినిచ్చాయని దశరథ గౌడ్ తెలిపారు. యూత్ సభ్యులు బద్రి గౌడ్, యాదిరెడ్డి, సాముల కొండల్ రెడ్డి, సందీప్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మహానేత ఎమ్మెల్యే బిఎంఆర్

ప్రజాపక్షం/తాండూరుః రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మహానేత ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్ రెడ్డి అని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాలాల మండల పరిది గోవిందరావ్ పేట్ గ్రామంలో నూతన విధ్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను అందించి ప్రారంభించారు. తాండూరులో విధ్యుత్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఎంఎల్‌ఎ మనోహర్ రెడ్డి రూ.30లక్షల నిధులతో విధ్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేయించడం జరిగిందన్నారు.



రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కొత్త విధ్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారని అన్నారు. దీంతో గ్రామంలో విధ్యుత్ సమస్య తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల సీనియర్ నాయకులు రాజేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, జిల్లా కోఆప్షన్ మెంబర్ అక్బర్‌బాబ, ఎఎంసి డైరక్టర్‌లు శ్రీనివాస్, మెగులప్ప, హన్మంతు మహిపాల్, మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం కోసం యోగాను అలవరచుకోవాలి

### ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజి-గిరి:మానసికోల్లాసం, ఏకాగ్రత, ప్రశాంతతతో పాటు ఆరోగ్యం కోసం యోగాను ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంటలోని అలంకృత రిసార్ట్‌లో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా బోధి స్కూల్ ఆఫ్ యోగా జాతీయ స్థాయి అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ యోగా భారతదేశ ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయంలో ఒక భాగమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ యోగా ప్రాధాన్యతను ప్రపంచానికి చాటారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు, ఉద్యోగుల నుండి అన్ని రంగాల్లో ఉన్న వారందరూ ఇటీవలి కాలంగా యోగాను ఆచరిస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తం గా విదేశీయులు సైతం యోగాను ప్రాముఖ్యతనిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేసారు. అవార్డులు పొందిన వారందరూ మరింత విస్తృతంగా అన్ని ప్రాంతాలకు యోగాను విస్తరింప చేసేందుకు తమవంతుగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు,మధ్యప్రదేశ్, మహారాష్ట్రతదితర ప్రాంతాలకు చెందిన 200 మంది యోగా ప్రతిభావంతులకు ఆయన అవార్డులను అందచేసారు. మిస్ ఇండియా రష్మిక, ఆధ్యాత్మిక వేత్త గౌరీలౌక్యం, సత్యవాణి, బోధి యోగా స్కూల్ ఆఫ్ ఫౌండర్ అశోక్, సలహాదారు ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ప్రజాపక్షం / కొడంగల్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడంగల్ నియోజకవర్గంలో ప్రభుత్వ బడులలో విద్యార్థులకు విద్యబోధనలు చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనం గా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాధికారి రాంరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు మాట్లాడుతు ఒక విద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే గురువు పాత్ర చాలా ముఖ్యమైనది అన్నారు. మొదటగా తల్లీదండ్రులు గురువులుగా ఉంటే తరువాత ఉపాధ్యాయులదే అంటు వాఖ్యానించారు. ఆనాటి కాలంలో గురువుల పాత్ర ఏ విధంగా ఏ ఉండేది ప్రస్తుత కాలంలో గురువుల పాత్ర ఏ విధంగా ఉందో క్లుప్తంగా వివరించారు. ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ బడులే ముద్దుగా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వర అని ఆనాటి మహాకవులు చెప్పడం జరిగిందన్నారు. మనకు మంచి జరిగే ఏ విషయాన్ని చెప్పిన వారు గురువులే అంటు గురువు స్థానం పై వివరించారు. కార్యక్రమానికి ముందుగా లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ దసప్ప యాదవ్, సెక్రటరి వడ్డే భీమరాజు సమక్షంలో డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలామాలలు వేసి జ్యోతిప్రజ్వాళన చేశారు. అనంతరం నియోజకవర్గంలోని దాదాపు 8 మంది ఉపాధ్యాయులకు శాలువాలు పూలమాలలతో సత్కరించి మొమెటోలను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ శివకుమార్‌పటేల్, శ్రీనివాస్‌గౌడ్, న్యాయ వాది రాములు, శ్రీశైలం, కానుకుర్తి రమేష్‌లతో పాటు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు

### మాజీ సర్పంచ్ చాపల లక్ష్మయ్య





ప్రజాపక్షం/పరిగి : పేద ప్రజల సంక్షేమ సంక్షేమమే ధ్యేయంగా రాష్ట ప్రభుత్వం పని చేస్తుందని ,అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని రాకొండ మాజీ సర్పంచు చాపల లక్ష్మయ్య అన్నారు. రాకొండ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గులు వేసి పోసింఢ్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ ఇళ్లు కేటాయించడం జరుగుతుందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్న సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్ , ఇందిరమ్మ గ్రామ కమిటీ అద్యక్షులు వెంటయ్య, చాపల శ్రీనివాస్ , కొత్త చంద్రయ్య బండి వెంకటయ్య, ఖాజమియ్య, రాములు , రామచంద్రయ్య, లక్ష్మయ్య, నవీన్, గ్రామస్తులు పాల్గోన్నారు.

## గణపతి మంటపాలను సందర్శించి, పూజలు నిర్వహించిన పిఎసి చైర్మన్

ప్రజాపక్షం/కూకట్‌పల్లిః శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు గణపతి మండపాలను శ్రుకవారం పిఏసి చైర్మన్ అరికెపూడి గాంధీ సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్, తులసి నగర్ ఫేస్1, ఫేస్2, ఆల్విన్ కాలనీ నల్లపోచమ్మ దేవాలయం, కాకతీయ నగర్, వెంకటపాపయ్య నగర్, ఆల్విన్‌కాలనీ ఫేస్2, చంద్ర మ్మ కాలనీ, మరెమ్మ నగర్, మహాత్మాగాంధీ నగర్, జన్మభూమి కాలనీ, సుభాష్ చంద్ర బోస్ కాలనీ, ఇంద్రహిల్స్, ఆశానగర్, తులసివనం, విజయనగర్ కాలనీలలోని మంటపాలను అరికెపూడి గాంధీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ వినాయక చవితి వేడుకలను అందరూ సంతోషంగా జరుపుకుని, నిమజ్జనం వేళ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణపతి నిమజ్జనం వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భావితరాలు దృష్టిలో పెట్టుకుని మట్టి వినాయక విగ్రహాలను పూజించాలన్నారు.

## 'స్పిరిట్' మూవీ రైతును ప్రోత్సహించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/కూకట్‌పల్లిః సరికొత్త కథతో తెరకెక్కిన సినిమా స్పిరిట్ హర్రర్ జోనర్‌లో మంచి కథాంశంతో ఉన్న సినిమా అని, ఒక సాధారణ రైతు మహిళ ధైర్యం చేసి తను చిన్ననాటి కలని నెరవేర్చుకుంటూ తన జీవనాధారమైన పశువుల్ని, పొలాన్ని కూడా అమ్మి ఈ సినిమా తీసిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్పిరిట్ మూవీ పోస్టర్‌ని ఆయన లాంచ్ చేశారు. ఈ సందర్భంగా రైతు నర్సమ్మ వెంకటేశ్వర్లని అభినందించారు. అనంతరం ప్రొడ్యూసర్ రైతు నర్సమ్మ మాట్లాడుతూ స్పిరిట్ సినిమా సెన్సార్ కూడా పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉందన్నారు. సెప్టెంబర్ 26న లేదా అక్టోబర్ 3న ఈ సినిమా విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

# ఐసిడిఎస్ నిర్వీర్యానికి ప్రభుత్వాల యత్నం

### కడ కార్యాలయం ముందు అంగన్‌వాడీల ధర్నా



ప్రజాపక్షం/కొడంగల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు ఫ్రీ ప్రైమరి విద్యా పేరుతో ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తోందని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ టీచర్‌లు, హెల్పర్స్‌లతో కలిసి సీఐటీయు ఆధ్వర్యంలో కొడంగల్ కడ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఐసీడీఎస్ భాధ్యత వహించేదన్నారు. కాని ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జాతీయ విద్యా విధానం ఎన్‌ఈపిలోకి మార్చడం జరిగిందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్స్, కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చలు జరపకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఫ్రీ ప్రైమరి విద్యను ప్రభుత్వ పాఠశాలలో కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యాబోధన భాధ్యతలను అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌లకు అప్పగించాలని కోరారు. 50 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందించే విషయంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక మన్ననలు పొందిన ఐసీడీఎస్ కు సంబందం లేని బిఎల్‌ఓ పనులను రద్దు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలంటు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు సుకన్య, అరుణ, జీవనజ్యోతి, నర్సింగమ్మ, పద్మ, చంద్రకళ, యాదమ్మ, విజయలక్ష్మి లతో పాటు ఆయా మండలాల టీచర్‌లు, హెల్పర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన మాజీ కార్పొరేటర్



ప్రజాపక్షం/బోడుప్పల్ : ఉపాధ్యాయుల దినోత్సవం పునస్కరించుకుని పీర్జాదిగుడా మున్సిపల్ కార్పోరేషన్ మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలువేసి ప్రైమరీ, హైస్కూల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు పూలబొకే అందించి శాలువాతో సన్మానించి ఉపాధ్యాయుల పట్ల తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని కొనియాడారు. అనంతరం పాఠశాలలోని విద్యా వాలంటరిలకు కార్పొరేటర్ సాలరీలను ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్ సమక్షంలో అందించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, ప్రైమరీస్కూల్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, 25వ డివిజన్ నాయకులు రవీందర్ రెడ్డి, విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## స్పీకర్ ప్రసాద్ కుమార్ సిఎంఆర్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/వికారాబాద్ రూరల్ :వికారాబాద్ మండలంలోని లబ్దిదారులకు మంజురైన 16లళ్యాణలక్ష్మి , షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. అనంతరం వికారాబాద్ మండలానికి సంబంధించిన 40సిఎంఆర్ చెక్కలను, మున్సిపల్‌కి సంబంధించిన 38సిఎంఆర్ చెక్కలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీఅధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్

ప్రజాపక్షం/దుండిగల్‌ః బి.కె.ఆర్ ఫౌండేషన్ ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చే కార్యక్రమాలు చేపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి అన్నారు. శుక్రవారం గండి మైసమ్మలోని డబుల్ బెడ్ రూమ్ వద్ద బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు.ప్రజలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టామని ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని డాక్టర్ల పర్యవేక్షణలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ప్రతి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో అధికంగా పేద ప్రజలు ఉండే ప్రాంతాలలో ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య క్యాంపు నిర్వహిస్తానని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తన బికే ఆర్ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ TBసి అధ్యక్షులు ఏ.కుమార్ యాదవ్, మున్సిపల్ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ అక్బర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఆర్ సాదు యాదవ్, 129 డివిజన్ నాయకులు శ్రీశైలం యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మౌనిష్ యాదవ్, దుండిగల్ మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.మహేందర్ రెడ్డి, మహిళలు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

ప్రజాపక్షం/మర్పల్లి : వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని గుండ్లమర్పల్లి గ్రామానికి చెందిన నరసంహులు గౌడ్ మరణించడంతో కుటుంబానికి ఎస్‌కెఆర్ ట్రస్ట్‌ద్వారా మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి రూ.5000/– అత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## బండ్లగూడలో గణపతి లడ్డు రూ.లక్షకు వేలం వేలం

ప్రజాపక్షం/దమ్మాయిగూడఃదమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు బండ్లగూడ లో రుద్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. బండ్లగూడకు చెందిన పల్లె బాలనర్సింహగౌడ్ లక్ష ఒక వెయ్యి రూపాలకు వేలం పాటలో దక్కించుకున్నారు.గణపతి దీవెనలు అందరికి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొత్త సురేఖభాస్కర్ గౌడ్, నాను నాయక్, రాజు ముదిరాజ్, బాల్ రెడ్డి, పాండు గౌడ్, మల్లారెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



**దమ్మాయిగూడలో కాణిపాకం వినాయకుడు**

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులోని సాయిరత్న ఎన్‌క్లేవ్ లో ఏర్పాటు చేసిన కాణిపాకం వరసిద్ధి వినాయకుని మండపం అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ వినాయకుడిని శిల్పి కె రాంప్రసాద్ అద్భుత సృష్టితో తీర్చిదిద్దారు.కార్యక్రమంలో విగ్రహ దాత ఆర్ మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

## భర్తను బండరాయితో కొట్టి చంపిన భార్య



ప్రజాపక్షం/కోట్‌పల్లి : వికారాబాద్ నియోజకరవ్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని రాంపుర్ గ్రామనికి చెందిన బసనోళ్ల రామచంద్రయ్య తండ్రి బసయ్య (44 సంవత్సరాలు), వృత్తి గ్రామపంచాయతీ వర్కర్, 18సంవత్సరల క్రితం పెళ్లి అయింది. ఇద్దరు అమ్మాయిలు. భార్యభర్తల మధ్య గొడవపడి వేరే ఊరికి వెళ్దాం అని తరుచూ గొడవపెట్టుకుంటూ ఉండేది. రామచంద్రయ్య వేరే ఉరే వెళ్లి బతకడానికి ఒప్పుకోక పోవడటంతో తన భర్తను అడ్డు తొలిగించుకొని ఎక్కడికైనా వెళ్లి బతకాలని 4/09/2025 అర్ధరాత్రి భర్త ఇంటి ముందు వాకిట్లో పడుకొని వుండగా తలమీద రాయితో కొట్టి చంపిందని తెలిపారు. బసనోళ్ల అంజయ్య తండ్రి బసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ధారూర్ సిఐ రఘురాములు, ఎస్ఐ శైలజ తెలిపారు.

# క్రీడ

## రూ.400 కోట్ల ఆదాయంపై కన్ను

### టీమిండియా జెర్సీ స్పాన్సర్‌షిప్ ధర పెంపు!




భారత జట్టుకు కొత్త జెర్సీ స్పాన్సర్ వేటను ప్రారంభమైంది. ఆశావహుల నుంచి దరఖాస్తులు అహ్వానించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి జెర్సీ స్పాన్సర్‌షిప్ ధరల్లో మార్పులు చేసింది. ఆన్‌లైన్ గేమింగ్, గ్యాంబ్లింగ్ నియంత్రణ చట్టం కారణంగా డ్రీమ్ 11తో ఒప్పందం రద్దు చేసుకున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు బిసిసిఐ వర్గాలు తెలిపాయి. ద్వైపాక్షిక సిరీస్‌లకు.. వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలకు విడిగా ధరను నిర్ణయించింది. మొత్తంగా వచ్చే మూడేళ్లలో రూ.400 కోట్లకు పైగా ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో బిసిసిఐ ఉందని సమాచారం. ప్రస్తుతం భారత జట్టు జెర్సీ స్పాన్సర్‌షిప్ ధరలు.. ద్వైపాక్షిక సిరీస్‌లో రూ.3.17 కోట్లు, ప్రపంచ కప్ వంటి మ్యాచ్‌లకు రూ.1.12 కోట్లుగా ఉన్నాయి. అయితే.. డ్రీమ్ 11తో ఒప్పందం అనూహ్యంగా రద్దు చేసుకోవాల్సి రావడంతో బిసిసిఐ ధరల్లో మార్పులు చేసింది. ఇకపై నుంచి రెండు దేశాల టోర్నీలో జెర్సీ స్పాన్సర్‌షిప్ ధర రూ.3.5 కోట్లు, పలు దేశాలు పోటీపడే వరల్డ్ కప్ వంటి టోర్నీలకు రూ.1.5 కోట్లు చెల్లించాలనే నిబంధన పెట్టింది. ఉన్నట్టుండి జెర్సీ స్పాన్సర్‌షిప్ ధరల పెంపు నిర్ణయానికి కారణాలు ఉన్నాయి.

**ధరలో వ్యత్యాసం అందుకే**

ద్వైపాక్షిక సిరీస్‌లు అనుకోండి.. స్పాన్సర్ పేరు జెర్సీ ముందు భాగంలో ఉంటుంది. ఆ సిరీస్ ఆసాంతం పలు మార్లు స్పాన్సర్ కంపనీ పేరు కనపిస్తుంది. అదే వరల్డ్ కప్ వంటి టోర్నీల్లో స్పాన్సర్ పేరు జెర్సీ చేతుల మీద మాత్రమే ఉంటుంది. దాంతో, పేరు స్పష్టంగా.. తరచుగా కనిపించే అవకాశాలు తక్కువ. కాబట్టి.. ధరలను నిర్ణయించే ముందు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.

వచ్చే మూడేళ్లలో భారత జట్టు మూడు ఫార్మాట్లలో కలిపి 130 మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో టీ20 వరల్డ్ కప్, వన్డే వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలు ఉన్నాయి. సో.. ఈ కాలంలో కొత్త స్పాన్సర్ ద్వారా రూ.400 కోట్ల ఆదాయం బిసిసిఐ ఖజానాకు చేరనుంది. టీమిండియా జెర్సీ స్పాన్సర్ కోసం సెప్టెంబర్ 16 లోపు బిడ్డింగ్‌లు వేయాలని ప్రకటన విడుదల చేసిన విషయ తెలిసిందే.

## ఏడో వరల్డ్ కప్‌పై గురి..!



### 'ఆల్‌రౌండర్ల'తో ఆస్ట్రేలియా రె'ఢీ'

ఐసిసి టోర్నీల్లో తిరుగులేని ఆస్ట్రేలియా మరోసారి వన్డే వరల్డ్ కప్ లక్ష్యంగా సిద్ధమవుతోంది. ఇప్పటికే ఏడుసార్లు విజేతగా నిలిచిన ఆసీస్ పటిష్టమైన స్క్వాడ్‌తో భారత్‌కు వస్తోంది. అలీసా హేలీ కెప్టెన్‌గా శుక్రవారం సెలెక్టర్లు పదిహేను మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఎప్పటిలానే ఇప్పుడు కూడా మ్యాచ్ విన్నర్లు అయిన ఆల్‌రౌండర్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గాయం నుంచి కోలుకున్న లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ సోఫీ మొలినెక్స్, డార్సీ బ్రౌన్, జార్జియా వరేహామ్‌లను వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. 'వరల్డ్ కప్ స్క్వాడ్ ఎంపికలో మేము అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్నాం. భారత్, శ్రీలంకలో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలుసు. అందుకే.. సోఫీ మొలినెక్స్‌కు స్క్వాడ్‌లో చోటిచ్చాం. గాయం నుంచి కోలుకుంటున్న ఆమె వరల్డ్ కప్ వరకూ ఫిట్‌నెస్ సాధిస్తుందనే నమ్మకం మాకుంది అని ఆస్ట్రేలియా జాతీయ సెలెక్టర్ షాన్ ఫ్లెగ్లర్ వెల్లడించాడు. ప్రపంచ కప్‌లో అధిపత్యం చెలాయించే ఆసీస్ ఈసారి కూడా మెగా టోర్నీకి పక్కా ప్లాన్‌తో వస్తోంది. టాపార్డర్‌లో దంచికొట్టేందుకు అలీసా హేలీ, డార్సీ బ్రౌన్, ఫొబె లిచ్‌ఫీల్డ్ ఉన్నారు. తహ్లియా మెక్‌గ్రాత్, జార్జియా వరేహం, ఎలీసా పెర్రీ, అషే గార్డ్‌నర్ ఆల్‌రౌండర్లుగా ఇరగదీయడం ఖాయం. మేఘన్ షట్, సథర్‌లాండ్ జార్జియా వొల్‌తో కూడిన పేస్ దళం కూడా పటిష్టంగానే ఉంది.

**ఆస్ట్రేలియా స్క్వాడ్ :** అలీసా హేలీ(కెప్టెన్), తహ్లియా మెక్‌గ్రాత్(వైస్ కెప్టెన్), డార్సీ బ్రౌన్, అషే గార్డ్‌నర్, కిమ్ గార్త్, గ్రేస్ హ్యారిస్, అలనా కింగ్, ఫొబె లిచ్‌ఫీల్డ్ సోఫీ మొలినెక్స్, బెత్ మూనీ, ఎలీసా పెర్రీ, మేగన్ షట్, అనాబెల్ సథర్‌లాండ్ జార్జియా వొల్, జార్జియా వరేహమ్.

## దుబాయ్ చేరుకున్న టీమిండియా తొలి బృందం

ఆసియా కప్ కోసం భారత బృందం దుబాయ్ చేరుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పేసర్ హార్దిక్ పాండ్యా, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌లు గురువారం ఉదయం ముంబై విమానాశ్రయం నుంచి దుబాయ్‌కి బయలుదేరారు. షెడ్యూల్ ప్రకారం 4వ తేదీ సాయంత్రం వరకూ స్క్వాడ్‌లోని క్రికెటర్లు దుబాయ్‌లో సమావేశం కావాల్సి ఉంది. కానీ.. ఇప్పటికైతే కోచ్, కెప్టెన్, పాండ్యా మాత్రమే వెళ్లారు. అనారోగ్యం నుంచి కోలుకుని.. ఫిట్‌నెస్ పరీక్ష ఎదుర్కొంటున్న వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేరుగా బెంగళూరు నుంచే దుబాయ్ వెళ్లనున్నాడు. దులీప్ ట్రోఫీలో ఆడుతున్న పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలు, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా శుక్రవారంలోపు స్క్వాడ్‌తో కలుస్తారు. కోచింగ్ సిబ్బంది కూడా ఈరోజుకల్లా ఎడారి దేశం చేరుకోనున్నారు. స్క్వాడ్‌లోని అందరూ కలిశాక.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్లనుంది టీమిండియా బృందం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ షురూ కానుంది. ఇప్పటివరకూ ఎనిమిది సార్లు (ఏడు సార్లు వన్డే ఫార్మాట్‌లో, ఒకసారి టీ20 ఫార్మాట్‌లో) ఆసియా ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా తొమ్మిదో ట్రోఫీపై గురి పెట్టింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా బృందం సెప్టెంబర్ 4న దుబాయ్‌కు చేరుకోనుంది. తొలి పోరులో భాగంగా ఆతిథ్య యూఏఈతో తలపడనుంది. అనంతరం సెప్టెంబర్ 14న పాకిస్థాన్ జట్టును, సెప్టెంబర్ 19న పసికూన ఒమన్ టీమ్‌ను టీమిండియా ఢీకొట్టనుంది.


**ఆసియా కప్ స్క్వాడ్ :** సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.



# సైన్స్

## ఫోకస్

### తగ్గుతున్న భూభ్రమణ వేగం!




భూమిపై ఒక పూర్తి రోజు దాదాపు 86,400 సెకన్లు లేదా 24 గంటలు. కానీ శాస్త్రవేత్తల ప్రకారం, ఈ వేసవిలో గ్రహం వేగంగా తిరుగుతోంది, దీని వలన సమన్వయ సార్వత్రిక సమయం (యుటిసి) నుండి ఒక సెకను తగ్గించే ఆలోచన వచ్చింది. ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీస్, యుఎస్ నావల్ అబ్జర్వేటరీ జులై 10న, ఇప్పటివరకు సంవత్సరంలో అతి తక్కువ రోజుగా ప్రకటించాయి. ఆ రోజున 24 గంటల కంటే 1.36 మిల్లీసెకన్లు తక్కువ నమోదైంది. ప్రపంచంలోని అధికారిక సమయపాలనదారులు ఈ వేగం ఇలాగే కొనసాగితే అపూర్వమైన చర్య తీసుకోవలసి ఉంటుందిదని, ప్రపంచ సమయం నుండి ఒక పూర్తి సెకనును తీసివేయాల్సి వస్తుందని అంటున్నారు.

## అనంత విశ్వంలో అంతుచిక్కని రహస్యాలు




తన లోతుల్ని కనుక్కోమంటూ అనాదిగా మనిషికి సవాళ్లు విసురుతున్న అనంత విశ్వం ఎన్నో రహస్యాలను తనలో ఇముడ్చుకుంది. ఒక సిద్ధాంతం ఖరారయ్యేలోగా, వేల ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిత్యం జరుగుతున్న విస్తారమైన పరిశోధనలు విజయాలు సాధిస్తున్నప్పటికీ, విశ్వం యొక్క విశాలమైన విస్తీర్ణం మానవాళి ఇంకా పరిష్కరంకాని, అంతుచిక్కని రహస్యాలతో నిండి ఉంది. భూమిని ఆలంబనంగా చేసుకొని, విశ్వం యొక్క నిజమైన పరిధిని అర్థం చేసుకోవడం కష్టం. అయినప్పటికీ, శాస్త్రవేత్తలు అంతరిక్షంలోని వింతలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తునే ఉన్నారు. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతునే ఉంది. కాగా, ఇటీవల కాలంలో శాస్త్రవేత్తలు అంతరిక్షంలో కనుగొన్న విషయాల్లో అంగారక గ్రహం ఒకప్పుడు ఆవసయోగ్యంగా ఉండేదని, ఆ తర్వాత దాని పరిస్థితులు మారాయన్నది ప్రధానమైనది. హార్వర్డ్‌లోని పాలియోమాగ్నెటిక్స్ ల్యాబ్ పరిశోధకులు జరిపిన అధ్యయనంలో , జీవానికి మద్దతు ఇచ్చే అంగారకుడి అయస్కాంత క్షేత్రం గతంలో అనుకున్నదాని కంటే చాలా ఎక్కువ కాలం ఉండి ఉండవచ్చని తేలింది. అంగారక గ్రహం ఇప్పుడు చల్లగా, బంజరుగా, రాతితో నిండి ఉన్నప్పటికీ, అయస్కాంత క్షేత్రం 3.9 బిలియన్ సంవత్సరాల క్రితం వరకు ఉండి ఉండవచ్చని ఆధారాలు సూచిస్తున్నాయి. మునుపటి అంచనాలు 4.1 బిలియన్ సంవత్సరాలతో పోలిస్తే ఎర్ర గ్రహం జీవానికి అనుకూలమైన వాతావరణం క్రమంగా మెరుగుపడుతున్నది. అయితే, ఎప్పటికి అది ఆవాసయోగ్యమవుతుందనేది సమాధానం లేని ప్రశ్న.

## అగ్నిపర్వతాల విస్ఫోటనాలను చెట్లు గుర్తిస్తాయి!

ఇది నిజం.

అగ్ని పర్వతాలు విస్ఫోటనం చెందే ముందు, భూమి పొరల్లో పలుచని తరంగాలు మెల్లగా కదులుతూ ఉంటాయి. ఈ కదలికలను చెట్లు ముందుగానే గుర్తిస్తాయి. శాస్త్రవేత్తలు ఇటీవల ఈ అంశాన్ని గుర్తించారు. వారి నివేదికలను అనుసరించి, ఒక అగ్నిపర్వతం పేలడానికి ముందు, భూమి పొరల్లో జరిగే మార్పులను చెట్లు గురిస్తాయి. అంతేకాదు, వాటి ప్రతిస్పందనను అంతరిక్షం నుంచే చూడగలిగేలా ఒక ప్రత్యేక నమూనాను కూడా సృష్టిస్తాయి. అంటే, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు చోటు చేసుకోకముందే, ప్రకృతి హెచ్చరిక జారీ చేస్తుంది. కానీ, ఆ హెచ్చరికలను వినడానికి, అర్థం చేసుకోడానికి మనుషులు చేసే ప్రయత్నాలు చాలా తక్కువ. కేవలం యంత్రాలు మాత్రమే ప్రకృతి ప్రమాదాలను గుర్తిస్తాయని మనం నమ్మినా, ఈ ఆవిష్కరణ జీవజాతులే భూమి రీతులను ఎప్పటి నుంచో అర్థం చేసుకుంటూ వస్తున్నాయని నిరూపిస్తున్నది. మొక్కల ప్రతి ఆకు, వేరులు, కొమ్మలు మనకంటే ప్రాచీనమైన జ్ఞానాన్ని మోసుకెళ్తున్నాయన్నది మరోసారి రుజువైంది. వాటి స్పందనల్లో భూమితో ఉన్న గాఢమైన అనుభూతి, మమేకమయ్యే విధానం దాగి ఉంటాయి. మనం ప్రకృతి సంకేతాలను అర్థం చేసుకోవడం మొదలుపెడితే, ఒక విస్మరిస్తున్న సత్యం మళ్లీ మనకు అర్థమవుతుంది. ప్రకృతి విలయాలపై హెచ్చరికలు గుర్తించే విధానం తెలుస్తుంది. మనుషులు మాత్రమేకాదు.. చెట్లు కూడా భూమిలో ఒక భాగమేనని ఎంత తొందరగా నమ్మితే అంత మంచిది.



## డార్క్ ఎనర్జీ బలహీనం..

విశ్వంలో దాదాపు 70 శాతం డార్క్ ఎనర్జీ ఆక్రమించి ఉంది. కానీ కొన్ని ఇటీవలి నివేదికలు అది కాలక్రమేణా బలహీనపడుతోందని సూచిస్తున్నాయి. 900 కంటే ఎక్కువ మంది పరిశోధకులతో కూడిన అంతర్జాతీయ బృందం 15 మిలియన్ గెలాక్సీలు, క్వాసార్ల నుండి మూడు సంవత్సరాల డేటాను విశ్లేషించిన తర్వాత తమ పరిశోధనలను సమర్పించింది. పరిశోధనలు చీకటి శక్తి ఒక 'విశ్వ స్థిరాంకం' అని చూపించాయి. కానీ, అది కాలక్రమేణా ఊహించని విధంగా మారుతోందని పేర్కొంటున్నాయి. విశ్వం ప్రారంభంలో చీకటి శక్తి చాలా బలంగా ఉందని డేటా చూపించింది. అయితే, అది కాలక్రమేణా బలహీనపడిందని ఈ పరిశోధనలు ఒక కొత్త సిద్ధాంతాన్ని తెరపైకి తీసుకొచ్చాయి. దీనిపై మరింత విస్తృతమైన పరిశోధనలు జరగాల్సి ఉంది.



# పాఠ్యాంశంగా తెలంగాణ సాయుధ పోరాటం

### సిపిఐ జాతీయ నేత చాడా వెంకటరెడ్డి డిమాండ్

### ఈనెల 11 నుండి 17 వరకు తెలంగాణ రైతు సాయుధ పోరాట వారోత్సవాలు






**ప్రజాపక్షం/కోరుట్ల :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని సిపిఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 77వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుండి 17 వరకు ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభాకర్ భవన్‌లో సిపిఐ జగిత్యాల జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం ములుగురి హనుమంతు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చాడ వెంకటరెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో ఎర్ర జెండాలు ఎగురవేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు వివరించాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలలో నాటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్లమెంటు సభ్యుడు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్గం మోహినుద్దీన్, ఆరుట్ల కమల రామచంద్రారెడ్డి, బొమ్మగాని ధర్మబిక్షం, రాజ్‌బహదూర్‌గౌడ, దొడ్డి కొమరయ్య, అనవీరి ప్రభాకర్, సోయాబుల్లా ఖాన్, షేక్ బందగి, చాకలి ఐలమ్మలు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం హీరోచిత పోరాటాలు చేశారన్నారు. నాడు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది అమరులయ్యారన్నారు. నాటి పోరాటంలో 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచబడిందన్నారు. రజాకార్ల పాలన నుండి 3000 గ్రామాలు విముక్తి పొందాయని వివరించారు 1948 సెప్టెంబర్ 17న నిజాం నవాబ్ హైదరాబాద్ సంస్థానం తెలంగాణలో విలీనం అయింద న్నారు. ఈ చరిత్ర ప్రజలకు వివరించాలన్నారు. బిజెపి ప్రభుత్వం సాయుధ పోరాట చరిత్రను హిందూ–ముస్లిం పోరాటంగా వక్రీకరిస్తుందని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని దినోత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచులుగా, ఎంపిటిసిలుగా పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. సమావేశానికి ముందు సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సహాయ కార్యదర్శి ఎరుగు రాల భూమేశ్వర్, మాజీ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, ఎర్రదండి భూమయ్య, జిల్లా నేతలు సుతారి రాములు, మహమ్మద్ మౌలానా, ఎండి ముఖం, మహమ్మద్ ఉస్మాన్, కొక్కుల శాంత, అన్నం రాధ, మాడిశెట్టి కిరణ్, కొండ రాజయ్య, సనిగారపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదం, కుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మతోన్మాదానికి, కుల విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ కోరారు. దేశంలో నిరంతరం ప్రజల కోసం సిపిఐ పని చేస్తుందన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ ఆధ్వర్యంలో ప్రజాపంథా జిల్లా నాయకులు సిహెచ్.సాయగౌడ్‌తో పాటు డిచ్‌పల్లి, ఇందల్వాయి నాయకులు పలువురు సిపిఐలో చేరారు. వారికి పశ్య పద్మ ఎర్రకండువా కప్పి పార్టీ ఆహ్వానించారు. దేశంలో జరుగుతున్న భౌతిక పరిస్థితులకు అనుకూలంగా సిపిఐ పోరాటాలు చేస్తుంనందున సిపిఐలో చేరుతున్నట్లు సాయగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసే నాయకులు సిపిఐలో చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, సుధాకర్, ఓమయ్య, రాజేశ్వర్, విఠల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## 27న వ్యవసాయ మార్కెట్ యార్డు కార్మికుల రాష్ట్ర రెండవ మహాసభలు

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** వ్యవసాయం మార్కెట్‌యార్డు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర హమాలి, దడువాయి, చాట, గుమాస్తా, స్వీపర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండవ మహాసభలను నిర్వహిస్తున్నామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు గుమాస్తా సంఘం కార్యాలయంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండవ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభల్లో తెలంగాణ వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై చర్చించడంతోపాటు మార్కెట్ యార్డుల అభివృద్ధి, మార్కెట్ యార్డుకు తమ పండించిన ధాన్యాన్ని తీసుకువచ్చే రైతుల స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై చర్చించడంతో పాటు భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని రూపకల్పన చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని మార్కెట్ యార్డులకు సంబంధించిన కార్మికులందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్షులు పరశురాం, కార్యదర్శి శ్రీహరి, దడువాయి యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి రణం రవిందర్ గౌడ్, గుమాస్తా సంఘం అధ్యక్షులు బాలాంజనేయులు, శివ, అనసూయ, నరసయ్య, సుధాకర్ గౌడ్, నరేష్, స్వామి పాల్గొన్నారు.

## రైతు సమస్యలు పరిష్కరించాలని 8న ధర్నా

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం):** రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8న తహసీల్దార్ కార్యాలయాల ముందు చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జిలా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు కొరత లేకుండా యూరియాను సరఫరా చేయాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని, అసంపూర్తిగా ఉన్న కల్వర్టులను పూర్తి చేయాలన్నారు. వర్షాలతో అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని, ఇండ్లు కూలిన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జక్క దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శులు చేడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శి మహ్మద్ నయీమ్, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుర్రం రాజమణి, కార్యవర్గ సభ్యులు యాస బుచ్చిరెడ్డి, కసరబోయిన సత్తయ్య, కల్వాల నర్సయ్య, మారుపాక అంజయ్య, ఆత్మకూర్ పట్టణ కార్యదర్శి మజ్జిగ నరసయ్య, దుర్గపతి నరసింహ, సోమనబోయిన నరసింహ, తాళ్ళపల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




## సమగ్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలి

### సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా




**ప్రజాపక్షం/చండూరు :** సమగ్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మునుగోడు నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం శుక్రవారం చండూరులోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మా భవనంలో ఎండి జానీమియా అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా బొల్గూరి నర్సింహ్మా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ బలహీన వర్గాల పై జరుగుతున్న దాడులను అత్యాచారాలను అరికట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ను అమలు జరిపి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు 12వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ 6వేలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం అమలు చేయాలని , ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జిహెచ్ ఊషయ్య , మాజీ జడ్పిటిసి గోసుకొండ లింగయ్య , సంఘం మండల కార్యదర్శి ఇరిగి సంజీవ, దోటి బిక్షం, కాయత వెంకన్న, జక్కల అంజయ్య , వల్లపు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోరాట ఫలితంగానే భవన నిర్మాణ కార్మికులకు బీమా

### యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** ఎఐటియుసి పోరాటాల ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయని బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్(ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య తెలిపారు. తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గందె కొమురయ్య అధ్యక్షత వహించారు. ఈసంధర్భంగా పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదంలో మరణించిన వారికి రూ.పది లక్షలు, సహజ మరణం పొందిన వారికి రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల చాలామంది మరణించిన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వివాహం, ప్రసవ(డెలివరీ) బెనిఫిట్స్ పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అందుకు కార్మికులు ఐక్యంగా ముందుకు వచ్చి తమ డిమాండ్లు సాధించుకోవాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిని కార్మికులకు నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న లేబర్ కార్డుల ఫైళ్లను వెంటనే క్లియర్ చేసి అర్హులైన వారికి కార్డులు అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిలు రేగుల కుమార్, కసిబోజుల సంతోష్ చారి, జిల్లా కోశాధికారి గోదారి లక్ష్మణ్, పుట్ట మహేష్‌కుమార్ పాల్గొన్నారు.





# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఐకెపి విఓఎలకు కనీస వేతనం ఇవ్వాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ఐకెపి పిఓఏలకు కనీసవేతనం అమలు చేయాలని విఓఏ యూనియన్ సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షులు వెంపటి గురూజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని రైస్‌మిల్లర్స్ భవన్‌లో ఐకెపి విఓఏ జిల్లా బాధ్యతల సమావేశం యూనియన్ జిల్లా అద్యక్షురాలు కన్నం శారద అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గురూజీ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. మహిళల ఆర్థిక స్వావలంభనకు కృషి చేస్తున్న విఓఏలకు ప్రభుత్వం గుర్తించి కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలని అధికారుల వేధింపులను ఆపాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు నర్సింగ్ నాయక్, నాగేంద్రమ్మ, మంజుల, అనిత శైలజ, రామయ్య, సత్తయ్య, మల్లేష్, లాల్‌సాహెబ్, ఇందిర, రమణ, సునీత, సరోజ, నాగమణి పాల్గొన్నారు.



## విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి** : విద్యార్థిని, విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఉపాధ్యాయుల దినోత్సవం ,దిగంవత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల, విద్యారంగానికి సంక్షేమానికి పెద్దపీట వేసి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంత రావు మాట్లాడుతూ దినోత్సవ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 50 మంది ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను పురస్కారాలు,మెమెంటో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, టీజెఏసీ ఛైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, విద్యా శాఖ ఏడిఎన్ ప్రశాంత్ రెడ్డి, సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** నిజాం నిరంకుశ పాలనను అంతం చేయడానికి జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవాలను నేటి తరానికి తెలియజెప్పేందుకు సెప్టెంబర్ 11 నుండి 17 వరకు నియోజకవర్గ స్థాయిల్లో కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడింగి శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ నకిరేకల్ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం పట్టణంలోని జిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ భూమికొసం,భుక్తి కొసం,వెట్టి చాకిరి విముక్తి కొరకు జరిగిన సాయుధ పోరాటంలో 4500 మంది బలిదానం అయింది కేవలం సిపిఐ,ఆర్య సమాజానికి చెందిన నాయకులేనని పేర్కొన్నారు.కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంపు ఆదేశాలను అమలు చేస్తూ సుంకాల పేరుతో దేశానికి హాని చేసే స్రామాజ్య వాదులకు మడుగులొత్తడం సరైనది కాదని విమర్శించారు.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించకుండా గవర్నర్ పేరుతో మోసం పార్టీల వైఖరిని ప్రజలు ఎండగట్టాలని ఆయన కోరారు. బీసీ జనాభా లెక్కలను రాష్ట్ర ప్రభుత్వం బహిర్గతపరచాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఐ చిట్యాల మండల కార్యదర్శి ఎండి అక్బర్,నకిరేకల్ మండల కార్యదర్శి గౌని లక్ష్మీ నరసయ్య, కేతపల్లి మండల కన్వీనర్ వి రాజు, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, నియోజకవర్గ ప్రజాసంఘాల నాయకులు జిల్లా సత్యం, వెంపటి శ్రీనివాస్,వంగాల నాగయ్య ,బోడ మల్లేష్ ,దేవేందర్ ,శ్రీపతి స్వామి ,దుబ్బ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ శోభాయాత్ర నిమజ్జనం పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : గణేష్ శోభాయాత్ర నిమజ్జనం ప్రక్రియలను కమాండ్ కంట్రోల్ ద్వారా జిల్లా ఎస్‌పి కె నరసింహ పరిశీలించారు. శుక్రవారం సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జనం ప్రదేశాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరా, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పట్టణంలో జరుగుతున్న శోభాయాత్రను పర్యవేక్షించారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జనం ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెరువులో పడవ మీద ప్రయాణించి గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. క్రేన్ సామర్థ్యాన్ని పరిశీలించి ఎప్పటికప్పుడు క్రేన్ యొక్క స్థితిగతులను చూసుకోవాలని నిర్వాహకులకు తెలిపారు. ఉత్సవ కమిటీలు, యువత ఆదర్శంగా ఉండి నిమర్జనం పూర్తి చేసుకుని ఎలాంటి అవరోధాలకు వెళ్లకుండా గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఇండ్లకు చేరుకోవాలని కోరారు. జిల్లా ఎస్‌పి వెంట సూర్యాపేట డివిజన్ డిఎస్‌పి ప్రసన్నకుమార్, పట్టణ సిఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, మున్సిపాలిటి శానటరీ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు.

## మదర్ థెరిస్సా మార్గంలో నడవాలి



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** మదర్ తెరిసా తన జీవితాన్ని మొత్తం అనాధలకు కుష్టి రోగులకు అభాగ్యులకు ఎంతో సేవ చేశారు. తను ఎక్కడో పుట్టి మరి కలకత్తా కొచ్చి మన దేశంలో ఉన్నటువంటి అన్ని ప్రదేశాలు తిరగ చూసి నిస్వార్థంతో సేవ చేయడం మనదేశానికి చాలా అదృష్టం ఆమె చూయించినటువంటి ఆ మార్గాన్ని ప్రతి ఒక్కరు ఎంచుకొని ఎదుటివారికి ఆదుకునే విధంగా అందరూ పాటుపడాలని మరియరాణి కేథడ్రిల్ బిషప్ ధమన్ కుమార్,డాక్టర్ ఎస్ హెచ్ పుల్లారావులు అన్నారు.మదర్ తెరిసా 27వ వర్ధంతి సందర్భంగా రామగిరిలో ఉన్నటువంటి నిర్మల్ హృదయ మందిర్ లో ఉన్న అనాధలకు ఎవరూ లేని విగత జీవులకు అన్నదాన ప్రసాద కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో కేతపల్లికి చెందిన లూబెత్ తనయుడు విక్రాంత్ పసల శౌరి తన సతీమణి,బాలరాజు, బాలశివ, కిరణ్, బీమా అర్జున్ రెడ్డి పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

వేడుకలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపి రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు నెల్లికంటి, శంకర్ నాయక్





**ప్రజాపక్షం/నలగొండ టౌన్** :దేశాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర రోడ్లు ,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం , దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీతలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో అమ్మా,నాన్నల తర్వాత స్థానం గురువుకి ఇచ్చారని ,గురువు గొప్పతనాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ దేశానికి బాగా చాటి చెప్పారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. అంధకారాన్ని తొలగించి అజ్ఞానం స్థానంలో జ్ఞానాన్ని బోధించే గొప్ప వ్యక్తి గురువని అన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంలోనే పోటీపడే విధంగా ఒక్కొక్కటి 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామని, మొట్టమొదటి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల పనులు నల్లగొండలోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎమ్ఎల్ సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సమాజానికి దిశా,దశ, నిర్దేశం చేసేది ఉపాధ్యాయుడేనని అన్నారు. సమాజంలో జరుగుతున్న దోపిడీ అన్యాయాలను రూపుమాపింది జరుగుతున్న సామాజిక ఉద్యమం,విప్లవ ఉద్యమం నడపడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉందని గుర్తు చేశారు. అవార్డులతో నిమిత్తం లేకుండా ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంపై దృష్టి సారించాలని కోరారు.నల్లగొండ పార్లమెంటు సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించే బాధ్యత గురువులపై ఉందని, అలాంటి గురువులు సమాజంలో గొప్పవారని అన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదని, ప్రభుత్వం విద్యారంగాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నదన్నారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయుల కృషి వల్లనే గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 12 శా తం విద్యార్థుల నమోదు పెరిగిందన్నారు. ఉపాధ్యాయుల కృషితోనే జిల్లాలో ఎక్కడ లేని విధంగా భవిత కేంద్రాలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని, దీని ద్వారా మానసిక వికలాంగుల పిల్లలకు ఎంతోఉపయోగకరమన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, అడిషనల్ ఎస్‌పి రమేష్ , ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి, డిఈఓ బిక్షపతి ,మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేష్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## హిందువులు, ముస్లింలు భక్తిశ్రద్ధలతో సంబరాలు

**ప్రజాపక్షం/ ఉండవెల్లి** : తెలంగాణ రాష్ట్రంలో హిందువులు ముస్లింలు భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం, మిలాద్ ఊనబి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం నుంచి శుక్రవారం వరకు హిందువులు, ముస్లింలు సోదరా భావంతో ఈ ఉత్సవాలను జయప్రదం చేశారు. హిందువులు వినాయకుని విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని నవరాత్రి ఉత్సవాలను చేశారు. ముస్లింలు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మమ్మద్ ప్రవక్త యొక్క బోధనలు వినిపించారు. ప్రేమ , ఓర్పు, సహనం, శాంతి, నిరీక్షణ వంటి వాటి పై ప్రత్యేకంగా ముస్లింలు మసీదులలో అలంకరణలు ఏఆర్పటు చేసి అన్నదాన కార్యక్రమాలు ప్రసాదాలు దానధర్మాలు వంటివి నిర్వహించారు. పేదలను ప్రేమించాలని తపనతో మమ్మద్ ప్రవక్త యొక్క జయంతి వేడుకలను ముస్లింలు జరుపుకున్నారు. హిందువులు, ముస్లింలు రెండు రోజుల పాటు పండుగ వాతావరణం కనిపించింది. హిందువులు రంగులతో అలంకరణలు ఏర్పాట్లు జరిగాయి. అదే కోణంలో ముస్లింలు కూడా పిల్లల పెద్దలు పెద్దలకడ నే లేచి ఉపవాస ప్రార్థనలు కొనసాగించారు. సందడి సందడిగా రెండు వర్గాల మధ్యన ప్రేమ ఆప్యాయత అనురాగం సమాధాన వంటి భావాలతో ఈ ఉత్సవాలను జయపద్రం చేశారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో పోలీస్ శాఖ కృషి అభినందనీయమైనది. రాత్రి పగలు విధుల నిర్వహణలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా శాంతి భద్రతలను కాపాడడంలో పోలీస్ శాఖ అధికారులు ప్రయత్నాలు ఫలించాయి. గద్వాల జిల్లా ఎస్పీ టీ. శ్రీనివాసులు అర్ధరాత్రి వేళలో పర్యవేక్షణ చేసి ఆ శాఖను పటిష్ట పరచడం గర్వకారణం.

# సంస్కృతి, సంప్రదాయాలు పాటిస్తూ శోభాయాత్ర

ఒకటవ నంబర్ వినాయక విగ్రహానికి మంత్రి కోమటిరెడ్డి పూజాధిక్యాలు



**ప్రజాపక్షం/నలగొండ :** సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.వినాయక నవరాత్రుల ముగింపు సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాత పట్టణం లోని హనుమాన్ పురాలో ఏర్పాటు చేసిన ఒకటవ నంబర్ వినాయక విగ్రహానికి మంత్రి పూజాధిక్యాలు నిర్వహించి గణేష్ శోభ యాత్రను ప్రారంభించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పట్టణంలో మతసామరస్యంతో పాటు ,అన్ని మతాలను గౌరవిస్తూనే అభివృద్ధిని కొనసాగిస్తున్నామన్నారు. 200 కోట్ల రూపాయలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణాన్ని మొదలుపెట్టామని, లతీఫ్ సాహెబ్ దర్గా గుట్ట ,బ్రహ్మంగారి గుట్టలకు 150 కోట్ల రూపాయలతో ఘాట్ రోడ్లు నిర్మిస్తున్నామని, 30 పనులు పూర్తయ్యాయని చెప్పారు. ప్రభుత్వం ఈ సంవత్సరం వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్తును ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అన్ని శాఖల సిబ్బంది గణేష్ ఉత్సవ కమిటీల సహకారంతో క్రమశిక్షణను పాటిస్తూ 9 రోజులపాటు జిల్లాలో గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకున్నారని, గణేష్ శోభాయాత్ర తో పాటు, నిమజ్జనాన్ని కూడా ఇదేవిధంగా కొనసాగించాలని ఆమె కోరారు. జిల్లాలో ప్రజలు గంగా, జమున ,తెహజీబ్ సాంప్రదాయాన్ని పాటిస్తారని అన్నారు. కర్యక్రమాంలో జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్, గణేష్ విగ్రహ కమిటీ అధ్యక్షులు ఇటుకల కృష్ణయ్య ,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి ,గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కర్నాటి యాదగిరి, వక్త వెంకట్ నివాస్ ,చింతల సాంబమూర్తి మాజీ మున్సిపల్ చైర్మన్‌బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ ,మాజీ జెడ్పిటిసి, లక్ష్మయ్య, గుమ్మల మోహన్ రెడ్డి వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించారు.



## అంకితభావంతో వైద్యసేవలందించాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అంకితభావంతో నిరుపేద పేద వర్గాల ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు.డాక్టర్ చెరుకు సుహాస్ గత పది సంవత్సరాలుగా నల్లగొండ పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్న నవ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు అందిస్తూ నవ్య హాస్పిటల్ విశాలమైన నూతనమైన భవనంలోకి మార్చబడింది. నవ్య హాస్పిటల్ ను ఎమ్మెల్సీ సత్యం ప్రారంభించి మాట్లాడుతూ డాక్టర్ చెరుకు సుహాన్ గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేద ప్రజలకు తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందిస్తూ అందరి మన్ననలను పొందుతున్నారని అన్నారు. ఈ వైద్య సేవలను గ్రామీణ,పట్టణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ తాను కూడా డాక్టర్ గా ఉంటూ గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందించడం జరిగిందని తెలిపారు. నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ చెరుకు సుహాన్ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తారని ప్రతి ఒక్కరు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వాకులు డాక్టర్ చెరుకు సుహాన్, చెరుకు లక్ష్మి,మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు బసిరుద్దీన్,డాక్టర్లు పివిఎన్ మూర్తి, ప్రభాకర్ గౌడ్, ముధ బీర్ ప్రవీణ్ కుమార్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, పలు రాజకీయ నాయకులు కే పర్వతాలు, నిరంజన్ వలి,కలీమ్, మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, భువనగిరి దేవేందర్. బకరం శ్రీనివాస్,పందుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనంలో తండ్రీ కొడుకుల గల్లంతు





**ప్రజాపక్షం/వేములపల్లి:** మండల కేంద్రంలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువలో తండ్రి కొడుకులు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాడుగుల పల్లి మండలం ఆగ మోత్కూర్ గ్రామంలో వినాయకుని నవరాత్రి ఉత్సవాలు జరుపుకొని విగ్రహాన్ని వేములపల్లి మండలం కేంద్రంలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువలో నిమజ్జనం చేసిన తర్వాత పున్న సాంబయ్య(45) కాలువలోకి దిగి కాళ్లు కడుక్కోవడానికి ప్రయత్నించగా కాలుజారి కాలువలో పడిపోయాడు అది గమనించిన ఆయన కొడుకు శివ మణి (20) తండ్రిని కాపాడడం కోసం నీటిలో దూకాడు కాపాడే ప్రయత్నంలో ఒకరినొకరు గట్టిగా అలుముకోవడంతో కాళ్లు చేతులు ఆడక నీటిలో మునిగి కొట్టుకుపోయినట్లు తెలిపారు. కాలువలో పడిన సాంబయ్యకు ఒక కూతురు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. గత సంవత్సరం తల్లిని కోల్పోయిన ఆ పాపకు ఇప్పుడు తండ్రి అన్న ఇద్దరు లేకపోవడంతో అనాధ అయిందని గ్రామస్తులు బోరున విలపిస్తున్నారు.

**ఎఫ్ డి ఆర్ ఎఫ్ బృందాల ఏర్పాటు**

కాలువలో పడిపోయిన తండ్రి కొడుకులను కాపాడేందుకు ఎఫ్డిఆర్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. నిమజ్జనం కోసం వచ్చిన తండ్రి కొడుకులు కాలువలో జారీ పడిపోయిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ, డిఎస్పి రాజశేఖర్ రాజు లతో ప్రమాద స్థలానికి చేరుకుని తండ్రి కొడుకుల ఆచూకీ కనిపెట్టాలని అధికారులను ఆదేశించారు.

## యూరియా విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : రాష్ట్రంలో యూరియా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, నమ్మి ఓట్లేసిన రైతులను నట్టేట ముంచిందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో ఏనాడు యూరియా కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. రైతులకు సకాలంలో సరిపడా యూరియా అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులే యూరియా లేదంటుంటే ముఖ్యమంత్రి మాత్రం యూరియా కొరత లేదంటూ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. రోజులతరబడి లైన్‌లో నిలబడ్డ రైతులు, మహిళలు కడుపుమండి బూతులు తిడుతుంటే వినపడడంలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్‌ను, కేటీఆర్‌ను తిట్టడమే పని బెట్టుకున్నారే తప్ప రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని అన్నారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఏకైక శాఖ పోలీసు శాఖ మాత్రమేనన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. హాస్టళ్లలో భోజనం సరిగా లేదని పిల్లలే ధర్నాలు చేసే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. రేవంత్‌కు ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదని, విద్యాశాఖ దగ్గర పెట్టుకుని పిల్లల జీవితాలతో ఆటలాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నీళ్లను వాటర్‌లో కలిపే మంత్రులను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.




# గంగమ్మ ఒడిలోకి గణనాధుడు..

సూర్యాపేట జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ముగిసిన గణేష్ నిమజ్జనాలు







**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గణేష్ నవరాత్రులు మళ్ళీ వచ్చే సంవత్సరం కూడా ఘనంగా జరుపుకునేలా ఎలాంటి విఘ్నాలు లేకుండా చూడంటూ వినాయక విగ్రహాలను గంగమ్మ ఒడిలోకి భక్తులు చేర్చారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 3200 విగ్రహాలను స్థానిక చెరువులు, కుంటలలో శుక్రవారం నిమజ్జనం చేశారు. మండపాల వద్ద గణనాధుడితోపాటు పూజలందుకున్న లడ్డూ, స్వామి వస్త్రాలను భక్తులు వేళంపాటల ద్వారా తమ స్వంతం చేసుకున్నారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు చేపట్టి రూట్ మ్యాప్‌లు అమలు చేశారు. ఒకే రోజు రెండు పండుగలు గణేష్ నిమర్జనం, మిలాద్ ఉన్ నభీ పండుగ ఉండడంతో ప్రజలు మత సామరస్యంతో, సోదర భావంతో వేడుకలను జరుపుకున్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత 75 సంవత్సరాల నుండి నిర్విఘ్నంగా సూర్యాపేట పట్టణ వేదాంత భజన మందిర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణనాధుని విగ్రహ శోభాయాత్రను భానుపురి ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో జెండా ఊపి ప్రారంభించారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో జరగటానికి జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహ లు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికిప్పుడు పర్యవేక్షించారు. శోభాయాత్ర, నిమజ్జనం ప్రక్రియను జిల్లా పోలీసు కార్యాలయం నందు, సద్దుల చెరువు వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం పర్యవేక్షించి వివిధ శాఖల అధికారులకు సూచనలు ఇచ్చారు. నిమజ్జన భద్రత కోసం పోలీసు వారు అడిషనల్ ఎస్‌పి, ముగ్గురు డిఎస్‌పిలు, 11 మంది సిఐలు, 60 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుల్స్, హోంగార్డులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఏఆర్ సిబ్బంది, స్పెషల్ పార్టీలతో కలిసి మొత్తం జిల్లాలో 1500 మంది సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

### ముఖ్యమంత్రి సహాయనిధి
## రూ.2,39,500ల చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/నర్వ :** తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య కార, క్రీడా, యువజన సర్వీసుల శాఖ మాత్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి అదేశానుసారంగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. శుక్రవారం మక్తల్ నియోజకవర్గం నర్వ మండల కేంద్రంలో పాతర్చేడు, నాగిరెడ్డి పల్లి, జంగం రెడ్డిపల్లి, బుడ్డగాన్ తండా, గ్రామ లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ జరిగింది. పాతర్చేడ్ పి.కిష్టమ్మకు రూ.31500, నాగిరెడ్డిపల్లి బోయఅనితకు రూ.52000, జంగం రెడ్డిపల్లి బాలు నాయక్‌కు రూ.96000, బుడ్డగాని తాండ బాణావత్ కేశలమ్మకు రూ.60000, లబ్ధిదారులకు నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఈ చెక్కుల పంపిణీ చేయడం జరిగింది.



## ఎంఇఓగా బాధ్యతలు స్వీకరించిన వి.ప్రకాష్ ,జిహెచ్‌ఎం కన్ననూర్

**ప్రజాపక్షం/అడ్డాకుల :** సెప్టెంబరు 5 ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మండల వనరుల కేంద్రంలో నూతనంగా మండల విద్యాధికారిగా నియామకమైన వి.ప్రకాష్ జిహెచ్‌ఎం కమ్మనూర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల సమర్పించి, బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ వి. ప్రకాష్ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి మండలంలోని పాఠశాలల్లో ఉన్న సమస్యలు తదితర విషయాలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ అడ్డాకుల మండలాన్ని కేవలం అక్షర క్రమంలోనే ముందు వరుసలో ఉండడం కాకుండా మండల పాఠశాల విద్యా వ్యవస్థను అన్ని విభాగాలలో ముందు వరుసలో ఉండే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల సమర్పించి విద్యావ్యవస్థకు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు బాలయ్య, టిటియు జిల్లా అధ్యక్షులు జుర్రు నారాయణ యాదవ్, బిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల శంకర్, పిఆర్‌టియు మండల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు మద్దిలెట్టి, తెలంగాణ పిఆర్‌టియు మండల అధ్యక్షుడు రాఘవ, తపస్ మండల అధ్యక్షుడు రమేష్ గౌడ్, ఎస్టీయు జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు గౌడ్, పిఆర్‌టియు మండల ప్రధాన కార్యదర్శి సంపత్, తపస్ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యాయులు సూర్య ప్రకాష్, శివకుమార్, రామచంద్రయ్య, పిడి మంజుల, రాధా, బజారి శివశంకర్, పిటిఐ భాస్కరాచారి పాల్గొన్నారు.

## స్వాతంత్య్ర సమరయోధుడి విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** మండలపరిధిలోని బోయపూర్ గ్రామంలో స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డెఓబన్న విగ్రహావిష్కరణ ఆదివారం ఉదయం 10.30 నిమిషాలకు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా బిసిసంఘం నాయకులు దాసర్ధరంటస్వామి తెలిపారు. ఆట్టి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని మండలంలోని విద్యావేత్తలు, మేధావులు, ఉపాధ్యాయులు, కవులు, కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలబిసిసంఘం గౌరవ అధ్యక్షులు అంతటిరాజేందర్‌గౌడ్, వేముల సత్యశీలసాగర్, గంగన మోని శివ, ఈర్లశ్రీకాంత్, యాదగిరి, కరుణాకర్, రామన్‌గౌడ్ పాల్గొన్నారు.



## నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** సామాన్యప్రజలపై జిఎస్‌టిభారాన్ని తగ్గించిన సందర్భంగా బిజెపి పార్టీ తెలంగాణరాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుల ఆదేశాలప్రకారం మండలంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షులు పిట్టలరాములు మాట్లాడుతూ పేదప్రజలకు, మహిళలకు, యువతకు దేశంలోని అనేకవర్గాల ప్రజలకు నిత్యావసర సరుకులు తక్కువధరకు అందించాలనే ఉద్దేశ్యంతో జిఎస్‌టిని తగ్గించి భారతదేశంలో అతిపెద్ద పన్ను సంస్కరణలను తెచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడి, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాకౌన్సిల్‌మెంబర్ గుమ్మకొండ భూషయ్య, సీనియర్ నాయకులు బాలరాజు, ఒబిసిమోర్చా రాష్ట్రకార్యవర్గసభ్యులు మల్లికేడి లక్ష్మణ్, రఘుబాబు, మండలప్రధాన కార్యదర్శులు కృష్ణ, ఆంజనేయులు, రమేష్, శివ, శ్రీకాంత్, మహేష్, అంజి, తిరుపతయ్య, ప్రవీణ్, సంతోష్‌కుమార్, బాలకృష్ణ, పవన్, శేఖర్, ఆనంద్‌సింగ్, ప్రకాష్, నవీన్‌కుమార్, నారాయణ చారి, తిరుపతయ్య, నర్సింహ్మా పాల్గొన్నారు.




## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** స్థానికవాసవిక్లబ్ కల్వకుర్తి భవనంలో సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినమైనటువంటి ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కల్వకుర్తి డివిజన్‌స్థాయిలో పాఠశాలలో ఉత్తమంగా పనిచేసినటువంటి ఉపాధ్యాయులను గుర్తించివారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు చిగుళ్లపల్లిశ్రీధర్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు గొప్పస్థానం ఉందన్నారు. ఉపాధ్యాయులు ఆంజనేయులు, జమీల్‌అహ్మద్, ఆనంద్, సతీష్‌కుమార్, రాజు, ప్రసన్న, శోభన్‌బాబు, శంకర్, వహీద్, నరేందర్, రమేష్, వెంకటయ్య, రాజేందర్, లక్ష్మి, నర్సింహ్మారావును సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోపాల్, మాజీకోశాధికారి శ్రీనివాసులు, సభ్యులు సతీష్ పాల్గొన్నారు.

## ఆది గురువులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** భారతదేశానికి స్వాతంత్య్రంరాకముందు దేశంలోని బడుగు, బలహీన, అణగారిన నిరుపేద ప్రజలకు అక్షరాలునేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత యావత్ భారతదేశంలోనే మొట్టమొదటి తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే, మహాత్మాజ్యోతిరావుపూలే ఆది గురువులని గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రబిసి సంఘం నాయకుడు అప్పలమాసయ్యయాదవ్ అన్నారు. విద్యపట్ల వీరుచేసిన కృషిని నేడు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# అవసరాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలి

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు పట్టణంలో పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామానికి చెందిన ప్రతాపరెడ్డి నూతనంగా ఏర్పాటుచేసుకున్న 'తెలంగాణ రుచులు' హోటల్‌ను ప్రారంభించారు. అధునిక అవసరాలను అందిపుచ్చుకొని ప్రజల నాడిని బట్టి ఆహార పదార్థాలు తయారు చేస్తే త్వరితగతిన అభివృద్ధి చెంద వచ్చు అని ఆయన యాజమాని ప్రతాపరెడ్డికి సూచించారు. అనంతరం పెబ్బేరు పట్టణంలోని జామ్యా మసీదులో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా నిర్వహించే మిలాద్ ఉన్న నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఎంత పవిత్రంగా జరుపుకుంటారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు , ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ఎమ్మెల్యే తూడి




**ప్రజాపక్షం/వనపర్తి :** మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా జరుపుకునే మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో శుక్రవారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. మహమ్మద్ ప్రవక్త 1500 జయంతినే గొప్పగా జరుపుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ , పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీర్ల చందర్ , జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సమన్వయకర్త లక్కాకుల సతీష్ , మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, వనపర్తి మార్కెట్ డైరెక్టర్ లతీఫ్ , ముస్లిం నాయకులు రఫిక్ , మన్సూర్ , ఇర్ఫాన్ , అస్లాం, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**అమరచింతలో .....**

మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ వేడుకలను శుక్రవారం అమరచింత మండల కేంద్రంలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని జామా మసీదులో ముస్లింలు మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల కార్య నిర్వాహకులు ఇబ్రహీం, ఖయ్యూం, మైనద్దీన్ ఆధ్వర్యంలో జరిపారు. ముస్లిం పెద్దలు అల్తాఫ్ మౌలానా, ఫరీద్ , సయ్యద్ కలాం, ఖాజా హుస్సేన్ , రఫీ, మైమూద్ తదితరులు పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్ వాహనంలో మహిళ ప్రసవం .. తల్లీబిడ్డ క్షేమం



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్ వాహనంలో వీపనగండ్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అంబులెన్స్ లో మహిళా సుఖ ప్రసవం జరిగిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వీపనగండ్ల మండల పరిధిలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన దీప్తికి పురిటి నొప్పులు రావడంతో కాన్పు కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లడానికి 108 అంబులెన్స్ వాహనానికి కుటుంబ సభ్యులు సమాచారం అందించారు.
వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న 108 అంబులెన్స్ టెక్నీషియన్ సాయి కుమార్ , పైలెట్ శివయ్య, గోవర్ధనగిరికి వెళ్లి ప్రసవ వేదనతో బాధపడుతున్న దీప్తిని అంబులెన్స్ లో తీసుకొస్తుండగా మార్గమధ్యంలోనే మహిళకు సుఖ ప్రసవం జరిగి పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చినట్లు టెక్నీషియన్ సాయి కుమార్, పైలెట్, శివయ్య తెలిపారు. అనంతరం మహిళను పుట్టిన బిడ్డను ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందని , దీప్తికి ఇది మూడవ కాన్పు అని వారు తెలిపారు. 108 సిబ్బందికి భర్త శివుడు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## జర్నలిస్టుల భవన నిర్మాణానికి పూర్తి సహకారం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి మున్సిపాల్టీ నాగవరం శివారులో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అన్ని వసతులతో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా భవనం నిర్మాణం కోసం పూర్తి సహకారం అందిస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జర్నలిస్టులకు హామీనిచ్చారు. టీయూడబ్ల్యూజే వనపర్తి జిల్లా అధ్యక్షులు మాధవరావు ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. గతంలో మార్కెట్ విలువ ప్రకారం సర్వే నంబర్ 92/1లో 0.10 గుంటల భూమిని యూనియన్ భవనం కోసం కేటాయించగా మార్కెట్ విలువ డబ్బు రూ. లక్ష ట్రెజరీలో జమ చేయడం జరిగిందన్నారు. స్థలాన్ని ప్రభుత్వం యూనియన్ కు స్వాధీనం కూడా చేసిందని, సంబంధిత పత్రాలను జర్నలిస్టులు ఆయనకు సమర్పించారు. జర్నలిస్టులు యూనియన్ పక్షాన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి. రాజు, యూనియన్ సీనియర్ నాయకులు ఉషన్న, మల్యాల బాలస్వామి, ప్రశాంత్ , జిల్లా కోశాధికారి మన్యం, ఉపాధ్యక్షులు కమాల్ , ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, నర్సింహరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు విజయ్ కుమార్ , రవికాంత్ , వేముల తిరుపతయ్య, యాకూబ్ , పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్ , సిలుమర్తి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురు అరెస్టు




**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని అక్రమ గంజాయి అమ్ముతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్. బి.సురేష్ బాబు వివరాలు వెల్లడిస్తూ కోరుట్ల పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ వెనుక ఆరుగురు వ్యక్తులు, గంజాయి తాగుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు కోరుట్ల ఎస్ఐ ఏం.చిరంజీవి ఆధ్వర్యంలో కోరుట్ల పోలీస్ సిబ్బంది, ఆకస్మిక దాడి చేసి అట్టి ఆరుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 500 గ్రాముల (అరకిలో)(15000/విలువగల) గంజాయి, మూడు బైకులు, 5 సెల్ ఫోన్ లు సీజ్ చేయడం జరిగిందని కోరుట్ల, జగిత్యాల పట్టణానికి చెందిన ఆరుగురు వ్యక్తులు, కోరుట్ల నుండి మూడు మోటార్ సైకిల్ మీద బయలుదేరి నిర్మల్ లోని ఒక వ్యక్తి వద్ద అరకిలో (500 గ్రాములు) సుమారు 15 వేల విలువగల గంజాయి అమ్మడానికి కొనుక్కొని వచ్చి , వారు అక్కడ గంజాయి తాగుతూ, ఎవరైనా వస్తే అమ్ముదామని అక్కడ ఉండగా వారిని కోరుట్ల పోలీసులు పట్టుకున్నారు. వారికి గంజాయి సరఫరా చేసిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని. ఇట్టి ఆరుగురు వ్యక్తులని కోర్టు వారి ముందు హాజరు పరిచి రిమాండ కు తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణాన్ని గంజాయి రహిత పట్టణముగా మార్చాలని ఉద్దేశంతో కోరుట్లలో గంజాయిని నిర్మూలించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఈ గంజాయి అమ్మేవారిని, సరఫరా చేసే వారిని అలాగే తాగే వారిని, గుర్తించి వారిపై ప్రత్యేక నిఘ పెట్టి దాని గురించే పని చేయుచున్నామని ఇట్టి ఆరుగురు వ్యక్తులను పెట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల ఎస్ఐలు ఏం.చిరంజీవి , రామచంద్రం, పోలీస్.కానిస్టేబుళ్లు రాజేశ్వరరావు, పురుషోత్తం, గట్టు శ్రీనివాస్ లను, పై అధికారులు అభినందించారు.

# అమరజీవి కొమురయ్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బొగ్గు గని కార్మికుల పెన్షన్ సాధకుడు, నిరంతర కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పాటు పడిన మహా నాయకులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ మనుబోతుల కొమురయ్య (యూనియన్ కొమురయ్య) అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు పేర్కొన్నారు. శుక్రవారం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆద్వర్యంలో గనులు, డిపార్ట్మెంట్ లలో, గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన కొమురయ్య 29 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటాలకు కార్మికులు, ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి లో ఏఐటియుసి యూనియన్ స్థాపించిన వ్యవస్థాపకుల్లో కొమురయ్య గారు ఒకరని, నలబై ఏళ్ళ కు పైగా యూనియన్ కు ప్రధాన కార్యదర్శి గా ఉంటూ బొగ్గు గని కార్మికుల సమస్యలతో పాటు పెన్షన్ సాధించిన మహానేత కొమురయ్య గారని వారు పేర్కొన్నారు. నేడు కార్మిక వర్గం అనుభవిస్తున్న ప్రతి హక్కు కొమురయ్య గారి కృషి ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు




గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ సంకె అశోక్, సయ్యద్ సోహేల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం ఎ గౌస్ తో పాటు ఆయా గనులు, డిపార్ట్మెంట్ ల కు చెందిన పిట్ కార్యదర్శులు, ఆఫీస్ బేరర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గణేష్ శోభాయాత్రలో అపశృతి

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండలం రంగాపూర్ దగ్గర విషాదం చోటు చేసుకుంది. గణేష్ శోభయాత్రలో రంగాపురం గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున 1.35 గంటల సమయంలో పాత గురుదత్త దాబా దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలకు వెళ్తే కర్నూల్ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న డిసిఎం , బీచుపల్లి నుంచి నాచహళ్లి వెళ్తున్న ట్రాక్టర్ ను వెనకనుంచి బలంగా ఢీ కొట్టింది. నాచహళ్లి గ్రామానికి చెందిన 13 మంది యువకులు బీచుపల్లి దగ్గర గణేష్ నిమజ్జనం ముగించుకొని తిరిగి గ్రామానికి ట్రాక్టర్ లో వెళ్తున్నారు. ఈ క్రమంలో రంగాపూర్ దాటిన తర్వాత పాత గురుదత్త దాబా దగ్గర వెనకాల నుంచి వస్తున్న డిసిఎం నంబర్ ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీ కొట్టింది. డిసిఎం డ్రైవర్ అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనకాల నుంచి ఢీ కొట్టడం వల్ల ట్రాక్టర్ ఇంజన్ మీద కూర్చున్నటువంటి 5 గురి లో ఇద్దరు వ్యక్తులు అక్కడక్కడ మృతి చెందారు. మృతి చెందిన సాయి (25), శంకర్ (28)లు మృతి చెందినట్లు, మరో ఇద్దరు యువకులు అబ్దుల్లా, విష్ణు తీవ్ర గాయాలతో వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్ తరలించినట్లు మృతుల్లో గాయపడిన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నారు.



## వనపర్తికి బస్సు సౌకర్యం కల్పించాలి

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** కొల్లాపూర్ నుండి బొల్లారం ... కొర్లకుంట మీదుగా వనపర్తి వరకు బస్సు సౌకర్యం గత కొన్ని రోజులుగా నిలిచిపోవడంతో ఆ మార్గంలోని ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారని బొల్లారం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కొల్లాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమా శంకర్ గౌడ్ కు వినతి పత్రం అందజేశారు. ప్రజలకు రాకపోకలలో ఇబ్బందులు లేకుండా విద్యార్థులు , ఉద్యోగులు, రైతులు , వృద్దులు , మహిళలు సులభంగా ప్రయాణించేందుకు తక్షణమే బస్సు సర్వీసులు పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఉమా శంకర్ గౌడ్ స్పందిస్తూ ప్రజల సమస్యను గమనించామని, రెండు మూడురోజుల్లో ఆ రూట్ లో బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో బొల్లారం సిపిఎం గ్రామ కార్యదర్శి బాలగౌడ్ , నాయకులు కృష్ణయ్య, వెంకటస్వామి, తిరుపతయ్య, రంగస్వామి, కావలి శ్రీనివాసులు, సుబ్బన్న, మహేష్ , భాస్కర్ తదితరులు ఉన్నారు.



## యువకుడికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** రోడ్డుప్రమాదంలో గాయపడిన నాగర్‌కర్నూల్ పట్టణానికిచెందిన బండివరలక్ష్మి బండిబాలరాజుల కుమారుడు బండిశ్రావణ్‌కు నాగర్‌కర్నూల్ జిల్లాముదిరాజ్ సంక్షేమసంఘం తరపున సేకరించిన విరాళాలు రూ.55వేలు శుక్రవారం అందజేశారు. గతపదిరోజులక్రితం నాగర్‌కర్నూల్ పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో శ్రావణ్ తలకుబలమైన గాయాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈవిషయాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా తెలుసుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా ముదిరాజ్ బంధువులు అందించిన రూ.55వేల నగదును జిల్లాముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మేకల నాగరాజు సమక్షంలో కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మేకలరమేష్, గణేష్, శ్రీనివాసులు, ప్రవీన్‌కుమార్, శ్రీరాములు, ఆనంద్, తిరుపతయ్య, సురేష్, గణేష్, ప్రదీప్, భాస్కర్ పాల్గొన్నారు.



## ఘనంగా మిలద్ ఉన్‌నబీ వేడుకలు

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** మహ్మద్‌ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలద్ ఉన్‌నబీ పర్వదినాన్ని శుక్రవారం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామ ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మస్జీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతోపాటు శాంతియాత్రలు చేపట్టారు. చిన్నాపెద్దా తేడాలేకుండా సాంప్రదాయ వస్త్రధారణతో శాంతియాత్రలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మతబోధకుడు మహ్మద్ అక్రమోద్దిన్ మాట్లాడుతూ మహ్మద్‌ప్రవక్త ప్రపంచానికి శాంతి, సౌభ్రాతృత్వాలను సోదరభావాన్ని బోధించారని గుర్తుచేశారు. వారిమార్గంలో పయనిస్తూ ప్రపంచమానవాళి శ్రేయస్సుకోసం ప్రార్థించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మతసామరస్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం ముస్లింమైనార్టీ యువకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లింమైనార్టీ యువకులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఎసిపి కృష్ణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అన్ని దానాల్లోకెల్లా రక్తదానం చాలా గొప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, పెద్ద పెల్లి ఏసిపి గజ్జి కృష్ణ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక యం బి గార్డెన్లో మర్కజే మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన గొప్ప మహనీయుడు మహమ్మద్ ప్రవక్త అని, నేటి యువత మహమ్మద్ ప్రవక్త మార్గం ఎంచుకొని సన్మార్గంలో నడచి కన్న తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది వరకు రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లతోపాటు పండ్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ రావు, మౌలానా అజీముద్దీన్, మిలాద్ కమిటీ అధ్యక్షులు రఫీ ఉల్లా ఖాన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సల్లావుద్దీన్ ఖాదిరి, మాజీ కౌన్సిలర్ తబ్రేజ్ ఖాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రీల్

# వారికి రుణపడి ఉంటా..

మీడియా 'చిట్ చాట్'లో మంచు మనోజ్




## 'కే-ర్యాంప్' పోస్టర్ విడుదల



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్'. ఈ సినిమాను హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద నిర్మాత రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. 'కే ర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న థియేటర్‌లో విడుదల కానుంది. 'ఓనమ్' పండుగ సందర్భంగా 'కే ర్యాంప్' సినిమా నుంచి విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. కేరళ నేపథ్యంగా జరిగే కథను 'కే ర్యాంప్' మూవీలో సరికొత్తగా చూపించ బోతున్నారు. ఓనమ్ పండుగ సెలబ్రేషన్స్‌తో సాగే పాటను కూడా ఈ మూవీలో ప్రత్యేకంగా చిత్రీకరించారు. ఈ నెల 9న ఈ సినిమా నుంచి మ్యాజికల్ లవ్ మెలోడీ సాంగ్ 'కలలే కలలే' విడుదల చేయబోతున్నారు. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు.

## పప్పీ షేమ్ పాట 8న రిలీజ్



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న యూనిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్రా కింగ్ తాలూకా. మహేష్ బాబు పి దర్శకత్వంలో, ప్రముఖ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. అద్భుతమైన టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రం హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. రామ్ పోతినేని స్వయంగా రాసిన, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ పాడిన ఫస్ట్ సింగిల్ వైరల్ అయ్యింది. ప్రస్తుతం మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో ఉంది. ఇప్పుడు సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు. వివేక్, మెర్విన్ సంగీతం అందించిన ఫన్నీ నంబర్ పప్పీ షేమ్ ఈనెల 8న విడుదల కానుంది. పోస్టర్‌లో రామ్ ఎనర్జిటిక్‌గా కనిపించారు.

## ఈ నెల 19న 'వీర చంద్రహాస' విడుదల




కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ తెలుగులో విడుదల చేస్తున్న కన్నడ చిత్రం 'వీర చంద్రహాస'. గతంలో శివరాజ్ కుమార్ నటించిన 'వేద', ప్రజ్వల్ దేవరాజ్ నటించిన 'రాక్షస' చిత్రాలను తెలుగులో రిలీజ్ చేసిన ఆయన తాజాగా 'వీర చంద్రహాస' తెలుగు హక్కులను దక్కించుకున్నారు. 19న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. హోంబలే ఫిలమ్స్ సమర్పణలో విడుదల చేస్తున్న వీర చంద్రహాస చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి.

హీరో తేజ సజ్జా నటించిన తాజా చిత్రం 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా మనోజ్ మంచు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నాకు కార్తిక్ ఎప్పటి నుంచో తెలుసు. అలాగే తేజ చిన్నప్పటి నుంచి తెలుసు. తను ఒక ఈవెంట్ కలిసినప్పుడు 'మంచి స్క్రిప్ట్ వుంటే కలిసి సినిమా చేద్దాం తమ్ముడు'అని చెప్పాను. 'నిజమా అన్నా' అన్నాడు. ఓ రోజు మా గేమింగ్ స్టూడియోలో వున్నప్పుడు తేజ వచ్చి మిరాయ్ గురించి చెప్పాడు. కథ, మా ఇద్దరి పాత్రల గురించి ఇప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు. కార్తిక్ చెప్పిన కథ చాలా నచ్చింది. శ్రీరాముల వారి నేపథ్యం, తొమ్మిది పుస్తకాల బ్యాక్ డ్రాప్, ఇతిహాసల కోణం చాలా అద్భుతంగా వుంటుంది. ఇందులో నా క్యారెక్టర్ చాలా పవర్ ఫుల్‌గా వుంటుంది. లేజీగా వుండే వాడు బ్రతకకూడదనే క్యారెక్టర్. కార్తిక్ చాలా అద్భుతంగా డిజైన్ చేశారు. చాలా స్పెషల్ కేర్ తీసుకున్నాం. దాదాపు ఈ సినిమా మూడేళ్ళు పెట్టాం. డైరెక్టర్ ప్రతి విషయంలో చాలా డిటెయిల్‌గా వున్నారు. ప్రతి డీటెయిల్ ని ఆయన మోనిటర్ చేసుకుంటారు. ఈ విషయంలో మొత్తం క్రెడిట్ డైరెక్టర్‌కి ఇవ్వాలి.రజినీకాంత్ గారిని కూలికి ముందు కలిశాను. మిరాయ్ ట్రైలర్ చూపించాను. ఆయనకు చాలా నచ్చింది. ఇలాగే కంటిన్యూ చెయ్, గ్యాప్ లేకుండా సినిమాలు చేయమని చెప్పారు. చాలా ఎంకరేజ్ చేశారు. మంచి ఎనర్జీ ఇచ్చారు. మిరాయ్ యాక్షన్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. అలాగే నాకు చిన్నప్పటి నుంచి మార్షల్ ఆర్ట్స్ అలవాటు. హైదరాబాదులో జాక్సన్ మాస్టర్ దగ్గర ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. దాదాపు 8 నెలల ప్రాక్టీస్ చేశాను. మిరాయ్ నా కంబ్యాక్ ఫిల్మ్ అవుతుంది.తేజ ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాడు. యాక్షన్ ఇంటెన్స్‌గా ప్రాక్టీస్ చేశాడు. సినిమా చూస్తున్నప్పుడు తన హార్డ్ వర్క్ మీకు కనిపిస్తుంది. కార్తీక్ గ్రేట్ టెక్నీషియన్. ఇదే కంటెంట్‌ని మరో డైరెక్టర్ చేస్తే మాత్రం ఈ బడ్జెట్ లో అవ్వదు. తన అనుభవంతో కార్తీక్ హాలీవుడ్ స్థాయిలో ఈ సినిమాని తీశారు. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను.ఈ సినిమా దాదాపుగా అన్ని లైవ్ లొకేషన్‌లోనే షూట్ చేశాం. రియల్ లొకేషన్స్‌లో గ్రాఫిక్స్‌ని వాడి సినిమా ఎక్స్పీరియన్స్‌ని మరింతగా అన్హాన్స్ చేశాం. ఇందులో యాక్షన్స్ అంతా లైవ్‌గా వుంటుందినా లైఫ్‌లో హైయస్ట్ రెస్పాన్స్ వచ్చిన ట్రైలర్ ఇది. ఇనిషియల్ డేస్‌లో మిస్టర్ నూకయ్య, నేను మీకు తెలుసా సినిమాలకు కూడా చాలా అద్భుతమైన స్పందన వచ్చింది. అయితే ఈ స్కేల్లో సినిమా రావడం, ప్రపంచంలో నలుమూలల నుంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది. ఇంత అద్భుతమైన క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ గారికి రుణపడి ఉంటాను. కొత్త సినిమాల విషయానికొస్తే డేవిడ్ రెడ్డి, రక్షక్ సినిమాలో జరుగుతున్నాయి. ఈ రెండు కూడా హై ఇంటర్సిటీ యాక్షన్ ఉన్న సినిమాలు. అలాగే ఒక మంచి ఎంటర్టైన్మెంట్ ఉన్న స్క్రిప్ట్ కోసం కూడా చూస్తున్నాను. ప్రస్తుతం డేవిడ్ రెడ్డి వర్క్ షాప్స్ జరుగుతున్నాయి. తమిళ్ నుంచి కూడా కొన్ని కథలు వస్తున్నాయి. ఒక నటుడిగా అన్ని భాషల్లో సినిమాలు చేయాలని ఉంటుంది. అహం బ్రహ్మాస్మి సినిమా కూడా సమయం వచ్చినప్పుడు వస్తుంది. అలాగే వాట్ ద ఫిష్ సినిమా కూడా చేయాలి. చాలా డార్క్ కామెడీ ఉన్న సినిమా అది. ఆ సినిమాని ఫారిన్ లొకేషన్స్‌లో వింటర్ సమ్మర్ రెండు సీజన్స్‌లో తీయాలి. నేను మీకు తెలుసా టీంతో ఒక సినిమా చేయాలని ఆలోచన ఉంది. త్వరలో ప్రకటిస్తాం.

## అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో 'ది గేమ్: యు నెవర్ ప్లే అలోన్'

శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలిసి చేస్తున్న న్యూ థ్రిల్లర్ 'ది గేమ్: యూ నెవర్ ప్లే అలోన్' అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ కానుంది. బ్లాక్ వారంట్ తర్వాత నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని రాజేష్ ఎం.సెల్వా డైరెక్ట్ చేస్తున్నారు. లీడ్ రోల్‌లో శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తుండగా, సంతోష్ ప్రతాప్, చందినీ, శ్యామ హరిని, బాల హసన్, సుబాష్ సెల్వం, వివియా సంతోష్, ధీరజ్, హేమా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. స్ట్రాంగ్ స్టోరీటెల్లింగ్‌తో పాటు టైమ్‌లి థీమ్స్‌ని మిక్స్ చేస్తూ ఆడియన్స్‌కి డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది. ఈ సందర్భంగా నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ.. ది గేమ్ మా ఈ ఏడాది ఫస్ట్ తమిళ సిరీస్. సరికొత్త స్టోరీని తీసుకొస్తున్నాం. ఒక ఫీమేల్ గేమ్ డెవలపర్‌పై జరిగే కోఆర్డినేటెడ్ అటాక్ వెనక వాళ్లను ట్రాక్ చేసే ఆమె జర్నీని ఈ థ్రిల్లర్‌గా ప్రజెంట్ చేస్తునాం. అప్లాజ్‌తో మా కలయికలో ఇప్పటికే బ్లాక్ వారంట్ వచ్చింది. ఇప్పుడు ఈ సిరీస్ కూడా చాలా రెలివెంట్‌గా ఉంటుందని అన్నారు.



## 'కె.పి.హెచ్.బి. కాలనీలో' షూటింగ్ షురూ



భీమవరం టాకీస్ బ్యానర్ పై తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మాతగా తల్లాడ సాయికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'కె.పి.హెచ్.బి. కాలనీలో'. షూటింగ్ ప్రారంభమైంది. ఖైరతాబాద్ గణేషుని సమక్షంలో పోలీస్ అధికారులు క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ అంతర్లీనంగా ఒక సందేశాన్ని ఇస్తూ చాలా రిచ్‌గా ఈ సినిమా తీస్తున్నాం. ఆ గణపతి దేవుడు దగ్గర పూజ అనంతరం మా సినిమాల రెగ్యులర్ షూటింగ్స్ మొదలవుతున్నాయి అన్నారు.

## 'ట్రాన్: ఏరీస్' పోస్టర్ విడుదల




ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రాన్: ఏరీస్ చిత్రానికి సంబంధించిన కొత్త పోస్టర్, ట్రైలర్‌ను డిస్నీ విడుదల చేసింది. సైన్స్ ఫిక్షన్‌లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ట్రాన్ (1982), దాని సీక్వెల్ ట్రాన్: లెగసీ (2010) తర్వాత వస్తున్న మూడవ చాప్టర్ ఇది. ఈ చిత్రం భారతదేశంలో అక్టోబర్ 10న ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. డిజిటల్ ప్రపంచం నుండి రియల్ ప్రపంచంలోకి అడుగుపెట్టే అధునాతన ప్రోగ్రామ్ ఏరీస్ ఒక ప్రమాదకరమైన మిషన్‌లో నడిచే కథ ఇది. ఇదే మానవజాతి మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) జీవుల మధ్య మొదటి భేటీగా నిలుస్తుంది. జెఫ్ బ్రిడ్జెస్ మళ్లీ తన పాత్రలో కనిపించడం ఫ్రాంచైజ్ అభిమానులకు పెద్ద ఆకర్షణ. జారెడ్ లేటో ప్రధాన పాత్రలో నటించగా, గ్రెటా లీ, ఎవాన్ పీటర్స్, హసన్ మినహాజ్, జోడీ టర్నర్‌స్మిత్, గిల్లియన్ ఆండర్సన్ వంటి అంతర్జాతీయ తారాగణం కనిపించనున్నారు.

# హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు వెల్లడించారు. తాను పాక్‌కు చెందిన జిహాదీ గ్రూప్ సభ్యుడిగా మెయిల్ పంపిన వ్యక్తి పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. నగరంలో భారీగా భద్రతా బలగాలను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయడానికి బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. సోదాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదన్నారు. నగరంలో అనుమానాస్పద కదలికలను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ముంబయి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా ఇటీవల పాట్నాలోని సివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు బిహార్‌లోకి చొరబడినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో బిహార్ పోలీసు హెడ్ క్వార్టర్స్ రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ జారీ చేసింది. ఉగ్రవాదుల ఫొటోలు, వివరాలను విడుదల చేసింది. వీరు నేపాల్ మీదుగా బిహార్ చేరుకున్నట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు.

# రైలు ప్రయాణికుల రద్దీపై శాస్త్రీయ అధ్యయనం



ప్రజాపక్షం/హైదరాబాద్: రాబోయే పండుగ సీజన్‌లో సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణీకుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు దక్షిణ మధ్య రైల్వే శాస్త్రీయ అధ్యయనం మొదలు పెట్టింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో పండుగ రద్దీని తట్టుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే సమగ్ర ప్రణాళికను రూపొందించింది. గడచిన సంవత్సరాల మాదిరిగానే, జంట నగర ప్రాంతంలోని వివిధ స్టేషన్ల నుండి ప్రసిద్ధ గమ్యస్థానాలకు అదనపు రైలు సర్వీసులు నడిపిస్తారు.సికింద్రాబాద్‌లోని ప్రధాన పునరాభివృద్ధి పనుల దృష్ట్యా, టెర్మినల్ భవనాల ప్రధాన భాగాలు, ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనిచేయవు. సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణీకుల రద్దీని తగ్గించడానికి, రద్దీని నియంత్రించడానికి దక్షిణ మధ్య రైల్వే ఒక సమగ్ర ప్రణాళికను ప్రారంభించింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో సాధారణ రోజుల్లో రోజుకు 1.3లక్షల మంది ప్రయాణికులు పండుగ కాలంలో రోజుకు 2 లక్షలకు పైగా ప్రయాణికులు వస్తుంటారు . సికింద్రాబాద్ స్టేషన్ రాకుండా కొన్ని రైళ్ల మళ్లింపు దక్షిణ మధ్య రైల్వే రద్దీ సమయాల్లో కొన్ని రైళ్లను సనత్‌నగర్అమ్ముగూడమౌలా అలీచర్లపల్లి మీదుగా మళ్లించడం, చర్లపల్లి శాటిలైట్ స్టేషన్లకు మళ్లించారు.

# దూరమయ్యాం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేశారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య నెలకొన్న సాన్నిహిత్యం ప్రపంచ దృష్టిని ఆకర్షించిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'మనం భారతదేశం, రష్యాలను గాఢమైన, అంధకారమైన చైనాకు కోల్పోయినట్లు కనిపిస్తోంది. వారికి సుదీర్ఘమైన, శ్రేయస్కరమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను!'' అని ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. భారత్ వస్తువులపై ట్రంప్ సుంకాలు 50 శాతానికి పెంచడంతో, అందులో రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుకు 25 శాతం అదనపు సుంకం విధించడంతో న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య సంబంధాలు క్షీణించాయి. అదనపు సుంకం ఇప్పటికే ఆగస్టు 27 నుంచి అమల్లోకి వచ్చింది. బీజింగ్‌లో బుధవారం జరిగిన విజయోత్సవ పరేడ్‌కు చైనా అనేక మంది ప్రపంచ నేతలకు ఇవ్వగా, పుతిన్, ఉత్తర కొరియా కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి అమెరికాకు వ్యతిరేకంగా చైనా అధ్యక్షుడు కుట్ర పన్నుతున్నారని ట్రంప్ ఆరోపించారు. 'అధ్యక్షుడు షీ, చైనాలోని అద్భుతమైన ప్రజలు గొప్ప, శాశ్వతమైన వేడుకను జరుపుకోవాలని కోరుకుంటున్నాను' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాశారు.'అమెరికాకు వ్యతిరేకంగా మీరు కుట్ర పన్నుతున్నప్పుడు, వ్లాదిమిర్ పుతిన్, కిమ్ జోంగ్ ఉన్‌లకు నా సాదర శుభాకాంక్షలు తెలియజేయండి.' అని పేర్కొన్నారు.

# సర్వం సన్నద్ధం



(మొదటి పేజీ తరువాయి)

చేశారు. హైడ్రా, పర్యాటకశాఖ సమన్వయంతో హుస్సేన్‌సాగర్‌లో 9 బోట్లను, డిఆర్‌ఎఫ్ టీంలను, 200 గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. పోలీసు సహకారంతో 13 కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేశారు. 303.3 కిలోమీటర్ల మేర ప్రధాన ఊరేగింపు మార్గంలో గణేష్ విగ్రహాల నిమజ్జన శోభాయాత్ర సజావుగా జరిగేందుకు 160 గణేష్ యాక్షన్ టీంలను జిహెచ్‌ఎంసి మోహరించింది. ఇప్పటికే ఈ మార్గంలో జిహెచ్‌ఎంసి రోడ్ల మరమ్మతులు పూర్తి చేసింది.

### స్వచ్ఛతకు పెద్దపీట..

నిమజ్జన కార్యక్రమంలో స్వచ్ఛతకు పెద్దపీట వేసేలా 15 వేల మంది శానిటేషన్ వర్కర్స్‌ను మూడు షిఫ్టులలో పని చేస్తున్నారు. వినాయక చవితి ప్రారంభం ఇప్పటి వరకూ 125 జెసిబిలు, 102 మినీ టిప్పర్‌లు ఉపయోగించి 10,500 మెట్రిక్ టన్నులకు పైగా అధిక వ్యర్థాలను సేకరించి జవహర్‌నగర్లోని ప్రాసెసింగ్ సెంటర్‌కు తరలించారు. గణేష్ ప్రతిమల నిమజ్జనం జరిగే ప్రదేశాలలో 39 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలతో పాటు ఊరేగింపు జరిగే మార్గంలో మొత్తం 56,187 టెంపరరీ లైటింగ్‌ను జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసింది. నిమజ్జనం పూర్తి అయ్యే వరకూ నూరు శాతం లైట్‌లు పని చేసేలా అధికారులు మానిటర్ చేస్తున్నారు. నిమజ్జన పాయింట్‌లలో మూడు షిఫ్టులలో పని చేసేలా అంబులెన్స్‌లతో సహా 7 మెడికల్ క్యాంపులను సిద్ధంగా ఉంచారు.

### ప్రధాన శోభాయాత్ర మార్గాలు ఇవే

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా నగరం నలుమూలల నుంచి విగ్రహాలు హుస్సేన్ సాగర్, ఎన్టీఆర్ మార్గ్ వైపు తరలిరానున్నాయి. ఇందులో అత్యంత ప్రధానమైన బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర బాలాపూర్ నుంచి ప్రారంభమై చాంద్రాయణగుట్ట, చార్మినార్, అబిడ్స్, లిబర్టీ మీదుగా ట్యాంక్‌బండ వైపు సాగుతుంది. అదేవిధంగా, సికింద్రాబాద్ ప్రాంతం నుంచి వచ్చే విగ్రహాలు ప్యాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటాయి. టోలిచౌకీ, మెహిదీపట్నం, లక్డీకాపూల్ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తాయి. టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలను ఎంజే మార్కెట్ వరకు మాత్రమే అనుమతిస్తారు. ఈ ప్రధాన మార్గాలన్నింటిలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రాదేశాలను ఏర్పాటు చేశారు. అడుగడుగునా సిసిటివి కెమెరాలతో పాటు షీటీమ్స్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు.



## హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీక

సిఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీక అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ మహాగణపతిని శనివారం రేవంత్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ గణపతి ఉత్సవాలు 71 ఏండ్లు పూర్తి చేసుకుందన్నారు. దేశంలోనే గణేశ్ ఉత్సవాలంటే ఖైరతాబాద్ గణపతి అని చర్చించుకునేలా ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందిచారు. దేశంలో ఏ రాష్ట్రంలో, ఏ నగరంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వలేదన్నారు. కానీ మన రాష్ట్రంలో గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ అందించింది భక్తితో ఉత్సవాలు నిర్వహించుకునే అవకాశం కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటూ అధికారులను సమన్వయం చేస్తూ పరిష్కరించుకుంటూ ఉత్సవాలకు ఆటంకం కలగకుండా చూశామని తెలిపారు. నిమజ్జనాలకు ఇబ్బంది కలగకుండా ట్యాంక్ బ్ండ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికలు బ్యాలెట్‌తోనే..

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గ నిర్ణయాన్ని న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్‌కె పాటిల్ వివరిస్తూ ఇవిఎంల పట్ల ప్రజలలో విశ్వాసం, విశ్వసనీయత క్షీణించడమే ఈ నిర్ణయానికి కారణమని పేర్కొన్నారు. ఎన్నికల జాబితాలోని వ్యత్యాసాలు, 'ఓటు దొంగతనం' ఆరోపణలను పేర్కొంటూ, స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయడానికి, సవరించడానికి, అవసరమైతే తిరిగి చేయడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అధికారం ఇవ్వాలని కూడా మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. అయితే మంత్రివర్గ నిర్ణయంపై బిజెపి తీవ్ర విమర్శలు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికైన 136 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, రాష్ట్రం నుండి తొమ్మిది మంది కాంగ్రెస్ ఎంపిలు ముందుగా రాజీనామా చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బి వై విజయేంద్ర డిమాండ్ చేశారు. 'వారు బ్యాలెట్ పేపర్ ఉపయోగించి మళ్ళీ ఎన్నికల్లో గెలవాలని లేదా వారు ఓటు దొంగతనం ద్వారా అధికారంలోకి వచ్చినట్లు అంగీకరించాలన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి డి కె శివకుమార్ స్పందిస్తూ బిజెపి ఎందుకు ఆందోళన చెందుతోందని ప్రశ్నించారు. బిజెపి వ్యతిరేకతను 'దొంగల మనసు గందరగోళం' అంటూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఏమి జరిగిందో తాము పరిశోధించామని, ఇప్పుడు దాని గురించి చర్చించాలనుకోవడం లేదన్నారు. బ్యాలెట్ పేపర్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించినదని పేర్కొంటూ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని ఆయన అన్నారు. బెంగళూరులోని ఐదు కార్పొరేషన్లకు జరగనున్న ఎన్నికల్లోనూ బ్యాలెట్ పేపర్ ఉపయోగిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా, శివకుమార్ సమాధానమిస్తూ ప్రభుత్వ నిర్ణయం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించినదని చెప్పారు. హర్యానా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి పాలైన తర్వాత, కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలపై సందేహాలు వ్యక్తం చేసింది. పేపర్ బ్యాలెట్‌కు తిరిగి రావాలని డిమాండ్ చేస్తోంది.

# రాష్ట్రం వేగంగా పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర నిర్మాణానికి ఉపయోగ పడుతుందని ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా భావిస్తుందన్నారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తి గా ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నామని పునరుద్ఘాటించారు. విద్యార్థులు కళాశాల బయటికి వెళ్ళగానే ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి, అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చాకలి ఐలమ్మ పేరుతో మహిళా యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ 500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఐఎస్‌బి నిర్వాహకులు స్కిల్ యూనివర్సిటీని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను సందర్శించి వాటికి అవసరమైన సలహాలను, సూచనలను ఇవ్వాలని కోరారు. తాను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సింగిల్ టీచర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకున్నానని, రాసుకునేందుకు పలకలు కూడా లేక పోవడంతో తమ గురువులు ఇసుక పైనే అక్షరాలు దిద్దిన సందర్భాన్ని డిప్యూటీ సిఎం గుర్తు చేశారు. విద్య అనేది కేవలం ప్రొఫెషనల్స్ తయారు చేయడమే కాదని, సమాజం,మానవత్వం కోసం నాయకులను తీర్చిదిద్దాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ సంకల్పమన్నారు. రాష్ట్రంలోని ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలకు ఐఎస్‌బిలో ఐదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించాలని నిర్వాహకులను భట్టి కోరారు. ఈ కార్యక్రమంలో మోతిలాల్ ఓస్వాల్ డీన్ మదన్ పిల్లుట్ల, ప్రభాత్ సిన్హా, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com